


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY — నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada — ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 24 గురువారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 309

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## మూడో రోజూ దద్దరిల్లిన ఉభయసభలు



- పార్లమెంట్ మూడోరోజూ వాయిదా
- బిహార్ ఓటర్ల జాబితాపై కలకలం
- ప్రతిపక్షాల ఉధృత ఆందోళనలు
- పహల్గాం దాడిపై చర్చ డిమాండ్
- ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జూలై 29న
- లోక్‌సభ-రాజ్యసభలు గందరగోళంలో
- ఎన్నికల ముందు జాబితా మార్పులపై విమర్శలు

2

**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

పహల్గాం ఉగ్రదాడి, ఓటర్ల జాబితా సవరణ అంశాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్నాయి. సమావేశాలు ప్రారంభమైన వరుసగా మూడోరోజైన బుధవారం కూడా ఉభయసభలు అట్టుడికాయి. ప్రతిపక్షాల ఆందోళనలతో ఎలాంటి చర్చ జరగకుండానే ఉభయసభలు వాయిదా పడ్డాయి. ఎగువ సభ, దిగువ సభ రేపు ఉదయం 11 గంటలకు వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలు మొదలవగానే.. బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ పేరుతో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన గళం వినిపించారు. ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు ఆగమేఘాల మీద ఓటర్ల జాబితాను సవరించడం ప్రజాస్వామ్య విరుద్ధమని వారు మండిపడ్డారు. ఎన్నికల వేళ బీజేపీ వ్యతిరేక ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఎన్నికల సంఘం కేంద్రంతో కలిసి కుట్రకు తెరలేపిందని ఆరోపించారు. తీరా ఎన్నికల ముందు ఓటర్ల జాబితాను సవరించడం ఈ మధ్య కాలంలో పరిపాటిగా మారిందని వారు విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణతోపాటు పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్‌పై చర్చకు డిమాండ్ చేశారు. దీంతో ఉభయసభల్లో గందరగోళం నెలకొంది. ఇండియా కూటమి ఎంపీల ఆందోళనలతో సభా కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. సభ్యులు ఎంతకూ తగ్గకపోవడంతో లోక్‌సభ, రాజ్యసభ రేపటి వాయిదా పడ్డాయి. రేపు ఉదయం 11 గంటలకు ఉభయ సభలు తిరిగి సమావేశం కానున్నాయి.

**జూలై 29 నుంచి ఆపరేషన్ సింధూర్‌పై పార్లమెంట్‌లో చర్చ**

పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో.. భారతీయ సైనిక దళాలు .. పాకిస్థాన్‌పై

## బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వవైఖరి

- కేంద్రం బీసీల రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహిస్తాం : సీఎం రేవంత్ రెడ్డి
- బీజేపీ మద్దతు- మాట మార్చిందెందుకు?
- ముస్లిం కోటాపై కిషన్, బండిల విరోధం
- తెలంగాణకు వేరు న్యాయం చేస్తారా?
- 42 శాతం బీసీ రిజర్వేషన్లకు శాస్త్రీయ ఆధారాలు
- కేంద్రంపై ఒత్తిడి - ఇండియా కూటమితో సంప్రదనలు
- మత ప్రాతిపదికన కాదు - వెనుకబాటుతో రిజర్వేషన్లు

2



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

తెలంగాణలో సెప్టెంబర్‌లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని, కేంద్రం త్వరగా రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తే వీలైనంత త్వరగా నిర్వహిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో బీసీల రిజర్వేషన్ల బిల్లుపై సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. బిల్లు ఆమోదం విషయంలో బీజేపీ నాయకత్వం ద్వంద్వవైఖరి అవలంభిస్తోందని, 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి ఇప్పుడు మరోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ముస్లింల శాతాన్ని తీసివేయాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఉంటుందా? అని ప్రశ్నించారు. యూపీ, గుజరాత్, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లను బీజేపీ ఎందుకు తొలగించటం లేదని ఆయన ప్రశ్నించారు. కొన్ని దశాబ్దాల క్రితం నుంచి గుజరాత్‌లో ముస్లిం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని గతంలో మోదీ చెప్పారని గుర్తు చేశారు. ఒక వర్గం పేరు చెప్పి తెలంగాణలో బీసీలకు అన్యాయం చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. తెలంగాణ చేసిన కులగణన సర్వే నమూనాగా నిలువనుంది : రాష్ట్రంలో అన్ని కులాల వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై సర్వే చేశామని, సర్వే ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు రూపొందించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించామని, బిల్లుల ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించామని తెలిపారు. కేంద్రం ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలోని అగ్రనాయకత్వాన్ని కలిసి విజ్ఞప్తి చేశామని, ఇండియా కూటమిలోని నేతలను కూడా కలిసి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. తెలంగాణలో జరిగిన కులగణన విధానాన్ని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు వివరిస్తామని చెప్పారు. కేంద్రం వచ్చే ఏడాది జనగణన, కులగణన చేపట్టనుందని, కేంద్రం చేపట్టే కులగణనకు తెలంగాణ చేసిన కులగణన సర్వే నమూనాగా నిలువనుందని తెలిపారు. మత ప్రాతిపాదికన ఎలాంటి రిజర్వేషన్లు

## అల్ ఖైదా ఉగ్రకుట్ర భగ్నం!

2

- నలుగురు ఉగ్రవాదుల అరెస్ట్
- ఇద్దరు ఉగ్రవాదులను గుజరాత్ నుంచి,
- ఒకరిని ఢిల్లీ నుంచి, మరొకరిని నోయిడా నుంచి పట్టుకున్నట్లు సమాచారం
- లాడెన్ సంస్థ ఉగ్రవాదులుగా గుర్తింపు



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

ఉగ్రవాదులు భారతదేశంలో ఏదైనా పెద్ద ఉగ్రదాడికి పాల్పడాలని చూస్తున్నారు. గుజరాత్ ఏటీఎస్ నలుగురు ఉగ్రవాదులను అరెస్ట్ చేసి భారీ కుట్రను బట్టబయలు చేసింది. ఇద్దరు ఉగ్రవాదులను గుజరాత్ నుంచి, ఒకరిని ఢిల్లీ నుంచి, మరొకరిని నోయిడా నుంచి పట్టుకున్నట్లు సమాచారం. అల్ ఖైదా మాడ్యూల్ భగ్నం గుజరాత్ యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్ అల్ ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్‌కి సంబంధించిన ఒక ఉగ్ర మాడ్యూల్‌ను ఛేదించినట్లు ప్రకటించింది. ఒసామా బిన్ లాడెన్‌కు సంబంధించిన ఈ సంస్థకు చెందిన నలుగురు ఉగ్రవాదులను అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరు గుజరాత్ నుంచి, ఒకరు ఢిల్లీ నుంచి, మరొకరు నోయిడా నుంచి పట్టుబడ్డారు. అరెస్ట్ చేసిన ఉగ్రవాదులను మొహమ్మద్ ఫర్దీన్ (తండ్రి: మొహమ్మద్ రయీస్), సైఫుల్లా ఖురేషి (తండ్రి: మొహమ్మద్ రఫీక్), మొహమ్మద్ ఫైక్ (తండ్రి: మొహమ్మద్ రిజ్వాన్) గా గుర్తించారు. గుజరాత్ యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్ ప్రకారం, నిందితులందరూ 20 నుంచి 25 సంవత్సరాల వయస్సు వారే. ఈ ఉగ్రవాదులు దేశంలో భారీ దాడులకు కుట్ర పన్నుతున్నారు. వారికి ప్రధాన లక్ష్యాలపై దాడి చేయడానికి ఆదేశాలు అందాయి. నలుగురు ఉగ్రవాదులు సోషల్ మీడియా యాప్‌ల ద్వారా ఒకరితో ఒకరు సంబంధాలు కలిగి ఉన్నారని, సరిహద్దు అవతల నుంచి కూడా వారికి పరిచయాలు ఉన్నాయని వెల్లడైంది. ఏటీఎస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ సునీల్ జోషి మాట్లాడుతూ.. ఈ కేసుపై

## నరకంలా మారిన గాజా

2

## చైనాపై భారత్ మెతక వైఖరి?

## ఉపరాష్ట్రపతి ఎన్నికలకు కసరత్తు మొదలుపెట్టిన ఈసీ

- ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఏర్పాట్లు
- ఈసీ కసరత్తు మొదలు
- ఎన్నికల షెడ్యూల్ త్వరలో
- ఎలక్టోరల్ కాలేజీ సిద్ధం
- అధికారుల నియామకంలో తలమునక
- రాజీనామా పంపిన జగదీప్ ధన్‌కడ్



2

**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

జగదీప్ ధన్‌కడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవి కోసం త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఈ కసరత్తు పూర్తవగానే ఎన్నికల షెడ్యూల్ ను ప్రకటించనుంది. ఇప్పటికే ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం ఎలక్టోరల్ కాలేజీని సిద్ధం చేయడంలో, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించడంలో ఈసీ బిజీ అయిపోయింది. ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవి ఖాళీకాగానే రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహిస్తుంది. ఆ మేరకు ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం ఈసీ కసరత్తు చేస్తోంది. అనారోగ్య కారణాలతో తాను ఉపరాష్ట్రపతి పదవి నుంచి తప్పుకుంటున్నానని పేర్కొంటూ జగదీప్ ధన్‌కడ్ ఈ నెల 21న రాత్రి రాష్ట్రపతికి తన రాజీనామా పంపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 22న ఆ రాజీనామాకు ఆమోదం తెలిపారు. అనంతరం కేంద్ర హోంశాఖకు పంపారు. కేంద్ర హోంశాఖ ఉపరాష్ట్రపతి రాజీనామాను ఆమోదించిన విషయాన్ని పార్లమెంట్ ఉభయసభలకు సభాధ్యక్షుల ద్వారా తెలియజేసింది.

## తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు ఆధ్యాత్మిక యాత్ర ఆఫర్లు

- భక్తులకు శుభవార్త: ఆగస్టు 1న ప్రారంభం
- సూర్యాపేట డిపో ప్రత్యేక ప్యాకేజీ వివరాలు
- పుణ్యక్షేత్రాల యాత్ర కోసం సూపర్ లగ్జరీ బస్సులు
- ప్రయాణ వివరాలు, ఛార్జీలు, బుకింగ్ విధానం
- ఖమ్మం డిపో: యాదగిరిగుట్ట-స్వర్ణగిరి దర్శన ప్యాకేజ్
- కొత్తగూడెం డిపో: విజయవాడ, అమరావతి యాత్రలు
- మహాలక్ష్మి పథకం విజయోత్సవం - 200 కోట్ల ఉచిత ప్రయాణాలు
- సత్తుపల్లి డిపో: పారిజాతకొండ-ద్వారకా తిరుమల సేవలు

2




**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) తన ఆదాయాన్ని పెంచుకోవడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి నూతన ప్రయోగాలు చేస్తోంది. ఈ క్రమంలో.. సూర్యాపేట డిపో భక్తుల కోసం ప్రత్యేకమైన ఆధ్యాత్మిక పర్యటన ప్యాకేజీని ప్రకటించింది. సూర్యాపేట పట్టణంతో పాటు.. పరిసర జిల్లాలోని భక్తులకు ఇది శుభవార్త అనే చెప్పాలి. ఈ ప్యాకేజీలో భాగంగా.. సూపర్ లగ్జరీ బస్సు పలు ప్రముఖ పుణ్యక్షేత్రాలకు సేవలు అందిస్తుంది. సూర్యాపేట నుంచి పుణ్యక్షేత్రాల యాత్ర.. విజయవాడ (కనకదుర్గ అమ్మవారు), ద్వారకా తిరుమల, సామర్లకోట, పిఠాపురం, మంగళగిరి (పానకాల లక్ష్మీ నరసింహ స్వామివారు), 12వ శక్తి పీఠం, సింహాచలం, శ్రీ కూర్మం, అర్షవెల్లి, వైజాగ్ నగరం, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలకు ఈ సూపర్ లగ్జరీ బస్సు సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రత్యేక యాత్ర ఆగస్టు 1వ తేదీ రాత్రి 11 గంటలకు సూర్యాపేట కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమై.. తిరిగి ఆగస్టు 4వ తేదీ రాత్రి 8 గంటలకు సూర్యాపేట బస్ స్టేషన్ చేరుకుంటుంది. ఈ టూర్ ప్యాకేజీకి అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం కూడా కల్పించారు. సూర్యాపేట

## గ్లోబల్ గేట్‌వే ఏపీ

- అపార అవకాశాలున్నాయి.. పెట్టుబడులతో రండి
- యూఏఈ పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు పిలుపు
- ఏడాదిలో 120 బిలియన్ డాలర్ల
- పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం
- ఏపీలో విస్తృతంగా వనరులు ఉన్నాయి
- భారత్‌కు వచ్చాక ముందు ఏపీని చూడండి
- ఇన్వెస్టోపియా గ్లోబల్-ఏపీ సదస్సులో సీఎం

2

"రాష్ట్రంలో కొత్తగా నెలకొల్పే ప్రాజెక్టులు, పారిశ్రామిక పెట్టుబడులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తా"



**అమరావతి-నవభూమిబ్యూరో**

అంతర్జాతీయ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గేట్‌వేగా మారుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్.. ఉత్తర-దక్షిణ భారతాలకు వారధిగా నిలుస్తోందన్నారు. ఏపీని సందర్శించిన తర్వాతే భారత్‌లో ఇతర ప్రాంతాలకు వెళ్లాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాష్ట్రంలో అపార అవకాశాలున్నాయని, ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. పెట్టుబడులు వస్తేనే సంపద సృష్టికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఏడాది కాలంలో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే విధానాలకు రూపకల్పన చేశామని తెలిపారు. పెట్టుబడులు పెట్టడానికి నమ్మకం ముఖ్యమని, రాష్ట్రంలో కొత్తగా నెలకొల్పే ప్రాజెక్టులు, పారిశ్రామిక పెట్టుబడులకు తాను సమన్వయకర్తగా వ్యవహరిస్తానని చెప్పారు. ఆచరణాత్మక ప్రతిపాదనలతో వచ్చి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. యూఏఈ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహించిన 'ఇన్వెస్టోపియా గ్లోబల్-ఆంధ్రప్రదేశ్' సదస్సులో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## చరిత్ర సృష్టించిన దివ్య దేశ్‌ముఖ్

2

## టీ, కాఫీ విక్రయాలు బంద్



- జీఎస్టీ నోటీసులపై వ్యాపారుల ఆగ్రహం
- టీ, కాఫీ, పాల విక్రయాలు నిలిపివేత
- బ్లాక్ టీ, బ్లాక్ బ్యాడ్జిలతో నిరసన
- జూలై 25న ఫ్రీడమ్ పార్క్ ర్యాలీ
- సీఎం సిద్దరామయ్యతో వ్యాపారుల సమావేశం
- యూపీఐ ఆధారంగా జీఎస్టీ లెక్కలు
- నగదు లావాదేవీల వైపు మొగ్గు

9

## బీజేపీలోకి రాజాసింగ్ రీఎంట్రీ?

- మార్గం సుగమం చేసిన ఎంపీ ధర్మపురి అరవింద్..!
- పార్టీ అధ్యక్ష పదవికి రామచంద్రరావును ఎంపిక చేయడం పట్ల
- అసంతృప్తి వ్యక్తం చేస్తూ రాజీనామా చేసిన రాజాసింగ్
- పార్టీ కోరితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న రాజాసింగ్
- రాజాసింగ్ విషయంలో పార్టీ అధిష్టానం యూటర్న్

2



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

బీజేపీ అధిష్టానం వైఖరిపై అలిగి ఆ పార్టీకి గుడ్ బై చెప్పేసిన గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ తిరిగి ఆ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారా ? పార్టీ నుంచి తనంతట తానే వెళ్లిపోయిన రాజా సింగ్ విషయంలో బీజేపీలోని పలువురు నేతలకు సాను భూతి ఉందా ? అదే ఇప్పుడు ఆయన రీఎంట్రీకి మార్గం సుగమం చేస్తుందా అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఈ వాదనకు మద్దతుగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇవాళ రాజా సింగ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవికి రామచంద్రరావును ఎంపిక చేయడంపై తీవ్ర అసంతృప్తితో పార్టీకి రాజీనామా చేసిన గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ ఆ తర్వాత పార్టీ కోరితే ఎమ్మెల్యే పదవి కూడా వదులుకుంటానని ప్రకటించారు. దీంతో ఓ దశలో గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన మాధవీలత సైతం రేసులోకి వచ్చేశారు. ఈ నేపథ్యంలో రాజా సింగ్ ఎమ్మెల్యే పదవి విషయంలో అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆయన రీఎంట్రీపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇవాళ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింగ్ రాజా

## ఉపరాష్ట్రపతి ఎన్నిక వేళ జగన్ మార్క్

- ఎన్నికల కసరత్తు ప్రారంభం
- జగన్ నిర్ణయంపై ఉత్కంఠ
- గతంలో ఎన్డీఏకి వైసీపీ మద్దతు చరిత్ర
- కేసుల నేపథ్యంలో జగన్ వ్యూహం
- జగన్ అడుగు - భవిష్యత్ రాజకీయాలకు కీలకం
- ఎలక్టోరల్ కాలేజీ - ఓటింగ్ విధానం
- ఏపీలో మూడు పార్టీలు - ఎన్డీఏకి స్పష్టమైన మద్దతు
- ధన్కర్ రాజీనామా -అసాధారణ పరిణామం

2



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఉప రాష్ట్రపతి ఎన్నిక వేళ ఏపీ కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ధన్కర్ రాజీనామా ఆమోదంతో ఎన్నికల సంఘం ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం కసరత్తు మొదలు పెట్టింది. లోక్ సభ - రాజ్యసభ సభ్యులతో కూడి ఎలక్టోరల్ కాలేజీ ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. ఏపీ నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీల ఎంపీలు ఎన్డీఏ అభ్యర్థికే ఓటు వేస్తారు. మరి.. వైసీపీ ఓటు ఎవరికి. జగన్ నిర్ణయం ఏంటి. ప్రస్తుత పరిణామాల్లో జగన్ ఇదే అంశం పై నిర్ణయం.. రాజకీయంగా కీలక మలుపు కానుంది. ఉపరాష్ట్రపతి ఎన్నిక ఆకస్మికంగా ఉపరాష్ట్రపతి ధన్కర్ తన పదవికి రాజీనామా చేసారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో ఈ వ్యవహారం సంచలనంగా మారింది. ఇదే సమయంలో వెంటనే కొత్త ఉపరాష్ట్రపతిని ఎంపిక చేయా లని ప్రధాని మోదీ డిసైడ్ అయ్యారు. తాజాగా రాష్ట్రపతి ధన్కర్ రాజీనామా ఆమోదించటంతో అటు ఎన్నికల సంఘం ఈ ఎన్నిక కోసం కసరత్తు మొదలు పెట్టింది. కాగా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 66 ప్రకారం.. పార్లమెంటు ఉభయ సభల (లోక్‌సభ, రాజ్యసభ) సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. ఈ

## చరిత్ర సృష్టించిన దివ్య దేశ్‌ముఖ్.. తొలి భారతీయ మహిళగా అరుదైన ఘనత

**నవ వార్త**





**న్యూఢిల్లీ-నవభూమి:** 2026 మహిళల క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌కు కూడా అర్హతభారత యువ చెస్ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. ఆమె సెమీఫైనల్ లో మాజీ ప్రపంచ ఛాంపియన్ తాన్ ఝోంగీని 1.5–0.5 తేడాతో ఓడించింది. ఈ టోర్నమెంట్ చరిత్రలో ఫైనల్‌కు చేరిన మొదటి భారతీయ మహిళగా దివ్య దేశ్‌ముఖ్ చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో ఆమె తన మొదటి గ్రాండ్ మాస్టర్ (జీఎం) నార్మ్‌ను కూడా సాధించింది. మహారాష్ట్రకు చెందిన 19 ఏళ్ల దివ్య తెల్లపావులతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. దీంతో పాటు ఆమె 2026 మహిళల క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌కు కూడా అర్హత సాధించింది.
ప్రపంచ నంబర్ 18 అయిన దివ్య మంగళవారం జరిగిన మొదటి గేమ్‌లో నల్లపావులతో ఆడి డ్రా చేసుకుంది. అయితే, నిన్న జరిగిన రెండో గేమ్‌లో ఆమెకు తెల్లపావులతో ఆడటం ప్రయోజనకరంగా మారింది. ఆమె మిడ్ గేమ్‌లో తాన్ ఝోంగీ చేసిన తప్పులను అనుకూలంగా మార్చుకుని దూసుకెళ్లింది. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం అద్భుత విజయంగా మార్చుకుంది. ప్రత్యర్థిని 101 ఎత్తుల్లో ఓడించి ఫైనల్‌కి అర్హత సాధించింది. ఈ గెలుపు భారత మహిళా చెస్‌కు గొప్ప విజయమని చెప్పొచ్చు.ఇదిలా ఉండగా.. గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి రెండో సెమీఫైనల్ చైనాకు చెందిన లీ టింగీతో డ్రా అయింది. ఇప్పుడు ఆమె టై-బ్రేక్ ఆడనుంది. ఈ ఇద్దరు క్రీడాకారిణులు ఈ రోజు రాపిడ్, బ్లిట్జ్ టై-బ్రేక్ గేమ్స్ ఆడతారు. దీని ద్వారా ఫైనల్‌లో రెండో స్థానం ఎవరికి లభిస్తుందో తెలుస్తుంది. ఇందులో గెలిచిన విజేతతో దివ్య దేశ్‌ముఖ్ ఫైనల్ ఆడుతోంది.

## ఉపాధి హామీలో జియో ట్యాగింగ్ - అలా చేయడం కుదరదిక!



**హైదరాబాద్-నవభూమి:**గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీల వలసలు అరికట్టేందుకు, ఉన్న ఊరిలోనే పనులు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. చెరువులు, కుంటలు, బావులు, నదులు, కాలువల్లో పూడికతీత, వ్యవసాయ క్షేత్రాలను చదును చేయడం, రహదారుల నిర్మాణం, వర్షపు నీరు ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతల ఏర్పాటు, మహోత్సవంలో మొక్కలు నాటి చుట్టూ రక్షణ కంచెలు వంటి తదితర వాటితో ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తోంది.
ఇప్పటికే కూలీల హాజరు పకడ్బందీగా అమలుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) విధానాన్ని తీసుకొచ్చింది. ఉదయం పనులకు వచ్చిన వారి ఫొటో తీయడం పూర్తి అయిన తర్వాత మరోసారి చరవాణితో చిత్రం తీసి సదరు పోర్టల్లో నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది. సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినా కొందరు అందులోని కొన్ని లొసుగులతో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. చేసిన పనులే మళ్లీ చేయడం వంటివి చేస్తున్నారు. అలాంటి వాటిని పూర్తిగా అరికట్టేందుకు పారదర్శకత పెంపునకు పెద్ద పీట వేస్తూ కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంది.
పకడ్బందీగా : పనుల ఎంపిక సమయంలో గ్రామసభలు నిర్వహించి గుర్తిస్తారు. వాటి ఆమోదం, ప్రాధాన్యతతో ఎంపీడీవోలకు అక్కడి నుంచి గ్రామీణాభివృద్ధిశాఖ అధికారికి నివేదికలు చేరుతాయి. సదరు దస్త్రాలను జిల్లా కలెక్టర్ తుది పరిశీలన చేపట్టి ఆమోదం ఇవ్వనున్నారు. ఇన్ని స్థాయిల్లో పరిశీలనలు చేస్తున్నా చేసిన పనినే మళ్లీ చేసి నట్లు రికార్డులు సృష్టించడం, మరోసారి గుర్తించడం వంటివి చేస్తూ నిధుల దుర్వినియోగానికి కొందరు పాల్పడుతున్నారు. వీటికి పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు జియో సెన్సింగ్ విధానాన్ని రూపొందించారు.ఒక ప్రదేశంలో పని గుర్తించే ముందుగా జియో ట్యాగింగ్ చేయనున్నారు. పని ప్రదేశం ఎంత విస్తీర్ణం, అయ్యే వ్యయం, తదితర వాటి అంచనాను టెక్నికల్ అసిస్టెంట్లు రూపొందించనున్నారు. సదరు అదికారుల ఆమోదంతో తుదిగా కలెక్టర్?కు చేరుకుంటుంది. ఒక పని చేస్తే మళ్లీ అదే దానిని చేసే వీలు లేకుండా దీన్ని రూపొందించారు. జవాబుదారీతనాన్ని మెరుగుపర్చేందుకు, హాజరు పర్యవేక్షణ, కూలీలు, పనులు, తదితర వాటిని ప్రతిఒక్కరూ తెలుసుకునేలా 'జన్ మన్ రేగా' తీసుకొచ్చారు. 'ఉపాధి'కి సంబంధించిన పూర్తి సమాచారం సాధారణ వ్యక్తులు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. పారదర్శకత పెంపునకు, కూలీలు పూర్తి స్థాయిలో ఆర్థికాభివృద్ధి సాధించే లక్ష్యంగా ప్రభుత్వం ఈ రెండింటిని అమల్లోకి తీసుకొచ్చింది.

## నరకంలా మారిన గాజా..

### ఇజ్రాయెల్ దాడుల్లో 72 మంది మృతి

**గాజా-నవభూమి:**ఇజ్రాయెల్ దాడులను ఎదుర్కొంటున్న గాజాలో పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. గత 24 గంటల్లో ఇజ్రాయెల్ కాల్పులు, దాడుల్లో దాదాపు 72 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. అదే సమయంలో గత 72 గంటల్లో 21 మంది గాజాలోని పిల్లలు ఆకలితో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో నెలన్నర శిశువు కూడా ఉన్నాడు. గాజాలో 21 నెలలుగా జరుగుతున్న యుద్ధంలో మునుపటి కంటే పోషకాహార లోపం పాలస్తీనియన్ల ప్రాణాలను వేగంగా హరిస్తోంది. యూఎన్ ఏజెన్సీ గాజాను నరకంతో పోలుస్తూ.. ప్రజలు జీవించాలనే ఆశలు కూడా కోల్పోతున్నారని పేర్కొంది. ! పాలస్తీనా ఆరోగ్య అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఘర్షణల్లో గాజాలో దాదాపు 101 మంది ఆకలితో చనిపోయారు. వీరిలో 80 మంది పిల్లలు ఉన్నారు. వీటిలో ఎక్కువ మరణాలు ఇటీవలి వారాల్లో సంభవించాయి. గాజాకు సహాయ సరఫరాపై ఇజ్రాయెల్ నియంత్రణ ఉంది. ఇజ్రాయెల్ గాజాలోని జనాభాకు సాయం అందకుండా అడ్డుకోవడంతో ప్రాథమిక అవసరాలకు తీవ్ర కొరత ఏర్పడింది. పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం అంటే ఇదే.. అట్లుంటది మనతోని.. పెద్దిరెడ్డిని కలిసింది నిజమే కానీ.. ! వైరల్ వీడియోపై కొలికపూడి క్లారిటీ..! పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్ ఇంత దారుణమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు.. ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల ఏజెన్సీ అధిపతి మంగళవారం గాజా పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, 'మా సిబ్బంది, వైద్యులు, మానవతా కార్యకర్తలు ఆకలి, అలసట కారణంగా విధుల్లో ఉండగానే స్పృహ కోల్పోతున్నారు. గాజాలోని పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, దీనిని 'భూమిపై నరకం' అని మాత్రమే పిలవగలం' అని అన్నారు. ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల ఏజెన్సీ అంచనా ప్రకారం.. మే చివరి నుంచి ఇప్పటివరకు ఆహారం కోసం వెతుకుతున్న 1,000 మంది ఆకలితో మరణించారు. సహాయ కేంద్రాల వద్ద ఆహారం కోసం వచ్చిన గుంపుపై కాల్పులు జరపడం గతంలో ఎన్నడూ చూడలేదని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల ఏజెన్సీకి చెందిన ఫిలిప్ లాజరిని అన్నారు.

### కొత్తగా రేషన్‌కార్డు తీసుకున్న వారికి అలర్ట్..

## ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీలకు దరఖాస్తులు..



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన పేద కుటుంబాలు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలలో భాగంగా లభించే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , రూ.500కు వంట గ్యాస్ సిలిండర్ ప్రయోజనాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి పరుగులు పెడుతున్నారు. గత వారం రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కూడా కలెక్టరేట్‌లు, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల వద్ద దరఖాస్తుదారుల రద్దీ గణనీయంగా పెరిగింది.అయితే.. ఇక్కడ ఒక ప్రధాన అడ్డంకి ఎదురవుతోంది. ఏడాదిన్నర క్రితం ప్రజాపాలన కార్యక్రమంలో విద్యుత్, గ్యాస్ సబ్సిడీల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం లభిస్తోంది. అప్పట్లో దరఖాస్తు చేసుకోని వారికి పరిస్థితి అగమ్యగోచరంగా మారి, గంటల తరబడి క్యూలో నిలబడి నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల మంజూరుతో సుమారు 58,565 కుటుంబాలు ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత సాధించాయి. హైదరాబాద్ జిల్లాలో 43,115, రంగారెడ్డి జిల్లాలో 8,680, మేడ్చల్%-%మల్కాజిగిరి జిల్లాలో 6,770 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ఈ కుటుంబాలన్నీ ఇప్పుడు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సన్నద్ధమవుతున్నాయి. దురదృష్టవశాత్తు.. ఈ కొత్తగా అర్హత పొందిన కుటుంబాలలో సగానికి పైగా గత ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోలేకపోయాయి. దీంతో వారి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు కావట్లేదు. ఎందుకంటే దరఖాస్తు ప్రక్రియ ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌తో ముడిపడి ఉంది.ఆరు గ్యారెంటీల అమలులో వ్యత్యాసాలు..
వాస్తవానికి.. ఇప్పటికే తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉండి అర్హత సాధించిన కుటుంబాలు సైతం కేవలం ఉచిత విద్యుత్‌కు మాత్రమే పరిమితమయ్యాయి. వంట గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ అందిస్తున్నప్పటికీ, మెజారిటీ బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువన) కుటుంబాలకు అది వర్తించడం లేదు. ఒకే కుటుంబం గృహలక్ష్మి పథకానికి అర్హత సాధించినా.. మహాలక్ష్మి పథకానికి మాత్రం అర్హత సాధించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీంతో అనేక కుటుంబాలు పూర్తిస్థాయి బహిరంగ మార్కెట్ ధర చెల్లించి వంట గ్యాస్ సిలిండర్‌ను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.
ఉచిత విద్యుత్ లబ్ధిదారుల వివరాలు..మహానగర పరిధిలో మొత్తం వంట గ్యాస్ కనెక్షన్లు సుమారు 31.18 లక్షలు ఉండగా.. అందులో కేవలం కొద్దిమందికి మాత్రమే రూ.500కు సబ్సిడీ వంట గ్యాస్ వర్తిస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం.. సుమారు 24.74 లక్షల కుటుంబాలు మహాలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకున్నాయి. వారిలో సుమారు 19.01 లక్షల కుటుంబాలు తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. అయితే.. పౌర సరఫరాల శాఖ గణాంకాలు సబ్సిడీ గ్యాస్ కేవలం మూడు లక్షల లోపు కనెక్షన్‌దారులకు మాత్రమే ఎంపికైనట్లు స్పష్టం చేస్తున్నాయి. ఇది మిగతా సుమారు 16 లక్షల కనెక్షన్ల లబ్ధిదారులకు సబ్సిడీ అందని ద్రాక్షగా మారింది.ఇక గృహ విద్యుత్ కనెక్షన్లు సుమారు 52,65,129 ఉండగా.. ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ కోసం 24 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో 11 లక్షల కుటుంబాలు మాత్రమే జీరో బిల్లుకు అర్హత సాధించాయి. మిగిలిన కుటుంబాలు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించి, ఆరు గ్యారెంటీలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పారదర్శకమైన విధానాన్ని అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. తెలంగాణ వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డులు పొందిన వారు ఫిజికల్ కార్డులు పొందేందుకు ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉంది.

## మంత్రి పదవి అక్కర్లేదు.. నాకు మునుగోడు ప్రజలే ముఖ్యం:

### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**హైదరాబాద్-నవభూమి:**కొద్దికాలంగా నిత్యం వార్తల్లో నిలుస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి కంటే మునుగోడు ప్రజలే ముఖ్యమని.. ఎల్బీ నగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి ఆఫర్ వచ్చినా తిరస్కరించినట్లు ఆయన చెప్పారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.నల్గొండ జిల్లా మునుగోడు మండలంలో లబ్ధిదారులకు బుధవారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఎల్బీ నగర్ నుంచి పోటీ చేయాలని అధిష్టానం సూచించినా, తాను మునుగోడు నుంచే బరిలోకి దిగానని చెప్పారు. నల్గొండ జిల్లా నుంచి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి ఉన్నారని.. ఎల్బీ నగర్ నుంచి పోటీ చేస్తే తనకు మంత్రి పదవి ఇస్తారని ఆ నాడు కాంగ్రెస్ పెద్దలు చెప్పారని రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు.2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ జిల్లా నుంచి అందరూ ఓడిపోతే, కాంగ్రెస్ పార్టీ నుంచి తానొక్కడినే గెలిచానని రాజగోపాల్ రెడ్డి ప్రజలకు గుర్తు చేశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కూడా నైతిక విజయం తనదేనని, అందుకే మంత్రి పదవి కంటే తనకు మునుగోడు ప్రజలే ముఖ్యమని చెప్పారు. ఎప్పుడయినా మునుగోడు నుంచే పోటీ చేస్తానంటూ ఆయన స్పష్టం చేశారు. మునుగోడులో ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన రాజగోపాల్ రెడ్డి, అనంతరం బీజేపీలో చేరారు. అయితే బీజేపీలో తగిన ప్రాధాన్యత దక్కకపోవడంతో తిరిగి సొంత గూటికే చేరుకున్నారు.ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తప్పుబట్టారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానంటూ రేవంత్ ప్రకటించారు. దాంతో రాజగోపాల్ రెడ్డి కౌంటర్ అటాక్ ఇస్తూ రేవంత్ ప్రకటన కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకమంటూ ట్వీట్ చేశారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్టానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుందని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు అంటూ ఘాటుగానే ట్వీట్ చేశారు.

## ఉద్యోగాలు చేస్తూనే పట్టభద్రులు కావాలనుకుంటున్నారా?

### - అయితే ఈ అవకాశం మీ కోసమే




**హైదరాబాద్-నవభూమి:** పట్టాలేని వారికి, కళాశాలకు వెళ్లకుండా డిగ్రీ పూర్తి చేయాలనుకుంటున్న వారికి, ఆర్థిక స్తోమత లేని వారికి జనగామలోని ఏబీవీ ప్రభుత్వ కళాశాలలోని డా.బీ.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ కేంద్రం దారి చూపుతోంది. రెగ్యులర్ డిగ్రీతో సమానమైన అవకాశాలు కల్పిస్తుండటంతో దూరవిద్యలో ప్రవేశాల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ సాధనకు దీని ధ్రువీకరణ పత్రాన్ని అంగీకరిస్తుండడంతో చాలామంది దూరవిద్యలో చదివేందుకు మొగ్గు చూపుతున్నారు.
**34 ఏళ్ల కిందట స్థాపన :** మూడు దశాబ్దాల కిందటే గ్రామీణ ప్రాంతాల్లోని నిరు పేద విద్యార్థులకు చదువును అందించాలనే సంకల్పంతో 1991 జనగామలో ఈ విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రాన్ని స్థాపించారు. ప్రారంభంలో 50 నుంచి 70 వరకు ఉన్న ప్రవేశాల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. అప్పటి నుంచి వేలాది మంది పట్టభద్రులు కాగా వందలాది మంది వివిధ రకాలైన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సాధించినట్లు స్థానిక సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యాపకులు చెబుతున్నారు.అర్హులు ఎవరంటే ! : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) దూరవిద్యలో దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇంతకు ముందు వరకు దూరవిద్యలో ప్రవేశం పొందాలంటే 18 ఏళ్లు నిండిన వారు, పదోతరగతి, ఇంటర్ అనుత్తీర్ణులైన, మధ్యలో చదువు ఆపేసిన వారు, గృహిణులను మాత్రమే ఇందుకు అర్హులుగా పరిగణించేవారు. 2017–18 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ లేదా తత్సమాన పరీక్షలు నెగ్గితేనే దూర విద్య డిగ్రీలోకి తీసుకోవాలన్నా నిబంధనలు అమలు అవుతున్నాయి.ఇంటర్మీడియట్ లేదా సమాన అర్హతలు (ఓపెన్ ఇంటర్, రెండేళ్ల పాటు ఐటీఐ, పాలిటెక్నిక్) కలిగిన విద్యార్థులను ఇందులో ప్రవేశం పొందేందుకు అర్హులుగా పరిగణించారు. బీఏ, బీకాం(జనరల్, కంప్యూటర్), బీఎస్సీ తదితర కోర్సులుండగా తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టులనే ఎంచుకోవచ్చు. రెగ్యులర్ డిగ్రీతో సమానంగా దూరవిద్యకూ అవకాశాలు ఉన్నాయి. ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నందున అర్హులైన విద్యార్థులు నిర్ణీత తేదీలోగా ఆన్‌లైన్‌లో గానీ, ఆఫ్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవచ్చని అధ్యయన కేంద్రం సమన్వయకర్త భవాని తెలిపారు.

## చైనాపై భారత్ మెతక వైఖరి?

**న్యూఢిల్లీ-నవభూమి:**చైనాపై భారత్.. సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. చైనా పర్యాటకులు, వ్యాపారవేత్తలు, ఇతర సందర్శకులకు విసాలను మం జూరు చేయాలని నిర్ణయించింది. ఇది వరకు నిలిపివేసిన విసాల జారీని పునరుద్ధరించనుంది. కొత్త విసాల జారీ గురువారం నుంచి ప్రారంభం కానుంది. చైనా సందర్శకులు, పర్యాటకులకు విసాలను పునరుద్ధరించడం అయిదు సంవత్సరాల తరువాత ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. 2020లో వీటిని నిలిపివేసింది కేంద్ర ప్రభుత్వం. లధక్ తూర్పు ప్రాంతం సమీపంలో వాస్తవాధీన రేఖ వద్ద గల గాల్వన్ వ్యాలీలో 2020 జూన్ 15, 16వ తేదీల్లో భారత్- చైనా సైనికుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. జూలై 31 వరకు ఈ రాశులకు తిరుగేలేదు..!" అప్పటి ఘటనలో 20 మంది భారత జవాన్లు వీరమరణం పొందారు. ఆ ఘర్షణల్లోనే తెలంగాణకు చెందిన కల్నల్ బీకుమల్ల సంతోష్ బాబు అమరుడయ్యారు. ఈ ఘర్షణల నేపథ్యంలో అప్పట్లో విసాలను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ ఘర్షణలు జరిగినప్పటి నుంచి వాస్తవాధీన రేఖ వద్ద యుద్ధ వాతావరణం కొనసాగుతూనే వచ్చింది. వాస్తవాధీన రేఖ వద్ద భారత్–చైనా సరిహద్దు వెంబడి రెండు వైపులా వేలాదిమంది సైనికులు మోహరించారు. పాంగ్యాంగ్ త్సో సరస్సు, గాల్వన్ వ్యాలీ, డెప్సాంగ్, డెమ్‌చోక్ వంటి ప్రాంతాల్లో సైనికులు యుద్ధానికి సిద్ధం అయ్యారు. ఆ తర్వాత రెండు దేశాల మధ్య ఆర్మీ కార్ప్స్ కమాండర్ స్థాయిలో శాంతి చర్చలు ఏర్పాటయ్యాయి. అనేక దఫాలుగా సాగాయి. సైనిక బలగాలను వెనక్కి పిలిపించుకోవాలనే సింగిల్ అజెండా కింద చర్చలను నిర్వహించారు. బోర్డర్ ఆఫీసర్స్ మీటింగ్ పాయింట్ వద్ద సుదీర్ఘంగా కొనసాగాయి. ఉద్రిక్తతను చల్లార్చడానికి రెండు దేశాల సైన్యాధికారులు అప్పట్లో కొన్ని కీలక నిర్ణయాలను తీసుకున్నారు. పరస్పర అంగీకారానికి వచ్చారు.రెండు దేశాల మధ్య కొనసాగుతోన్న విభేదాలను రూపుమాపేలా, శాంతియుత వాతావరణం నెలకొల్పేలా ముందడుగు వేశారు. మూడుదశల్లో బలగాలను వెనక్కి పిలిపించుకోవడానికి రెండుదేశాల సైన్యాధికారుల మధ్య అంగీకారం కుదిరింది.

## బీజేపీలోకి రాజాసింగ్ రీఎంట్రీ?

**(1వపేజీ తరువాయి)**సింగ్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. రాజా భాయ్ ఎక్కడున్నా గౌరవిస్తామంటూ ధర్మపురి అరవింద్ తెలిపారు. బీజేపీ నుంచి ఆయన సస్పెండ్ కాలేదని, కేవలం రాజీనామా మాత్రమే చేశారని గుర్తుచేశారు. అక్కడితో ఆగకుండా తిరిగి ఆయన బీజేపీలోకి రావచ్చంటూ వ్యాఖ్యానించారు. కొన్ని విషయాల్లో మనస్తాపం చెంది రాజాభాయ్ రాజీనామా చేశారని చెప్పుకొచ్చారు. అలాగే రాజా సింగ్ రాజకీయాల కంటే సిద్ధాంతాలు ఉన్న వ్యక్తి అని ధర్మపురి అరవింద్ తెలిపారు. ఆయన పార్టీలోకి తిరిగి వచ్చేందుకు అవకాశం ఉందని తెలిపారు. త్వరలో పార్టీ సభ్యత్వ డ్రైవ్ ఉంటుందని, అందులో మిస్డ్ కాల్ ఇస్తే చాలు తిరిగి పార్టీలోకి రావొచ్చంటూ ర్జాజా సింగ్ కు ఆయన ఆఫర్ కూడా ఇచ్చేశారు. దీంతో ధర్మపురి అరవింద్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాజా సింగ్ ను తిరిగి పార్టీలోకి రప్పించేందుకు బీజేపీలో ఓ వర్గం గట్టిగా ప్రయత్నిస్తోందన్న చర్చ నేపథ్యంలో అరవింద్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

## మూడో రోజూ దద్దరిల్లిన ఉభయసభలు

**(1వపేజీ తరువాయి)**ఆపరేషన్ సింధూం చేపట్టిన విషయం తెలిసిందే. పాక్‌లో ఉన్న 9 ఉగ్రస్థావరాలను ఆ ఆపరేషన్ సమయంలో నేలమట్టం చేశారు. అయితే ఆ అంశంపై చర్చించేందుకు పార్లమెంట్ రెడీ అయ్యింది. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సింధూర్‌పై చర్చించనున్నారు. జూలై 29వ తేదీన ఆ చర్చ జరగనున్నది. లోక్‌సభలో 16 గంటలు, రాజ్యసభలో 9 గంటల పాటు చర్చించేందుకు సమయాన్ని కేటాయించినట్లు ఓ మీడియా కథనం ద్వారా తెలుస్తోంది.

## తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు ఆధ్యాత్మిక యాత్ర ఆఫర్లు

**(1వపేజీ తరువాయి)**నుండి పెద్దలకు ఛార్జీ రూ.3,400 కాగా, పిల్లలకు రూ.1,800 గా నిర్ణయించారు. బుకింగ్‌ల కోసం 9948303712 నంబర్‌కు ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా చెల్లింపులు చేయవచ్చు అని ఆర్టీసీ ప్రకటనలో పేర్కొంది.మరికొన్ని ప్రత్యేక ఆధ్యాత్మిక ప్యాకేజీలు.. టీజీఎస్ ఆర్టీసీ కేవలం సూర్యాపేట డిపోకే పరిమితం కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల నుండి మరికొన్ని ప్రత్యేక ప్యాకేజీలను కూడా అందిస్తోంది..

**ఖమ్మం జిల్లా డిపో:**
ప్రతి ఆదివారం ఉదయం 6:30 గంటలకు ఖమ్మం కొత్త బస్టాండ్ నుండి యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయాల సందర్శన కోసం డీలక్స్ బస్సు అందుబాటులో ఉంటుంది. అదే రోజు సాయంత్రం తిరిగి ఖమ్మం చేరుకుంటుంది. పెద్దలకు రూ.700, పిల్లలకు రూ.370 ఛార్జీ ఉంటుంది.

**సత్తుపల్లి డిపో:**
ప్రతి శనివారం ఉదయం 5 గంటలకు పారిజాత కొండ, ద్వారకా తిరుమల, వాడపల్లికి డీలక్స్ బస్సు సేవలు అందిస్తుంది. పెద్దలకు రూ.600, పిల్లలకు రూ.320 ఛార్జీ ఉంటుంది.

భద్రాద్రి కొత్తగూడెం డిపో:
ప్రతి శుక్రవారం ఉదయం 6 గంటలకు విజయవాడ, వారాహి ఆలయం, అమరావతికి డీలక్స్ బస్సు నడుపుతున్నారు. దీనికి రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంది. ఇక్కడ పెద్దలకు ఛార్జీ రూ.600గా నిర్ణయించారు.
ప్రతి శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు వాడపల్లి, ద్రాక్షారామం, ద్వారకా తిరుమల ప్యాకేజీలో డీలక్స్ బస్సు బయలుదేరుతుంది. పెద్దలకు రూ.850, పిల్లలకు రూ.470 ఛార్జీ ఉంటుంది. ఇతర వివరాల కోసం ఖమ్మం డీఎం (9959225958), ఏఎం (7382858084), కొత్తగూడెం డీఎం (9959225959), సత్తుపల్లి డీఎం (9959225962) నంబర్లను సంప్రదించవచ్చు అని అధికారులు తెలిపారు.

**200 కోట్ల ఉచిత ప్రయాణాలు..**
ఇటీవల తెలంగాణ ఆర్టీసీ మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద 200 కోట్ల ఉచిత ప్రయాణాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలు, బస్ స్టేషన్లలో సంబరాలు నిర్వహిస్తున్నారు. ఎంజీబీఎస్ బస్టాండ్‌లో జరిగిన వేడుకలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 97 డిపోలు, 341 బస్ స్టేషన్ల వద్ద టీజీఎస్ ఆర్టీసీ ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తోంది. సంబరాలకు ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీకి సూచించారు. ఈ ప్రత్యేక ప్యాకేజీలు, ఉచిత ప్రయాణాల విజయం ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడంలో సహాయపడతాయి.

## ఉపరాష్ట్రపతి ఎన్నిక వేళ జగన్ మార్క్

**(1వపేజీ తరువాయి)**ఓటింగ్ రహస్య బ్యాలెట్ విధానంలో జరుగుతుంది. ఏపీలో మూడు పార్టీలు కూటమిగా ఉండటంతో... 21 మంది లోక్ సభ - 4 రాజ్యసభ సభ్యులు ఉన్నారు. వీరు కూటమి అభ్యర్థికే మద్దతుగా ఓటింగ్ లో పాల్గొంటారు. కాగా, వైసీపీ ఎవరి వైపు నిలుస్తుందనేది చర్చ గా మారింది. జగన్ మద్దతు ఎవరికి 2024 ఎన్నికల్లో వైసీపీని ఇదే కూటమి ఓడించటంతో జగన్ నిర్ణయం పైన పార్టీ నేతల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. 2018 సమయంలోనే టీడీపీ కూటమిలో ఉన్నా నాడు ఎన్డీఏ నిర్ణయాలకు జగన్ పార్టీ మద్దతు పలికింది. టీడీపీ ఆ తరువాత కూటమి నుంచి బయటకు రావటం.. 2019 లో ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. 2024 ఎన్నికల వరకు కేంద్రంలోని ఎన్డీఏ బిల్లుకు వైసీపీ షరతు లు లేకుండానే మద్దతుగా నిలిచింది. కాగా, ఇప్పుడు ఏపీలో వైసీపీ నేతల పైన కేసులు.. వరుస అరెస్టుల వేళ జగన్ ఎన్డీఏకే మద్దతిస్తారా అనేది కీలక అంశంగా మారింది. జగన్ కు ఇంకా బీజేపీ ముఖ్య నేతల పరోక్ష మద్దతు ఉందని రాజకీయ వర్గాల్లో ప్రచారం ఉంది. దీంతో.. జగన్ కాంగ్రెస్ కూటమికి ఎట్టి పరిస్థితిల్లోనూ మద్దతు ఇవ్వరని.. ఎన్డీఏ వైపే నిలుస్తారని పార్టీ నేతల అంచనా. కీలక మలుపు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జగన్ ఎన్డీఏ కూటమికి మద్దతుగా ఓటింగ్ చేయిస్తే ఇక భవిష్యత్ రాజకీయాలకు ఈ పరిణామం కీలకంగా మారనుంది. అయితే, ఎన్డీఏ కూటమికి ఉప రాష్ట్ర పతి ఎన్నికలో గెలిచేందుకు పూర్తి మెజార్టీ ఉంది. రెండు సభల్లోనూ 786 మంది సభ్యులకు ఓటు హక్కు ఉండగా.. అందులో గెలుపుకు 394 ఓట్లు అవసరం. కాగా, ఎన్డీఏకు 422 ఓట్ల మద్దతు ఉంది. అయితే, అవసరం లేకపోయినా బీజేపీ భవిష్యత్ రాజకీయాల కోసం ఇతర పార్టీలతో మైత్రి కొనసాగించటం 2014 నుంచి కొనసాగుతోంది. అదే 2018 లో వైసీపీని బీజేపీకి దగ్గర చేసింది. వైసీపీకి ఏడుగురు రాజ్యసభ... నలుగురు లోక్ సభ సభ్యుల బలం ఉంది. మరి.. జగన్ ఈ ఎన్నిక విషయంలో వేసే అడుగు భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపు కానుంది.

## బీసీ రిజర్వేషన్లపై..బీజేపీ ద్వంద్వవైఖరి

**(1వపేజీ తరువాయి)**ఇవ్వటం లేదు : సర్వేలో వ్యక్తుల వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదని, 3.99 శాతం మంది తమకు ఏ కులం లేదని సర్వేలో చెప్పారని, స్వతంత్ర నిపుణుల అధ్యయన కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే తాము ముందుకెళ్తున్నామని అన్నారు. బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని కుట్ర చేస్తున్న వాళ్లే సందేహాలు లేవనెత్తుతున్నారని, కులగణన సర్వే డేటా కావాలంటే ఆయా పార్టీల ముందు, అసెంబ్లీలో ప్రవేశపెడతామని అన్నారు. తెలంగాణలో మత ప్రాతిపాదికన ఎలాంటి రిజర్వేషన్లు ఇవ్వటం లేదన్నారు. కేవలం సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటు ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు తెచ్చామని, యూపీలో 5 ముస్లిం కులాలు రిజర్వేషన్ల ఫలాలు పొందుతున్నాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## పెరిగిన బోధన ఫీజులు తగ్గించాలని డిమాండ్.. ఐఐటీ గౌహతిలో విద్యార్థుల నిరసన



గౌహతి-నవభూమి: అస్సాంలో ఉన్న గౌహతి ఐఐటీలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఐఐటీ గౌహతి క్యాంపస్‌లో వందల సంఖ్యలో రీసర్చ్ స్కాలర్లు, ఎంటెక్ విద్యార్థులు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. అత్యధిక స్థాయిలో ఫీజుల్ని పెంచినట్లు ఆరోపించారు. పీహెచ్‌డీ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఫీజు పెంచేశారు. దీంతో పాటు బీటెక్, ఎంటెక్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు కూడా ఫీజు పెంచినట్లు తెలుస్తోంది. జులై 17వ తేదీన విద్యార్థులు, మేనేజ్మెంట్ మధ్య చర్చలు జరిగాయి. ఆ చర్చల్లో ఫీజు పెంచడం లేదని అంగీకరించినట్లు తెలుస్తోంది.జులై 22వ తేదీన జులై-నవంబర్‌కు చెందిన సెమిస్టర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. అయితే



ఫీజు చెల్లించకుండా సెమిస్టర్ రిజిస్ట్రేషన్ జరగదు. కానీ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఐఐటీ స్పష్టమైన ప్రకటన చేయలేదు. అయితే మంగళవారం సంబంధిత శాఖలకు వెళ్లిన రీసర్చ్ స్కాలర్ విద్యార్థులకు చేదు అనుభవం ఎదురైంది. సెమిస్టర్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించకపోవడంతో రిజిస్ట్రేషన్ జరగలేదు. దీంతో విద్యార్థులు నిరసన చేపట్టారు.ఐఐటీ గౌహతి వర్గాల ప్రకారం పీహెచ్‌డీ విద్యార్థులకు ఫీజును 10 వేలు పెంచారు. జులై-నవంబర్ సెమిస్టర్‌కు ఆ ఫీజు వసూల్ చేయనున్నారు. జనవరి-మే సెమిస్టర్‌కు రూ.34,800 ఉన్న ఫీజు ఇప్పుడు 45,700 అయ్యింది. కొత్తగా విద్యార్థులు పెరిగిన ఫీజులో భాగంగా సుమారు 92 వేలు చెల్లించనున్నారు. తమ స్టైఫండ్ కన్నా 20 వేలు అధిక ఫీజు చెల్లించాల్సి వస్తోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

## భారత్-చైనా సంబంధాల్లో కీలక ముందడుగు..: చైనీయులకు తిరిగి టూరిస్ట్ వీసాల జారీ



న్యూఢిల్లీ-నవభూమి: భారత్, చైనా సంబంధాలలో కీలక మార్పు చోటు చేసుకుంది. ఐదేళ్ల విరామం తర్వాత చైనా పౌరులకు టూరిస్ట్ వీసాలను తిరిగి జారీ చేయాలని భారత్ నిర్ణయించింది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల తర్వాత నిలిపి వేసిన ఈ వీసాల జారీని పునఃప్రారంభించడంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉంది. ఈ నిర్ణయం పర్యాటకం, వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు.భారత్, చైనా మధ్య సంబంధాల్లో ఒక ముఖ్యమైన పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలను మెరుగు పరచుకునే ప్రయత్నంలో భాగంగా.. భారత ప్రభుత్వం చైనా పౌరులకు టూరిస్ట్ వీసాల జారీని ఐదేళ్ల విరామం తర్వాత తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది. అయితే దీన్ని జులై 24వ తేదీ అంటే గురువారం రోజు నుంచి అమల్లోకి వస్తుందని బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని ఉటంకిస్తూ రాయిటర్స్ నివేదించింది.2020లో తూర్పు లడఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆ ఘర్షణల అనంతరం భారత్.. చైనా పౌరులకు టూరిస్ట్ వీసాల జారీని నిలిపి వేసింది. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ప్రయాణాలు, సాంస్కృతిక మార్పిడి, వ్యాపార కార్యకలాపాలు గణనీయంగా తగ్గిపోయాయి. సుమారు ఐదు సంవత్సరాల పాటు కొనసాగిన ఈ ప్రతిష్టంభనకు ప్రస్తుత నిర్ణయం తెరదించుతోంది.ఈ చర్య ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలను పునరుద్ధరించడానికి ఒక సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా కొవిడ్-19 మహమ్మారి, సరిహద్దు ఉద్రిక్తతలు గత కొన్ని సంవత్సరాలుగా ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఇప్పుడు వీసాల పునరుద్ధరణతో.. పర్యాటకం, వాణిజ్యం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు తిరిగి వృద్ధి చెందే అవకాశం ఉంది. ఇది కేవలం పర్యాటక రంగంపైనే కాకుండా ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం చూపుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.భారత్-చైనాల మధ్య ఉన్న సైనిక, దౌత్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించుకుంటూనే.. ఇతర రంగాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయని ఈ చర్య స్పష్టం చేస్తోంది. ఇది వ్యూహాత్మకంగా కీలకమైన రెండు ఆసియా దేశాల మధ్య విశ్వాసాన్ని తిరిగి పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా అంతర్జాతీయ సమాజం భావిస్తోంది. మొత్తంగా ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత టూరిస్ట్ వీసాలను తిరిగి ప్రారంభించడంతో అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'నువ్వొక బచ్చాగాడివి, నీకేం తెలుసు'.. అసెంబ్లీలో తేజస్విపై మండిపడ్డ బీహార్ సీఎం



న్యూఢిల్లీ-నవభూమి:బీహార్ ముఖ్యమంత్రి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆర్జేడీ అగ్రనేత ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తేజస్వియాదవ్ మధ్య అసెంబ్లీ లో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీహార్ ఓటర్ల జాబితాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా తేజస్వియాదవ్ తన గళం వినిపించారు. కానీ ఎస్ఐఆర్‌ను సమర్థిస్తూ సీఎం నితీశ్ వాగ్వాదానికి దిగారు. ఓ సందర్భంలో నితీశ్ కుమార్ ఆగ్రహంతో ఊగిపోతూ.. 'నువ్వొక బచ్చాగాడివి, నీకేం తెలుసు..?' అని తేజస్విపై మండిపడ్డారు.ముందుగా తేజస్వి యాదవ్ మాట్లాడుతూ.. 'నేను కేవలం ఒక నాలుగు విషయాలు అడుగుతా. ఓటర్ లిస్టును గత ఫిబ్రవరిలో ఒకసారి ప్రచురించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రివిజన్ జరగాల్సింది. కానీ అందుకు బదులుగా అసెంబ్లీ ఎన్నికలవేళ ఇప్పుడు రివిజన్ చేస్తున్నారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు కోసం 11 రకాల డాక్యుమెంట్లు అడుగుతున్నారు. పేదలు, నిరక్షరాస్యులకు ఆ 11 రకాల డాక్యుమెంట్లను కేవలం 25 రోజుల్లో సిద్ధం చేసుకోవడం సాధ్యమా..? ఇది పేదలకు, నిరక్షరాస్యులకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆర్థికభారంగా మారింది. ఎన్నికల సంఘం తీరుతో పేదలు ఎన్నికలకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఓటు అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు. ఆ హక్కును ఈసీ పేదలకు దూరం చేస్తోంది.' అని విమర్శించారు.దాంతో ఆగ్రహించిన సీఎం తేజస్విపై విమర్శలతో విరుచుకుపడ్డారు. 'నువ్వేం మాట్లాడుతున్నావ్. ఇలా ఎందుకు మాట్లాడుతున్నావ్. నువ్వు పిల్లవాడిగా ఉన్నప్పుడు నీ తల్లిదండ్రులిద్దరూ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. అప్పుడు పరిస్థితి ఎలా ఉండేదో నీకు తెలుసా..? మీరు మంచిగా పని చేయడంలేదనే మేం దూరం జరిగాం. ఈ ఏడాది ఎన్నికలు జరుగనున్నాయి. ఏం చేయాలో ప్రజలు తేల్చుకుంటారు. మా ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేసింది. ఇలాంటి వాళ్లు (తేజస్వియాదవ్‌ను ఉద్దేశించి) ఓట్ల కోసం ఏదైనా మాట్లాడుతారు. మీ హయాంలో మహిళలకు ఏమైనా మేలు జరిగిందా..? మేం మహిళల కోసం ఎంతో చేశాం. ముస్లింల కోసం ఆర్జేడీ చేసిందేమీ లేదు. మేం ముస్లింల క్షేమం కోసం పనిచేస్తున్నాం. నువ్వు కేవలం ఒక బచ్చాగాడివి, నీకేం తెలుసు..? ఆర్జేడీ హయాంలో సాయంత్రం అయితే పట్నాలో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావడానికి భయపడేవారు. మేం చేసిన అభివృద్ధి పనులతో ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తాం.' అని నితీశ్ కుమార్ వ్యాఖ్యానించారు.కాగా బీహార్‌లో ఈసీ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై పార్లమెంట్‌లో కూడా గత మూడు రోజులుగా రభస జరుగుతోంది. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయసభలు ఎలాంటి చర్చ లేకుండానే వాయిదా పడుతున్నాయి.

### దోహా బయల్దేరిన విమానంలో సాంకేతిక సమస్య..

న్యూఢిల్లీ-నవభూమి:విమానాల్లో సాంకేతిక సమస్యలుఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఖతార్ రాజధాని దోహా బయల్దేరిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో టేకాఫ్ అయిన రెండు గంటల తర్వాత విమానం వెనక్కి తిరిగి వచ్చినట్లు అధికారులు తెలిపారు.పైలట్లు, సిబ్బంది సహా 188 మంది ప్రయాణికులతో కూడిన విమానం 375 బుధవారం ఉదయం 9:07 గంటల సమయంలో కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దోహాకు బయల్దేరింది. అయితే, టేకాఫ్ అయిన తర్వాత విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. అప్రమత్తమైన పైలట్ ముందు జాగ్రత్తగా విమానాన్ని వెనక్కి మళ్లించారు. టేకాఫ్ అయిన రెండు గంటల తర్వాత అంటే ఉదయం 11:12 గంటలకు విమానం కాలికట్ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. విమానం క్యాబిన్ ఏసీలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

## పాస్‌పోర్ట్ ఉంటే చాలు.. వీసా లేకపోయినా భారతీయులు ఈ 59 దేశాలకు వెళ్లి రావచ్చు..!



న్యూఢిల్లీ-నవభూమి: అంతరా జ్తీయ ప్రయాణాలు చేయాలనుకునే భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లకు ఇది నిజంగా శుభవార్తే. ఎందుకంటే 2025లో భారత పాస్‌పోర్ట్ కలిగిన పౌరులు అందరూ వీసా లేకుండానే ఏకంగా 59 దేశాలకు ప్రయాణించవచ్చు. అంతర్జాతీయ పౌరసత్వం, నివాస సలహా సంస్థ హెన్లీ పార్ట్‌నర్స్ తాజాగా విడుదల చేసిన హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2025 ప్రకారం.. భారత పాస్‌పోర్ట్ ర్యాంకు గణనీయంగా మెరుగుపడింది. గతంలో 85వ స్థానంలో ఉన్న భారత పాస్‌పోర్ట్.. ఇప్పుడు 77వ స్థానానికి ఎగబాకింది. ఇది భారతీయ ప్రయాణికులకు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన స్వేచ్ఛను సూచిస్తోంది' వీసా-రహిత ప్రయాణం' అంటే ప్రయాణానికి ముందుగానే వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఇది సమయాన్ని, శ్రమను ఆదా చేయడంతో పాటు ప్రయాణ ప్రణాళికను మరింత సులభతరం చేస్తుంది. ఆయా దేశాల్లోకి ప్రవేశించిన తర్వాత నిర్ణీత కాలం పాటు వీసా లేకుండానే ఉండవచ్చు. అయితే కొన్ని దేశాలు 'వీసా-ఆన్-అరైవల్' సౌకర్యాన్ని అందిస్తాయి. అంటే గమ్యస్థానానికి చేరుకున్న తర్వాత విమానాశ్రయంలోనే వీసా పొందవచ్చు. మరికొన్ని దేశాలు 'ఎలక్ట్రానిక్ ట్రావెల్ అథారిటీ' లేదా ఆన్‌లైన్ అనుమతిని కోరతాయి. ఈ 59 దేశాల జాబితాలో ఈ మూడు రకాల ప్రవేశ పద్ధతులు ఉన్న దేశాలు ఉన్నాయి.

వీసా లేకుండా వెళ్లగలిగే దేశాలు

అంగోలా, బార్బడోస్, భూటాన్, బ్రిటిష్ వర్జిన్ దీవులు, కుక్ దీవులు, డొమినికా, ఫిజి, గ్రెనడా, హైతీ, ఇరాన్, జమైకా, కజకిస్తాన్, కెన్యా, కిరిబాటి, మకావో, మడగాస్కర్, మలేషియా, మారిషస్, మైక్రోనేషియా, మోంట్సెరాట్, నేపాల్, నియు, ఫిలిప్పీన్స్, రువాండా, సెనెగల్, సెయింట్ కిట్స్ మరియు నెవిస్, సెయింట్ విన్సెంట్ మరియు గ్రెనడైన్స్, థాయిలాండ్, ట్రినిడాడ్ మరియు టొబాగో, వనువాటు,

వీసా ఆన్ అరైవల్ అవసరమయ్యే దేశాలు

బొలీవియా, బురుండి, కంబోడియా, కేప్ వెర్డే దీవులు, కొమ్రో దీవులు, జిబౌటి, ఇథియోపియా, గినియా-బిస్సావు, ఇండోనేషియా, జోర్డాన్, లావోస్, మాల్దీవులు, మార్షల్ దీవులు, మంగోలియా, మొజాంబిక్, మయన్మార్, నమీబియా, పలావు దీవులు, ఖతార్, సమోవా, సియెర్రా లియోన్, సోమాలియా, శ్రీలంక, సెయింట్ లూసియా, టాంజానియా, తైమూర్-లెస్టే, తువాలు, జింబాబ్వే.

## రైల్లో అమ్మాయిల గుంపు.. వారి చేతిపై కోచ్, బెర్త్ నెంబర్లు.. అనుమానం వచ్చి విచారిస్తే..



న్యూఢిల్లీ-నవభూమి:రైలులో ప్రయాణిస్తున్న 56 మంది యువతుల వద్ద ఎలాంటి పత్రాలు లేకపోగా.. వారి చేతులపై కోచ్, బెర్త్ నెంబర్లు స్టాంపులు వేసి ఉండటంతో అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో ఆరా తీయగా దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. న్యూ జల్పాయ్‌గురి-పట్నా క్యాపిటల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఈ యువతుల వద్ద సరైన పత్రాలు లేకపోవడం, చేతులపై స్టాంపులు ఉండటంతో ఇది మహిళల అక్రమ రవాణా అని అధికారులు గుర్తించారు. ఒక మహిళ, ఒక పురుషుడు ఈ యువతులను బెంగళూరులోని ఉద్యోగాల కోసం తీసుకువెళ్తున్నారని చెప్పగా, వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి ఆరా తీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వారిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఉద్యోగాల పేరుతో యువతులను తరలించి, వారితో బలవంతంగా ముఠాలు వ్యభిచారం చే యిస్తున్న ఘటనలు తరుచూ వెలుగులోకి వస్తున్న విషయం తెలిసిందే.సోమవారం రాత్రి న్యూ జల్పాయ్‌గురి-పట్నా క్యాపిటల్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ) సిబ్బంది సాధారణ తనిఖీల్లో భాగంగా బోగీలోకి వెళ్లారు. అక్కడ చాలా మంది యువతులు గుంపుగా ఉండగా.. వారి ముఖంలో ఆందోళన గమనించారు. దీంతో అనుమానం వచ్చి టికెట్లు అడిగారు. అయితే వారి వద్ద టికెట్లు కానీ, ఇతర పత్రాలు కానీ లేవు. అయితే, చేతులపై కోచ్ నంబర్, బెర్త్ నంబర్లను ముద్రించి ఉన్నాయి. ఈ క్రమంలో ఓ యువతి " బెంగళూరుకు చెందిన కంపెనీలో ఉద్యోగం కోసం మమ్మల్ని తీసుకెళ్తున్నారు" అని చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా మహిళల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పొరుగుదేశం పాకిస్థాన్‌లోనూ పెళ్లి పేరుతో మహిళలను చైనాకు అమ్మేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి.బెంగళూరుకు వెళ్తుంటే బిహార్‌కు వెళ్లే రైలు ఎందుకు ఎక్కారని సిబ్బంది ప్రశ్నించారు. వారితో ఉన్న వ్యక్తులు సరిగ్గా సమాధానం చెప్పకపోవడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. "మహిళల అక్రమ రవాణాలో భాగంగానే వీరిని బిహార్ తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది' అని పోలీసులు తెలిపారు. రక్షించిన యువతులందరినీ వారి కుటుంబాలకు అప్పగించారు. ఈ యువతుల వయస్సు 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఉంది. వీరంతా జల్పాయిగురి , కూచ్ బెహార్, అలీపుర్‌దువార్ జిల్లాలకు చెందినవారేనని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. యువతుల వెంట ఉన్న మహిళ, పురుషుడు ఇద్దర్నీ అరెస్ట్ చేశామని, దీని వెనుక ఉన్న ముఠా గురించి ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు.

## ఏనుగులకు ఆహారం పెట్టే రోజు.. మలయాళీల పండుగ నేర్పే పాఠం ఏంటి?



న్యూఢిల్లీ-నవభూమి:ప్రకృతి, ప్రకృతిలోని సమస్త జీవరాశితో మనిషికి విడదీయలేని బంధం ఉంది. ఆధునిక పోకడలో పడి కొట్టుమిట్టాడుతున్న మానవుడికి.. అనాదిగా వస్తున్న మన ఆచారాలు, సంప్రదాయాలు ఎప్పుడూ ఈ విషయాన్ని గుర్తుచేస్తూనే ఉంటాయి. అలాంటి సంప్రదాయాల్లో ఒకటి కేరళలో పాటించే కార్కిడకం మాసం ( మలయాళీలు ఈ నెలను పవిత్రంగా భావిస్తారు. ఈ నెల మొదటి రోజు ఏనుగుల కోసం ప్రత్యేకంగా ఆహారం తయారుచేసి తినిపిస్తారు. ఆలయాల వద్ద ఏనుగులకు ఆహారం పెట్టే కార్యక్రమాలు అట్టహాసంగా జరుగుతాయి. ఇక ఈ నెలంతా సాత్విక ఆహారం తీసుకుంటూ దైవ చింతనలో గడుపుతారు. తెలుగు ప్రజలు ఇదే సమయంలో, ఇంచుమించు ఇలాగే శ్రావణ మాసం సంప్రదాయాలను పాటిస్తారు.కొత్త సంవత్సరం తొలి రోజును చాలా మంది వేడుకగా నిర్వహించుకుంటారు. అయితే, కార్కిడకం అనేది మలయాళీల చివరి మాసం. దక్షిణాది రాష్ట్రాల ప్రజలు ఇంచుమించు ఒకే రకమైన సాంప్రదాయాలను పాటిస్తున్నప్పటికీ ఇలాంటి చిన్న చిన్న వైరుధ్యాలు కనిపిస్తాయి.పిల్లలకు రామాయణం చదవడాన్ని ప్రత్యేకంగా ఈ నెలలోనే అలవాటు చేస్తారు. ప్రతి ఇంట్లో రామాయణాన్ని పఠిస్తారు. ప్రధానంగా తుంచత్ రామానుజన్ ఎజుతచ్చన్ రాసిన అధ్యాత్మ రామాయణాన్ని చదువుతారు. ఆయన్ని మలయాళ భాషకు ఆద్యుడిగా భావిస్తారు.కార్కిడకం అంటే మలయాళీలకు కేవలం ఒక నెల మాత్రమే కాదు. ఇది కేరళ ప్రజల జీవన విధానంలో ఒక భాగం. ఈ నెలలో చాలా మంది మాంసాహారం ముట్టుకోరు. ప్రత్యేకంగా మూలికలతో చేసిన పానీయాలను తాగుతారు. తేలికైన ఆహారం తీసుకుంటారు. నిజాయితీగా ఉండేందుకు, తోటివారికి తోచినంత సాయం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తారు. ఏనుగులను ప్రేమగా చూసుకోవడం కూడా ఇందులో భాగమే.కార్కిడకం మాసంలో ఏనుగులకు ఆహారం తినిపించడాన్ని ఒక ముఖ్యమైన ఆచారంగా భావిస్తారు. భక్తులు ఆలయాల వద్దకు చేరుకొని ఏనుగులకు అరటిపండ్లు, వాటర్ మిలన్, పైనాపిల్ లాంటివి తినిపిస్తారు. ఇక ఆలయాలలో ఏనుగుల సంరక్షకులు వాటి కోసం ప్రత్యేకంగా ఆహారం తయారుచేస్తారు. ఈ నెలలో ఏనుగులకు ఆయుర్వేద చికిత్స కూడా చేస్తారు. ముఖ్యంగా ఆలయాలలో ఊరేగింపులకు ఉపయోగించే ఏనుగులకు ఈ రకమైన సేవలు చేస్తారు. ఈ నెలంతా ఏనుగులకు విశ్రాంతి ఇస్తారు.మనుషులకు ఆయుర్వేద చికిత్స చేసినట్లే, ఏనుగులకు కూడా ఈ నెలలో చికిత్స చేస్తారు. దీన్నే సుఖ చికిత్స అని పిలుస్తారు. కొన్ని రకాల మూలికలు, ఆయుర్వేద పదార్థాలతో చేసిన గంజిని ఏనుగులకు ఆహారంగా తినిపిస్తారు. దీనివల్ల ఏడాదంతా ఆలయ ఊరేగింపులు, ప్రయాణాల వల్ల కోల్పోయిన శక్తిని ఏనుగులు తిరిగి పొందుతాయట. మలయాళీ సంస్కృతిలో జంతువుల పట్ల దయ, గౌరవం చూపడాన్ని ఇది చాటిచెబుతుంది.

మలయాళీలు ఏనుగులను దేవాలయ సంప్రదాయాలలో పవిత్రంగా చూస్తారు. ఏనుగులకు ఆహారం అందిస్తే, విఘ్నేశ్వరుడి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. కార్కిడకం నెల తొలి రోజున త్రిసూర్‌లోని వడక్కుమ్ నాథన్ ఆలయంలో ఏనుగులకు ఆహారం పెట్టే కార్యక్రమాన్ని చూసేందుకు రెండు కళ్లూ చాలవు.

**ఈ నెలలో ఇలాంటి ఆహారమే మేలు**

కార్కిడక మాసం నైరుతి రుతుపవనాల సమయంలో వస్తుంది. సాధారణంగా ఇది జూలై మధ్యలో ప్రారంభమై ఆగస్టు మధ్య వరకు ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో శ్రావణ మాసానికి 4, 5 రోజుల ముందు కేరళ కార్కిడకం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో భారీ వర్షాలు కురుస్తాయి. సాధారణ జీవితం కాస్త నెమ్మదిస్తుంది. పూర్వం ఇలాంటి సమయంలో ప్రజలు ఆధ్యాత్మిక చింతనలో మునిగిపోయేవారు. శరీరాన్ని, మనస్సును శుద్ధి చేసుకునేందుకు దీన్ని ఒక మంచి సమయంగా భావించేవారు.కార్కిడకం నెలలో మలయాళీలు చేసుకునే ఒక ప్రత్యేకమైన ఆరోగ్యకరమైన ఆహారం 'కాంజి'. దీన్ని జీలకర్ర, మెంతులు, పిప్పలి వంటి ఆయుర్వేద పదార్థాలను ఉపయోగించి తయారు చేస్తారు. కొన్ని రకాల మూలికలను కూడా ఉపయోగిస్తారు. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రుతుపవనాల సమయంలో సాధారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల నుంచి శరీరాన్ని కాపాడుతుంది. దీన్ని దేవాలయాలలో, ఇళ్లలో పంచుతారు.

కార్కిడకం మాసంలో చాలా మంది మాంసాహారం తినరు. శాకాహార భోజనం మాత్రమే తీసుకుంటారు. ఇది కేవలం ఒక మతపరమైన ఆచారం మాత్రమే కాదు, ఆయుర్వేద సూత్రాల ప్రకారం ఈ సమయంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం శ్రేయస్కరం. శ్రావణ మాసంలో ఇదే కారణంతో చాలా మంది మాంసాహారం తీసుకోరు.

శాస్త్రీయ కారణాలు

సైంటిఫిక్‌గానూ దీనికి సహేతుక కారణాలు ఉన్నాయి. ఈ కాలంలో మనం మాంసాహారంగా తీసుకునే జంతువులు కూడా వివిధ రోగాల బారినపడుతుంటాయి. అలాంటి జంతువుల మాంసాన్ని తీసుకుంటే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. దీనికి తోడు ఈ కాలంలో జీర్ణక్రియ మందగిస్తుందని వైద్య నిపుణులు తెలిపారు.

ఇక కార్కిడకం నెలలో చాలామంది 'పంచకర్మ' లాంటి ఆయుర్వేద చికిత్సలు చేయించుకుంటారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లడం, దానధర్మాలు చేయడం లాంటివాటిని ఆచరిస్తారు. వ్రతాలు, ఉపవాసాలు చేస్తూ ఆధ్యాత్మికలో మునిగిపోతారు. దీనివల్ల శరీరంతో పాటు మనస్సు కూడా శుద్ధి అవుతుందని నమ్ముతారు. ఈ సమయంలో ఆచరించే సంప్రదాయాలన్నీ మనుషులు, జంతువులు, ప్రకృతి మధ్య సామరస్యాన్ని తెలియజేస్తాయి.

## ఆగస్టు చివరి నాటికి ఉపరాష్ట్రపతి ఎన్నిక పూర్తి..

### 72 గంటల్లో ఎన్నికల షెడ్యూల్ ప్రకటన.. !



న్యూఢిల్లీ-నవభూమి: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మరో రెండేండ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీచేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. దీంతో ఆయన రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు. ఆయన రాజీనామాతో దేశంలో అత్యున్నత స్థానం ఖాళీ అయ్యింది. ఈ నేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనేఅంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది.

ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ ఏర్పడిన ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ త్వలోనే చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. రాబోయే 48 నుంచి 72 గంటల్లో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ ఆగస్టు చివరి నాటికి పూర్తవుతుందని పేర్కొన్నాయి. అయితే, దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు.

**ఉపరాష్ట్రపతి రేసులోకి రాజ్‌నాథ్ సింగ్..**

తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. అందులో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ , కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరితోపాటు జనతాదళ్ (యునైటెడ్) ఎంపీ, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ కూడా ఉపరాష్ట్రపతి రేసులో ఉన్నారు. ఇద్దరు లెఫ్టినెంట్ గవర్నర్లు కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా లేదంటే ఢిల్లీ ఎల్జీ సక్సేనాలో ఎవరికో ఒకరికి అవకాశం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ వర్గాల్లో తీవ్రంగా చర్చనడుస్తోంది. అయితే, ఇప్పుడు అనూహ్యంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేరుకూడా రేసులోకి వచ్చింది. దీంతో ఈ పదవి చేపట్టబోయేది ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై క్లారిటీ రావాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

## చైనీయులకు టూరిస్ట్ వీసాల జారీ ప్రక్రియ పునఃప్రారంభం



అరుణాచల్ ప్రదేశ్-నవభూమి: అరుణాచల్ ప్రదేశ్‌లోని గల్వాన్ లోయలో ఘర్షణల తర్వాత పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా చైనా పౌరులకు జారీ చేసిన పర్యాటక వీసాలను భారత్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో దాదాపు ఐదేళ్ల తర్వాత చైనీయులకు పర్యాటక వీసాల జారీ ప్రక్రియను పునఃప్రారంభించనున్నట్లు చైనాలోని భారత రాయబార కార్యాలయం తాజాగా ప్రకటించింది. జులై 24 నుంచి చైనా పౌరులకు పర్యాటక వీసాలు జారీ చేయనున్నట్లు తెలిపింది.గల్వాన్ లోయలో 2020లో జరిగిన సైనిక ఘర్షణ తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్న విషయం తెలిసిందే. దీంతో చైనాపై పలు ఆంక్షలు విధించింది. వందలాది చైనీస్ యాప్‌లను భారత్ నిషేధించింది. ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను కూడా రద్దు చేసింది. అయితే, ప్రస్తుతం ఇరు దేశాలు సంబంధాలను మెరుగుపరుచుకునే విధంగా ప్రయత్నాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే లఢఖ్ సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ, గస్తీ పునఃప్రారంభం, నేరుగా విమాన సర్వీసులు పునరుద్ధరణ, కైలాస మానససరోవర్ యాత్ర పునఃప్రారంభం వంటి విషయాల్లో రెండు దేశాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి.

## జస్టిస్ వర్మ కేసు.. విచారణ నుంచి తప్పుకున్న సీజేఐ గవాయ్



న్యూఢిల్లీ-నవభూమి:అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు సీజేఐ బీఆర్ గవాయ్‌తెలిపారు. ఇన్‌హౌజ్ కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ పిటీషన్‌పై విచారణలో పాల్గొనడం లేదని సీజేఐ గవాయ్ అన్నారు. ఢిల్లీలోని తన నివాసంలో భారీ స్థాయిలో నోట్ల కట్టలు దొరికిన కేసులో జస్టిస్ యశ్వంత్ వర్మ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.జస్టిస్ వర్మ కేసును అర్జెంట్‌గా విచారించాలని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. ఈ కేసులో రాజ్యాంగపరమైన సమస్యలు ఉన్నాయని, వీలైనంత త్వరగా దీన్ని లిస్ట్ చేయాలని సిబల్ కోరారు. అయితే ఈ కేసులో తాను విచారణ చేపట్టలేనని, ఎందుకంటే తాను కూడా ఇన్‌హౌజ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నానని సీజేఐ గవాయ్ తెలిపారు.సీజేఐగా సంజీవ్ ఖన్నా ఉన్న సమయంలో జస్టిస్ వర్మపై ఇన్‌హౌజ్ కమిటీ వేశారు. ఈ కేసును మరో బెంచ్‌కు అప్పగించనున్నట్లు సీజేఐ గవాయ్ తెలిపారు.

## ఆస్ట్రేలియాలో వర్ణవివక్ష.. భారతీయ విద్యార్థిపై దాడి

అడిలైడ్-నవభూమి:ఆస్ట్రేలియాలో భారతీయుడిపై అటాక్ జరిగింది. 23 ఏళ్ల విద్యార్థి చరణ్‌ప్రీత్ సింగ్‌ను కొట్టారు. సెంట్రల్ అడిలైడ్‌లో ఆ దాడి ఘటన చోటుచేసుకున్నది. వర్ణవివక్ష పేరుతో అటాక్ జరిగినట్లు తెలుస్తోంది. కింటోర్ అవెన్యూ వద్ద ఈ ఘటన జరిగింది. సిటీ లైట్ డిస్‌ప్లేను చూసేందుకు భార్యతో కలిసి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. జులై 19వ తేదీన ఈ అటాక్ జరిగినట్లు తెలుస్తోంది.ప్రత్యక్ష సాక్ష్యులు, వీడియో ప్రకారం.. అయిదుగురు వ్యక్తులు పదునైన ఆయుధాలతో వచ్చి దాడి చేశారు. ఎటువంటి వార్నింగ్ ఇవ్వకుండానే పంచ్‌లు విసిరారు. అటాక్ చేసి దుర్భాషలాడారు. రోడ్డుపై సింగ్ అపమారకస్థితిలో పడిపోయాడు.

తీవ్ర గాయాలయ్యాయి. ఇండియన్ అని తిడుతూ.. వాళ్ల పంచ్‌లు విసిరినట్లు సింగ్ తెలిపాడు.

## ఎన్సీఈఆర్టీ బుక్స్ నుంచి పైకా తిరుగుబాటు తొలగింపు.. ఒడిశా మాజీ సీఎం ఆందోళన



న్యూఢిల్లీ-నవభూమి: ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాల నుంచి పైకా తిరుగుబాటు పాఠ్యాంశాన్ని తొలగించడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒడిశా వీరత్వానికి చిహ్నమైన ఆ తిరుగుబాటు గురించి పుస్తకాల్లో లేకుండా చేశారని ఆయన ఆరోపించారు. పైకా తిరుగుబాటు లేదా పైకా విద్రోం గురించి పాఠ్యాన్ని ఎన్సీఈఆర్టీ తొలగించిందని, ఒడిశా చరిత్రలో అదో కీలక ఘట్టం అని, కానీ ఆ అంశాన్ని పాఠ్య పుస్తకాల నుంచి తొలగించడం సమంజసం కాదు అని పట్నాయక్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రికి లేఖ రాశారు. 1817లో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పైకా తిరుగుబాటు జరిగింది. సిపాయి ముట్నీకి 40 ఏళ్ల క్రితమే పైకా తిరుగుబాటు జరిగిందని, ఈ పాఠాన్ని టెక్ట్స్ బుక్స్ నుంచి ఎందుకు తీసి వేశారని ఆయన ప్రశ్నించారు. ఆ యోధులను అగౌరవపరచడమే అవుతుందన్నారు. పైకా తిరుగుబాటుదారుల పాఠ్యాంశాన్ని పునర్ పరిశీలించాలని ఒడిశా సీఎంను, కేంద్ర విద్యాశాఖ మంత్రిని కోరుతున్నట్లు మాజీ సీఎం పట్నాయక్ తెలిపారు.

## నిమిష ఉదంతం: తీర్పు చెప్పే హక్కు మీడియాకెక్కడిది?

జీవనోపాధి, విద్యాభ్యాసం నిమిత్తం దేశ సరిహద్దులు దాటుతున్న భారతీయుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కానీ విదేశాల్లో నివసిస్తున్న వారి స్థితిగతులపై సరైన అవగాహన భారతీయ మీడియాకు ఇప్పటికీ లేదు. వారి జీవితాల్లో జరిగే కీలక పరిణామాలపైన స్పందించేటప్పుడు, సమాచార పరమైన లోపాలు, మానవీయ కోణం పట్ల ఉన్న ఉపేక్ష, అంతర్జాతీయ నైపుణ్యతల లోటుఇవన్నీ కలగలిసినప్పుడు, ఓ అణుచిపెట్టిన వలస భారతీయుడి గొంతు గల్లంతవుతుంది. భారతీయ మీడియా చాలా సందర్భాలలో బాధితుడికి వేదిక కావడం బదులుగా అతడిపై తీర్పు చెప్పే ధర్మపీఠంగా వ్యవహరిస్తోంది. వివరాలు తెలిసినంతవరకూ కాకుండా, ఒక పక్షానికే ప్రాధాన్యం ఇచ్చే ధోరణి వలన నష్టపోయే వారు ప్రవాస భారతీయులే. యమన్‌లో ఉరిశిక్ష విధించబడి, ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారిన కేరళ యువతి నిమిష ఉదంతం ఇదే మీడియా అవగాహన రాహిత్యానికి స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది. నిమిష ఒక సామాన్య యువతి. పదవ తరగతి కూడా పూర్తి చేయని ఈమె, నర్సింగ్ డిప్లొమా చేసి, స్థానికంగా ఉద్యోగం లభించక యమన్ వెళ్లింది. మొదటిగా ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేయగా, అనంతరం స్వయంగా ఆసుపత్రి స్థాపించాలన్న ఆకాంక్షకు బలై, తలాల్ మహెదీ అనే యమన్ పౌరుడి సహాయంతో ఆసుపత్రిని ప్రారంభించిందని వాస్తవాలు చెబుతున్నాయి. స్థానిక చట్టాల ప్రకారం ఆమె తలాల్‌ను వివాహం చేసుకున్నట్లు సమాచారం. అతను కూడా కేరళకు వచ్చి ఆమె ఇంట్లో గడిపినట్లు తెలుస్తోంది. కానీ ఆ సంబంధం అనంతరం పరిస్థితులు ఏవిధంగా మలుపుతిరిగాయి అన్నది మిగిలిన కథ. యమన్ మీడియా కథనాల ప్రకారం తలాల్ హత్యకు నిమిష ప్రధాన పాత్రధారి. అతడి మృతదేహాన్ని ముక్కలుగా కోసి, సంచిలో వేసి, నీటి ట్యాంకులో పడేసినట్లు ఆరోపణలు. అలాగే ఆమెకు సహకరించిన ఇద్దరు స్థానికులపైనా శిక్ష విధించబడింది. నిమిషను డ్రైవర్‌గా సహాయపడిన వ్యక్తికి జైలు శిక్ష పడింది. ఆమెతో కలిసి పనిచేసిన మరో మహిళ హానన్‌కు పదేళ్ళ జైలు శిక్ష ఖరారైంది. అయినా ఈ వివరాలు భారతీయ మీడియా విపరీతంగా విస్మరించింది. నిజానికి ఈ కేసును మొదట్లోనే భారతీయ మీడియా ఒక నిరుపేద, ముస్లిం యువతిగా జీవనోపాధి కోసం వెళ్లిన యువతిని కుట్రగా చిక్కించారని చిత్రీకరించింది. ఆమెను మానవతా కోణంలో ఆవేదనతో చూసేలా కథనాలు ప్రచురించాయి. అయితే ఎక్కడా హతుడి కుటుంబం, స్థానిక న్యాయవ్యవస్థ, అంతర్జాతీయ చట్టాలు, విచారణ ప్రక్రియ, వాస్తవ ఆధారాలపై గంభీరంగా సమీక్షించలేదు. ఒకరకంగా చెప్పాలంటే, భారతీయ మీడియా ఈ కేసులో న్యాయవ్యవస్థ కన్నా ముందు తీర్పు చెప్పేసింది. ఇది కేవలం ఒక బాధ్యతారాహిత్యం కాదు, ఒక దేశ ఖ్యాతిని, దౌత్య సంబంధాలను మంటగలిపే చర్యగా చెప్పుకోవచ్చు. వాస్తవానికి, ఒక దశలో తలాల్ కుటుంబం నిమిషను క్షమించడానికి సిద్ధంగా ఉన్నదని బిబిసి వంటి అంతర్జాతీయ సంస్థలు వెల్లడించాయి. అయినా భారతీయ మీడియా చేసిన తీరుకి వారు తీవ్రంగా మిగిలిపోయారు. "వార్తలు అర్ధసత్యంగా, ఎడిటెడ్ వర్షన్లతో, తప్పుడు భావనలతో ప్రపంచానికి వెళ్లాయి" అని తలాల్ సోదరుడు స్వయంగా పేర్కొన్నాడు. ఇదే కారణంగా వారు క్షమాభిక్షను వెనక్కి తీసుకున్నారని పేర్కొన్నారు. అంటే, నిమిషకు జీవితం మిగలేదంటే, దానికి కారణం న్యాయవ్యవస్థ కన్నా ముందు తీర్పు చెప్పిన మీడియానే. మానవతా కోణంలో స్పందించాలంటే, వాస్తవాల మీద అవగాహన ఉండాలి. కానీ భారతీయ మీడియా ఆ అవగాహనను డబ్బు, టిఆర్పీ, హంగామా కోసం తాకట్టు పెట్టేసింది. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు ఆశ్రయించడం, సంబంధం లేని సంఘాలు హడావిడి చేయడం, మత పంథాల ఆధారంగా కేసును మలచడయి ఒక దేశ పౌరుడు, మరొక దేశ చట్టాల ప్రకారం దోషిగా తేలి శిక్ష అనుభవిస్తున్న ఘటనపై, భారతీయ మీడియా వక్రీకరించిన తీరు అంతర్జాతీయ స్థాయిలో భారత్ నైతిక స్థాయిని దిగజార్చే పరిణామంగా మారింది. న్యాయవ్యవస్థ పనిలో జోక్యం, చట్టానికి సంబంధించిన విషయాల్లో మీడియా తీర్పులు, ప్రజల ఆవేశాల్ని రెచ్చగొట్టే హంగామా నిమిష ఉదంతం ఈ ప్రమాదకర ధోరణికి అద్దం పడుతోంది. నిమిష ఘటనలో ఒక ముఖ్యమైన ప్రశ్న మనల్ని వెంటాడుతుందిఆమె బాధితురాలా? హంతకురాలా? ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం మన వశంలో లేదు. అది యమన్ న్యాయవ్యవస్థ చేసిన విచారణ ఆధారంగా నిర్ణయించాల్సిన విషయం. కానీ ఆ విచారణ, ఆ శిక్ష ప్రక్రియను, అక్కడి చట్టాలను అర్థం చేసుకోకుండా, కథనాల ద్వారా అపోహలు కలిగించడం, సామాజిక మాధ్యమాలలో వక్రీకరించబడిన భావజాలంతో మానవతను ప్రమాణంగా చూపించడయిఇది నిష్పక్షపాత పాత్రికేయ ధర్మానికి విరుద్ధం. నిమిష కేసు ఒక్కటే కాదు. గతంలో చాలామంది భారతీయులు గల్ఫ్ దేశాలలో, లేదా ఇతర విదేశాలలో చిక్కుకునే సందర్భాలలో మీడియా బాధ్యతతో వ్యవహరించలేదు. ఉదాహరణకు: బహ్రెయిన్‌లో ఉద్యోగులపై యజమానుల దుర్వినియోగం, సౌదీలో ఉద్యోగుల మృతదేహాల విలయం, మలేసియాలో జైలు పడిన వలస కార్మికులు వంటి సంఘటనలలో, వాస్తవాల కంటే హంగామా వార్తలకు మీడియా మొగ్గు చూపింది. అవి బాధితుల ప్రయోజనాల కన్నా వారికి ఇంకోసారి నష్టమే మిగిలింది. ప్రభుత్వాలు స్పందించే అవకాశం ఉన్నా, ఆ వక్రీకరణల వలన పరిస్థితి మరింత క్లిష్టమైంది. ఈ పరిస్థితులన్నింటి వేరే పేరే "మీడియా సంక్షోభం". మీడియా న్యాయవ్యవస్థపై మౌలిక అవగాహన లేకుండా వ్యవహరించడం, విదేశీ చట్టాలను విస్మరించడం, వలస భారతీయుల జీవితాలను "స్టోరీగా" చూడడయి ఇది మీడియా యొక్క అసమర్థతను, అనుభవాల లోటును వెల్లడిస్తుంది. నిమిష ఉదంతం దాని తీవ్రతను బయటపెడుతోంది. ఒక వ్యక్తి జీవితాన్ని, హింసోదంతాన్ని, కుటుంబాన్ని, దేశ దౌత్యాన్ని కానీ దీని వాస్తవికతున్యాయ పరిరక్షణ, చట్టపరమైన గౌరవం, మానవ హక్కుల సమతుల్యతుఅన్నీ పూర్తిగా విస్మరించబడ్డాయి.
ఇప్పటికైనా భారతీయ మీడియా చేసుకోవాలి. వార్తల పేరుతో నేరుగా తీర్పులు చెప్పే దుర్నీతి ఇక ఆపాలి. ఏ కేసు అయినా వాస్తవాల ఆధారంగా, నిష్పాక్షికంగా, సంబంధిత దేశ చట్టాలకు గౌరవం ఇవ్వాల్సిన సమయం ఇది.

నిమిష ఉదంతం ఒక్కదానికే పరిమితం కాకుండా, మన వ్యవస్థలోని లోపాలను ఆవిష్కరిస్తోంది. ఒక వ్యక్తి జీవితం మానవ హక్కుల పర్యాయంగా మార్చబడిన చోట, మీడియా తన వంతు బాధ్యతను గుర్తించకపోతే, మరో నిమిష.. మరో తలాల్.. మళ్లీ వస్తూనే ఉంటారు.

# మతరాజ్యం: మానసిక దౌర్బల్యానికి ప్రతిరూపం



దేశాన్ని మతరాజ్యంగా మార్చాలన్న ఆలోచన రోజురోజుకూ రాజకీయ వేదికలపై పునరావృతమవుతూ, ప్రజల్లో గందరగోళం పెంచుతోంది. "భారతదేశం హిందూ రాజ్యంగా పునరుద్ధరించాలి" అనే వాదనను నడిపించే రాజకీయ నాయకులు, వాగ్ధాటులు, పత్రికా రచయితలు ఎంతవరకు దేశ చరిత్రను చదివారో, ఎంతవరకు రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్నారు అనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. మతరాజ్య ఆలోచన దురహంకార భావన నుంచి పుట్టిన మానసిక దౌర్బల్యం మాత్రమే కాదు - అది సమాజాన్ని విభజించే హానికరమైన ఆయుధంగా మారుతోంది. భారత చరిత్రలో మతం పేరుతో పాలించిన రాజులు ఉన్నా, తాము అధికారికంగా మతరాజ్యమే అని ప్రకటించుకున్న సందర్భాలు లేవు. అశోకుని బౌద్ధ ఆదర్శాలు, అక్బర్ దినే ఇలాహీ వంటి మతసామరస్య వాదనలు, ఖిల్జీ, మొఘల్ రాజుల మతపరమైన పరిపాలనా పద్ధతులు అన్నీ "ధర్మం" అనే భావన చుట్టూ తిరిగినవి మాత్రమే కానీ, నేటి "ఒకే మతాన్ని దేశాధికారంలోకి తేవాలి" అనే నియంతత్వపు ప్రయత్నాలకు పోలిక లేదు. మతరాజ్యాలు యూరప్‌లో క్రైస్తవ చర్చ్ ఆధిపత్యాన్ని, మధ్యప్రాచ్యంలో ఖలీఫాత్ లేదా ఇస్లామిక్ రాజ్యాన్ని సూచించగలవు. కానీ భారతీయ సాంస్కృతిక ధారాలో - మతం అనే మాటకు "రాజ్యాధికారం" పైన ఆధిపత్యం ఇవ్వడం అనే భావన స్వభావానికి పరాయిగా ఉంటుంది. "సర్వధర్మ సమభావం" అనే సిద్ధాంతం భారత భూభాగం చుట్టూ వేల ఏళ్లుగా నడుస్తోంది. అనేక మతాలు భారతదేశంలో పుట్టి, ఎదిగి, పరస్పరం సహజీవనం చేస్తూ అభివృద్ధి చెందాయి. అలాంటి దేశంలో మతరాజ్యాన్ని ఏర్పరచాలనుకోవడం, అర్థం చేసుకోలేని భావజాలం కాదు. అది ఒక ఉద్దండం మానసిక అపవృద్ధిని సూచిస్తుంది. ఇక్కడ ప్రశ్నించాల్సింది - మతరాజ్యం అవసరమా? లేక లౌకికవాదం తప్పిందని భావిస్తున్నారా? భారతదేశ రాజ్యాంగం - మతనిరపేక్షత, సమానత్వం, స్వేచ్ఛ వంటి మూల్యాలపైనే నిర్మించబడింది. ఇందిరా గాంధీ హయాంలో "లౌకిక" అనే పదం రాజ్యాంగంలో చేరినప్పటికీ, అది తాత్వికంగా 1947 నుంచే భారత ప్రజల సార్వభౌమ సంకల్పంగా ఉన్నదే. మతరాజ్య స్థాపన అర్థం - ఇతర మతాలను పక్షపాతంగా చూడటం, ఆచార విశ్వాసాలను రాష్ట్రం ఆధారంగా తీసుకోవటం. ఇది సమాజాన్ని అసహిష్ణుతగా మార్చే వేదిక మాత్రమే. అదనంగా అది రాజకీయ లక్ష్యాలకోసం మతాన్ని వాడుకునే కుట్రామాత్రం అవుతుంది. భారతదేశం ఒక ఉమ్మడి భావన, మత భిన్నతలలో ఏకత్వాన్ని సూచించే జీవ వైవిధ్య సామాజిక నమూనా. మతరాజ్యం అనే భావనకు ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సాధారణంగా విదేశీ నమూనాల్ని అనుకరిస్తూ, జర్మనీలో గోబెల్స్ తాత్వికతను ఆదర్శంగా చూపిస్తూ "అబద్ధాన్ని వందసార్లు చెబితే అది నిజంగా మారుతుంది" అనే అసత్యప్రచార నాటకాన్ని ఆడుతున్నారు. ఇదే నాటకం "హిందూ రాజ్యం" అనే తలపుతో నడుస్తోంది. కానీ భారత రాజ్యాంగం బహుళత్వం, లౌకికత, వ్యక్తిగత హక్కులు, మత స్వేచ్ఛ వంటి విలువల సమాహారం. మతాన్ని రాజ్యాధికారానికి ఆధారంగా తీసుకోవడం అంటే రాజ్యాంగాన్ని విస్మరించడమే. భారతదేశంలో వక్ఫ్ బోర్డులపై జరుగుతున్న విమర్శలు కూడా అంతే దురుద్దేశపూరితంగా ఉన్నాయి. దేశంలో 8.7 లక్షల వక్ఫ్ ఆస్తులు ఉన్నాయని చెప్పడం ఒక వైపు, కానీ దేవాలయాలు, ఆశ్రమాలు, ధర్మాదాయ సంస్థల ఆస్తుల గణాంకాల్ని బయటపెట్టకుండా ప్రచారం చేయడం ద్వంద్వ ప్రమాణాల ప్రదర్శన మాత్రమే. భారతదేశంలో దేవాదాయ ఆస్తుల మొత్తం విలువ రూ.3 లక్షల కోట్లకు పైగా ఉండొచ్చని ప్రాథమిక అంచనాలు చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు పూర్తి గణాంకాలను వెల్లడించలేదు. వక్ఫ్ బోర్డుల పేరుతో ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చారనే వాదన, వాస్తవానికి అవగాహన లేని అర్ధాంతరపు ప్రచారం. మతరాజ్య ఆలోచన చివరికి కుల రాజ్యాల స్థాపన వరకు దారి తీస్తుంది. అర్థం చేసుకోవాలి - ఒక మతాన్ని అధికారికంగా స్థాపిస్తే, అది మిగతా మతాలను ద్వితీయ పౌరులుగా చూసే స్థితికి నెట్టివేస్తుంది. ఇదే లాజిక్ కులాలకూ వర్తిస్తుంది. ఒక కులం అధికారంలోకి వస్తే, మిగతా కులాలపై ఆధిపత్యం సాధించే ప్రమాదం ఉంది. ఇది వర్గ చిత్తశుద్ధి లేకుండా, వర్గ అధికారాన్ని శాశ్వతంగా నిలిపేసే ప్రమాదకర మతకుప్పకతనం. ఇది భారత సమాఖ్య భావనకు పూర్తి విరుద్ధం. ఇప్పటి హిమంత బిశ్వశర్మ వంటి ముఖ్యమంత్రులు "సోషలిజం భారత ఆర్థిక ఆలోచన కాదు" అని చెబుతుంటే, అది సమాజాన్ని పాత సామంతవాదపు అజ్ఞానంలోకి నెట్టే ప్రయత్నం. సోషలిజం అంటే వ్యక్తిగత సంపత్తికి వ్యతిరేకత కాదు. అది ఆ సంపత్తి పంపిణీలో సమానత్వానికి మార్గం. నెహ్రూ, అంబేడ్కర్, జేపీ వంటి నాయకులు అందరి సంక్షేమాన్ని ఆశించే ఆర్థిక సిద్ధాంతాలను ప్రచారం చేశారు. ఇది మన సంస్కృతిలోనూ - "సర్వేజనా సుఖినోభవంతు" అనే వాక్యంలో కనిపిస్తుంది. అంటే సోషలిజం మనకు పరాయి కాదు. అదే మాదిరిగా లౌకికవాదం కూడా ఈ భూమికి మాతృభాషే. ఈ దేశం అంటే ఒక జాతి కాదు. ఇది ఎన్నో జాతుల పునర్జన్మల సమాఖ్య. మతరాజ్య భావనను ఆమోదించడం అంటే %-% భారతదేశ విశ్వమానవతా ధోరణికి వ్యతిరేకంగా వెళ్ళడం. ఇది విభజనకు దారి తీస్తుంది. ఎక్కడైనా ఒక మతానికి అధికారిక గుర్తింపు ఇచ్చిన చోట, మిగతా మతాలకు జరిగిన అన్యాయం చూడాలి. పాకిస్థాన్‌లో హిందువుల పరిస్థితి, బంగ్లాదేశ్‌లో బౌద్ధుల స్థితి, మిడిల్ ఈస్ట్‌లో ఖలీఫా పాలనలలోని మైనారిటీ మతాల స్థితిగతులు ఏమిటో తెలుసుకోవాలి. అలాంటి వాతావరణాన్ని మన దేశంలో మళ్లీ తీసుకురావాలంటే అది పునరాగమనమే కాదు, వినాశనానికి సంకేతం. అందువల్ల మతరాజ్య స్థాపన అనే భావనను వ్యతిరేకించడం - కేవలం రాజకీయంగా తప్పు కాదు, ఇది ఒక సాంఘిక విధ్వంసానికి వ్యతిరేకంగా తీసుకోవాల్సిన నైతిక పోరాటం. ఇది భారతదేశ రాజ్యాంగాన్ని నిలబెట్టే, ప్రజాస్వామ్యాన్ని కాపాడే యత్నం. మతరాజ్య భావనను విశ్లేషించి, ప్రజలలో చైతన్యం తీసుకురావడం మేధావుల బాధ్యతగా మారింది. అంతిమంగా చెప్పుకోవాల్సింది %-% మతరాజ్య భావన ఒక మానసిక దౌర్బల్యం మాత్రమే కాదు, అది ఓ జాతివ్యతిరేక అసంతులిత వాస్తవాన్ని ప్రజల మీదకు నెట్టే ప్రయత్నం. అది దేశాన్ని చీల్చే మత రాజకీయాలకు గోడవేసే మార్గం. మతాన్ని హృదయంలో పెట్టుకోవచ్చు కానీ శాసన సభలో పెట్టకూడదు. ఇది రాజ్యాంగం చెప్పిన నిజం. భావితరాల కోసం సత్యాన్ని నిలబెట్టే సమయం ఇది.

## ఉపరాష్ట్రపతి రాజీనామా -కారణాల వెనుక గుట్టు?



దేశ ప్రజాస్వామ్యంలో అత్యున్నత పదవుల్లో ఒకటైన ఉపరాష్ట్రపతి స్థానం నుంచి ధన్‌ఖడ్ ఆకస్మికంగా వైదొలగడం అనేక ప్రశ్నలకు తలుపులు తీసింది. కొన్ని రోజుల కిందటే పదవీ కాలం పూర్తయ్యే వరకు కొనసాగుతానని శబ్దబద్ధంగా ప్రకటించిన ఆయన, అకస్మాత్తుగా రాత్రివేళ ట్వీటు ద్వారా రాజీనామా చేయడం విశేషమే కాదు, అనుమానాలకు తావివ్వే పరిణామం. ప్రజాస్వామిక వ్యవస్థలో ఉన్నతి స్థాయికి ఎదిగిన వ్యక్తి ఇలా సమాజానికి తెలియజేయకుండానే, తన స్థానం నుంచి తప్పుకోవడం అర్థాన్ని తెలిపే ప్రబంధంగా మారింది. ఇది కేవలం వ్యక్తిగత నిర్ణయం కాదు, సున్నితమైన రాజకీయ ప్రక్రియను సూచించే మౌనచిహ్నం కూడా. ఉపరాష్ట్రపతిగా ధన్‌ఖడ్ పదవీ కాలం ప్రారంభం నుంచీ వివాదాల మధ్య కొనసాగింది. పార్లమెంట్‌లో ఆయన తీరు, ప్రతిపక్షాలపై ఆయన ప్రవర్తన, పదేపదే విభిన్న వ్యవస్థల పట్ల చేసిన వ్యాఖ్యలు ఈ పదవికి వన్నె తెచ్చాయో లేదో కాని, వివాదాల బీజం మాత్రం వేశారు. ఆయన గళం గట్టిదనే చెప్పాలి. కానీ ఆ గళం న్యాయవ్యవస్థను కించపరిచేలా మారిన సందర్భాలు, రాజ్యాంగ వ్యవస్థలను పర్యవేక్షించే తన స్థానాన్ని తక్కువ చేసి మాట్లాడిన సందర్భాలు ప్రజాస్వామిక విశ్వాసానికి బహుళంగా హానికరం అయ్యాయి. గవర్నర్‌గా పశ్చిమ బెంగాల్‌లో కొనసాగిన సమయంలో మమతా బెనర్జీతో ఆయన తలపడ్డ వివాదాలే కాక, కేంద్ర ప్రభుత్వ విధేయతపై ఉన్న అనుమానాలు ఆయన భవిష్యత్తును కలవరపరిచినట్లు కనిపిస్తోంది. రాజ్యసభ సమావేశాల్లో మంత్రులు, సభ్యులతో జరిగిన వాగ్వివాదాలు, మర్మముల్ని మించిపోయిన తీరు ఆయన శైలికి గుర్తుగా నిలిచాయి. న్యాయవ్యవస్థపై ఆయన చేసిన వ్యాఖ్యలు, ముఖ్యంగా కోలీజియం వ్యవస్థపై తీవ్ర విమర్శలు, ఆయన అభిప్రాయాలను ఆవేశంగా మాత్రమే కాక, ఆదేశాల రూపంలో కూడా వెలిబుచ్చిన తీరు ఒక విశ్వాసభంగాన్ని కలిగించాయి. న్యాయవ్యవస్థపై ధ్వనించిన అభ్యంతరాలు ప్రజాస్వామ్య గర్భగత నిబంధనలపై ప్రభుత్వానికి ఆమోదయోగ్యంగా మిగిలినా, ప్రజలలో మాత్రం ఆందోళన రేకెత్తించాయి. ఎంపీలను నిందిస్తూ ఆయన చేసిన విమర్శలు, వారి చొరవను చొరబాటుగా అభివర్ణించడంలో కనిపించిన ధ్వని, ఒక రాజ్యాంగ స్థంభానికి సంబంధించిన అధికారుల నుంచి ఆశించేది కాదు. ఈ నేపథ్యంలోనే ఆయన రాజీనామా అనేక అర్థాల్ని కలిగిస్తోంది. అధికారపక్షంలోని ముఖ్య నాయకుల అసహనం, మౌనంగా ఉన్న కేంద్రం, మోదీ ట్వీటు రూపంలో వచ్చిన ఉదాసీన స్పందన, అన్ని కలిపి ఒక స్పష్టమైన రాజకీయ సంకేతాన్ని సూచిస్తున్నాయి. ధన్‌ఖడ్ పదవి నుండి తప్పుకోవడం ఆయన ఆరోగ్య కారణాలపై ఆధారపడినదేనా? లేక ఆయన పార్టీకి వ్యతిరేకంగా మారిపోయిన మాటలు, తీర్పులు వల్ల వచ్చిన ఒత్తిడేనా? ఆయనను మరొక హోదాలో నియమించే ప్రయత్నమా? లేక ఇదే అంతిమ ముగింపు? ఇప్పటివరకు ఉపరాష్ట్రపతి పదవి నుండి రాజీనామాలు సాధారణంగా రాష్ట్రపతిగా ప్రమోషన్ పొందిన సందర్భాల్లో మాత్రమే జరిగాయి. కానీ ధన్‌ఖడ్ ఉదంతం వేరే కోణాన్ని పరిచయంచేస్తోంది. విశ్లేషకులలో కొందరేమో ఇది భవిష్యత్‌లో మరింత బాధ్యతను స్వీకరించడానికి ఒక వ్యూహాత్మక రాజీనామా అని అంటున్నారు. మరికొందరేమో ఇది పార్టీలోని అంతర్గత విభేదాల ఫలితంగా సాగిన చర్య అంటున్నారు. ధన్‌ఖడ్ కోలీజియంపై చేసిన విమర్శలపై న్యాయమూర్తుల అసహనం, సభ్యుల అసహనం, ఒక వర్గానికి రాజకీయంగా చికాకైన అభిప్రాయాలు ఇవన్నీ కలిపి ఆయన స్థానం ప్రమాదంలో పడింది అన్న సంకేతాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. అయితే ఇది కేవలం రాజకీయ వ్యవహారమే కాదు. ప్రజాస్వామ్యంలో అగ్రస్థానాలు బాధ్యతతో కూడినవైపుగా భావించాలి. ప్రజలకు ఈ విధమైన మార్పుల గురించి స్పష్టత అవసరం. ప్రభుత్వ ప్రతినిధులు, అధికారపక్ష నాయకులు ఒక ఉపరాష్ట్రపతి రాజీనామాపై మౌనంగా ఉండటం బాధాకరం. ఇది ప్రజాస్వామ్యానికి అర్థరహిత ప్రక్రియగా మారుతుంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యతను మరిచినట్లుగా కనిపిస్తుంది. ధన్‌ఖడ్ అభిషేక సమయంలో వచ్చిన విమర్శలే కాదు, ఆయన ప్రవర్తనపై ప్రతిపక్షాలు పెట్టిన అభిశంసన తీర్మానం, సభలో ఆయన తీరు, విభిన్న వ్యవస్థలపట్ల గౌరవం లేకపోవడం ఇవన్నీ కలిపి ఒక రాజకీయ నాటకానికి తెరలేపినట్లుగా కనిపిస్తోంది. ఈ పరిణామం వెనుక ఉన్న అంతర్గత వ్యూహాలు ఏమిటి అన్నదాన్ని తెలుసుకోవాల్సిన హక్కు ప్రజలకు ఉంది. ప్రభుత్వం ఇందుకు సమాధానం చెప్పాలి. ప్రజాస్వామ్యంలో అధికారానికి కంటే ఎక్కువ బాధ్యత ఉంది. బాధ్యత వహించని విధంగా రాజకీయ నాయ?? ప్రవర్తన, తాత్కాలిక ప్రకటనలు, ట్వీట్ల ద్వారా హస్తక్షేపం ప్రజల మానసిక స్థితిని కలవరపెడుతుంది. భారత రాజకీయ వ్యవస్థలో గౌరవనీయమైన పదవుల పట్ల ఉన్న అవగాహన, గౌరవం ఇటువంటి ఊహించని పరిణామాలతో తక్కువ అవుతున్నది. ధన్‌ఖడ్ ఉదంతం ఈ విషయంలో ఒక పాఠంగా మారాలి. ఒక వ్యక్తి పదవిలో ఉన్నంత కాలం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండాల్సిన బాధ్యతను గుర్తుంచుకోవాలి. అదే విధంగా, ఆయన నిష్క్రమణ వెనుక ఉన్న నిగూఢతను బయటపెట్టే బాధ్యత ప్రభుత్వం, మీడియా, విశ్లేషకుల మీద ఉంది. ఇది ఒక వ్యక్తిగత రాజీనామా మాత్రమే కాదు. ఒక పదవిని, ఒక వ్యవస్థను కలవరపరిచే ఘటన. ఆఖరికి ఒక విషయం స్పష్టంగా చెబుతుంది. సత్యం ఏమిటో తెలియకుండానే ఒక అధికారి నిష్క్రమించడం ప్రజాస్వామ్యానికి క్షీణత సూచన. నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే, బాధ్యత తీసుకోవాల్సిన వాళ్లు ముందు రావాలి. మౌనంగా కాక, ప్రకటనల ద్వారా కాక, సమర్థవంతమైన వివరాల ద్వారా. ధన్‌ఖడ్ ఆకస్మిక నిష్క్రమణ వ్యవస్థలలో నిబద్ధతను, పారదర్శకతను పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని రిపీట్ చేస్తున్న బలమైన ఉదంతం.

-సహాయ మీడియా సర్వీస్

### కర్షకుడి కన్నీరు

నింగికి ఎగబాకిన ఆశల పొలాలు,
నీలిమ గగనపు తలుపు తట్టిన మొలకలు,
ఒక చినుకే ఎదురు చూస్తూ,
విత్తనంగా జారిన రైతు కనులు.

ఎండ తాకిన పొలాల్లో
ఏడ్చింది భూమి మౌనంగా...
గాలిలో తడిపెట్టని మేఘం
గుండెలో తడులే రేపింది.

విత్తనాలు ఎదురుచూస్తున్నాయి
వాన చినుకుల నెమ్మదినడక కోసం,
భూమాత తపిస్తుంది
వర్షపు నీటి కోసం

తండ్రిలా నేలని తడిపాడు,
తల్లిలా దుమ్ము చల్లాడు,
చదువుకున్న వాడు కాదు కానీ,
విత్తనాల్లో భవిష్యత్తు రాసాడు.

కరువుపడ్డ నేలతో నిత్యం మాటలు,
ఎండలో కాలిన చెట్లు నెచ్చెలి తాపాలు,
గడిచే ప్రతి ఘడియ అతనికొక పరీక్ష,
కానీ నమ్మకమే అతని నీడ.

వర్షం వాసనకి వదులుకున్న కలలు,
ఇప్పుడు మట్టిలోనే మరుగైపోతున్నాయి.
తిన్న పూట మరిచి మట్టి ముద్దలతో,
పిల్లల ఆకలిని పూసే చేతులు రోధిస్తున్నాయి.

ఒక మెరుపు పడితే గుండె పులకరిస్తుది
ఒక మబ్బు కమ్మితే ప్రాణం లేచివస్తుంది.
నదులు నిండక పోయినా పర్వాలేదు,
ఆ కళ్ళు నిండాలంటే- ఒక చినుకే చాలదా?

-షహనాజ్

భక్తి

## ఆషాఢ అమావాస్య రోజు.. ఇలా చేయండి చాలు..



మరణానంతరం పితృ దేవతలను సరిగ్గా గౌరవించకుంటే.. కుటుంబం పలు విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీనినే పితృదోషం అంటారు. జ్యోతిష్య శాస్త్రంలో పితృ దోషాన్ని ప్రధాన దోషంగా పరిగణిస్తారు. ఇది వ్యక్తితోపాటు అతడి కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని చెబుతారు. మన వంశంలోని మరణించిన వారికి మతపరమైన ఆచారాలు.. అంటే శ్రద్ధ లేదా తర్పణ సకాలంలో నిర్వహించాల్సి ఉంటుంది. అలా చేయకుంటే.. పితృదోషం అంటుకుంటుంది. కుటుంబ సభ్యుల్లో అకాల మరణం సంభవిస్తే.. వారు మోక్షాన్ని పొందలేరు. వారి కోరికలు నెరవేరకుంటే.. వారి జీవితంలో ఏదైనా పాపం చేసి ఉంటే.. అది వారి భవిష్యత్ తరాలను ప్రభావితం చేస్తుంది.

ఈ పితృ దోష నివారణకు జ్యోతిష శాస్త్రం, గ్రంథాల్లో అనేక నివారణోపాయాలు ప్రస్తావించారు. వీటిని నమ్మకంగా పాటించడం ద్వారా ఆ దోష ప్రభావం తగ్గుతుంది. అంతేకాదు.. జీవితంలో సానుకూల మార్పులు సైతం సంభవిస్తాయి. ప్రస్తుతం జులై మాసంలో ఆషాఢ అమావాస్య వస్తుంది. అంటే శ్రావణ మాసం ప్రారంభానికి ఒక రోజు ముందు వచ్చే ఈ రోజు.. పూర్వీకులకు నీరుతోపాటు నల్ల నువ్వులను సమర్పించాలి. ఇది పూర్వీకులకు శాంతిని కలిగిస్తుందితాటి చెట్టు కింద దీపం వెలిగించాలి.. మధ్యాహ్నం, రావి చెట్టుకు నీరు పోయాలి. పువ్వులు, అక్షత, పాలు, గంగా జలంతోపాటు నల్ల నువ్వులు సమర్పించడం ద్వారా మీ పూర్వీకులను స్మరించుకోవాలి. సాయంత్రం అరలి చెట్టు కింద దీపం వెలిగించాలి. ప్రతి రోజు.. ఒక ఆవు, కుక్క, కాకికి ఆహారం పెట్టండి (వీటిని పూర్వీకుల చిహ్నంగా పరిగణిస్తారు). ఇంటి దక్షిణ భాగంలో మీ పూర్వీకుల చిత్రాన్ని ఉంచండి. ప్రతిరోజూ వారికి దండలు సమర్పించి.. నమస్కారం చేయాలి.
పూర్వీకుల పట్ల అగౌరవం.. పూర్వీకులను అవమానించినట్లయితే లేదా విస్మరించినట్లయితే.. కుటుంబ సంప్రదాయాలు, మతపరమైన ఆచారాలు పాటించకుంటే.. పితృదోషం సంప్రాప్తిస్తుందంటారు. అలాగే జ్యోతిష శాస్త్రం ప్రకారం.. జాతకంలో సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి, కుజుడు, శని వంటి గ్రహాల నిర్దిష్ట స్థానం వల్ల లేదా రాహు - కేతువుల ప్రభావం వల్ల పితృ దోషం సంభవిస్తుందని నమ్ముతారు. కుటుంబంలో ఈ సమస్యలన్నీ.. పితృ దోషం కారణంగా.. ఒక వ్యక్తి జీవితంలో అనేక రకాల సమస్యలు తలెత్తుతాయి. వివాహ అనుకూలత లేదా సంఘర్షణలో నిరంతర ఇబ్బందులు కలుగుతాయి. ఆ తర్వాత వైవాహిక జీవితంలో ఒత్తిడి ఎదుర్కొంటారు. కొన్నిసార్లు ఈ సంఘర్షణలు.. విడాకుల వరకు వెళుంది. పిల్లలు లేకపోవడం, పిల్లలు ఉన్నప్పటికీ ఎక్కువ కాలం జీవించక పోవడం, పిల్లలు మానసిక వికలాంగులు లేదా వికలాంగులు కావడం జరుగుతుంది. నిరంతరం అనారోగ్యంతో లేదా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కుటుంబ సభ్యులు చికిత్సకు కావలసిన ప్రభావాన్ని కలిగి ఉంటారు.



## నకిలీ రాయబార కార్యాలయం, ఫ్యాన్సీ దౌత్య కార్లు.. ఒక వ్యక్తి అరెస్ట్



**లక్నో-నవభూమి:** ఒక వ్యక్తి ఏకంగా అద్దె ఇంట్లో నకిలీ రాయబార కార్యాలయం నిర్వహిస్తున్నాడు. లగ్జరీ, ఫ్యాన్సీ దౌత్య కార్లతో రాయబారిగా బిల్డప్ ఇచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు షాక్ అయ్యారు. చివరకు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. హర్షవర్ధన్ జైన్ అనే వ్యక్తి విలాసవంతమైన రెండంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకున్నాడు. అమెరికా నేవీ అధికారి స్థాపించిన ఏ దేశం గుర్తించని 'వెస్టార్కిటికా' రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. తనను తాను రాయబారిగా అందరితో పరిచయం చేసుకున్నాడు. దౌత్య నంబర్ ప్లేట్లు ఉన్న ఖరీదైన కార్లలో ప్రయాణించాడు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఇతర ప్రముఖులకు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు వినియోగిస్తూ ఆదరణ పొందుతున్నాడు. కాగా, జులై 22న ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్)కు ఈ నకిలీ రాయబార కార్యాలయం గురించి తెలిసింది. దీంతో ఆ భవనంపై రైడ్ చేశారు. హర్షవర్ధన్ జైన్‌ను అరెస్ట్ చేశారు. దౌత్య నంబర్ ప్లేట్లు ఉన్న నాలుగు లగ్జరీ కార్లు, 12 మైక్రోనేషన్ల దౌత్య పాస్‌పోర్ట్‌లు, విదేశాంగ మంత్రిత్వ శాఖ స్టాంపులున్న పత్రాలు, 34 దేశాల స్టాంపులు, రూ.44 లక్షల నగదు, విదేశీ కరెన్సీ, 18 దౌత్య నంబర్ ప్లేట్‌లను స్వాధీనం చేసుకున్నారు. హర్షవర్ధన్ జైన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాత్రిపూట హెూటల్‌లోకి ప్రవేశించిన ఊహించని అతిది



**మౌంట్ అబు- నవభూమి:** రాజస్థాన్‌లోని హిల్ స్టేషన్ మౌంట్ అబులో గల ఓ హెూటల్‌కు రాత్రిపూట ఊహించని అతిథి వచ్చింది. తెల్లవారుజామున 2:55 గంటల ప్రాంతంలో అడవిలో నుంచి వచ్చిన ఎలుగుబంటి హెూటల్ రిసెప్షన్ ప్రాంతంలోకి ప్రవేశించింది. మెయిన్‌డోర్ తీసుకుని లాబీలోకి ఎంటర్ అయ్యింది. అనంతరం దాదాపు నాలుగు నిమిషాల పాటూ అక్కడ ఉన్న వస్తువులను నిశితంగా పరిశీలించింది. అనంతరం వచ్చిన దారినే బయటకు వెళ్లిపోయింది. ఆ సమయంలో రిసెప్షన్ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన దృష్యాలు అక్కడే ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యాయి. మౌంట్ అబు ఎలుగుబంటి జనాభాకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో దాదాపు 350 ఎలుగుబంట్లు ఉన్నాయి.

## ఎఫ్‌డీఐ రూల్స్ అతిక్రమణ.. మిన్‌త్ర కంపెనీపై ఈడీ ఫిర్యాదు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఫ్యాషన్ డిజైన్ కంపెనీ మిన్‌త్రపై ఈడీ కేసు నమోదు చేసింది. ఫెమా ఉల్లంఘన జరిగినట్లు ఆ కేసులో ఈడీ పేర్కొన్నది. సుమారు 1654.35 కోట్ల మేరకు అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. మిన్‌త్ర డిజైన్స్ కంపెనీతో పాటు దాని అనుబంధ సంస్థలు, డైరెక్టర్లు ఈ ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈడీ ప్రకారం%ొ% మిన్‌త్ర తో పాటు అనుబంధ కంపెనీలు.. మల్టీ బ్రాండ్ రిటేల్ వాణిజ్యాన్ని కొనసాగించాయి. కానీ హెూల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ వ్యాపారం చేస్తున్నట్లు ఆ కంపెనీ పేర్కొన్నది. తప్పుడు వ్యాపారాన్ని సూచిస్తున్న ఆ కంపెనీ.. నేరుగా ఎఫ్‌డీఐ విధానాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందని ఈడీ తెలిపింది.ఎంబీఆర్టీ వ్యాపారంలో విదేశీ పెట్టుబడులకు అనుమతి ఉండదు. మిన్‌త్ర కంపెనీ వెక్టర్ ఈ కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పేరుతో దుస్తులను విక్రయించింది. వెక్టర్ గ్రూపు నేరుగా కస్టమర్లకు సరుకులను అమ్మినట్లు ఈడీ పేర్కొన్నది. రిటేల్‌గా సాగిన వ్యాపారాన్ని పేపర్‌పై మాత్రం హెూల్‌సేల్‌గా చూపించినట్లు వెక్టర్ గ్రూపుపై ఈడీ ఆరోపణలు చేసింది. ఇదొక రకంగా ఎఫ్‌డీఐ రూల్స్ ఉల్లంఘన అవుతుందని ఈడీ తెలిపింది.

## విమాన ప్రమాదం.. శవాల అప్పగింతలో తప్పులు..



**బెంగళూరు - నవభూమి:** ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ 171 విమాన ప్రమాదంలో 271 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. విమానం కుప్పకూలిన వెంటనే పేలటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ మంటల్లో పడి ఎక్కువ మంది కాలి బూడిద అయ్యారు. ఆ శవాలు ఎవరివో గుర్తుపట్టలేని పరిస్థితి ఏర్పడింది. శవాలను గుర్తించడానికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. డీఎన్ఏ పరీక్షల ఆధారంగా శవాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. అయితే, యూకే జాతీయుల శవాల అప్పగింతలో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించలేదని తెలుస్తోంది.డీఎన్ఏ పరీక్షలు చేయకుండానే దాదాపు 12 శవాలను ఎయిర్ ఇండియా యూకేకు పంపినట్లు సమాచారం. ఆ శవాల అప్పగింతలో తప్పులు దొర్లినట్లు తెలుస్తోంది. ప్రముఖ యూకే మీడియా డైలీ మెయిల్ కథనం ప్రకారం.. విమాన ప్రమాదంలో చనిపోయిన యూకే జాతీయుల కుటుంబాలకు ఎయిర్ ఇండియా వేరే వ్యక్తుల శవాలు అప్పగించింది. వేరే వ్యక్తి శవం వచ్చిన కారణంగా ఓ కుటుంబం అంత్యక్రియల్ని ఆపేసింది. ఇంకో ఘటనలో ఒకే శవపేటికలో ఇద్దరి అవశేషాలు ఉన్నాయి.దీనిపై ఇన్నర్ వెస్ట్ లండన్ కారోనర్ డాక్టర్ ఫియోనా విల్‌కాక్స్ మాట్లాడుతూ.. ప్రమాదంలో చనిపోయిన బ్రిటీష్ జాతీయుల శవాలను గుర్తించేందుకు వారి కుటుంబసభ్యులకు డీఎన్ఏ పరీక్షలు చేయించాలని డిమాండ్ చేశారు. ఇక, శవాల అప్పగింతలో చోటుచేసుకున్న తప్పులపై లండన్‌లో ఉన్నత స్థాయి దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. యూకే ప్రధాని ఈ విషయాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీతో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఎట్టకేలకు నింగిలోకి బ్రిటన్ ఫైటర్ జెట్ ఎఫ్ 35బీ



**తిరువనంతపురం - నవభూమి:** సోషల్ మీడియాలో కడుపుబ్బనవ్వించే మీమ్స్‌కు, కామెంట్లకు దారితీసిన బ్రిటీష్ యుద్ధ విమానం ఎఫ్-35బీ దాదాపు 5 వారాల తర్వాత నింగిలోకి ఎగిరింది. గత నెలలో జరిగిన భారత్-బ్రిటన్ నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఎఫ్-35బీ విమానానికి అకస్మాత్తుగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఈ విమానాన్ని జూన్ 14న అర్ధరాత్రి కేరళ రాజధాని తిరువనంతపురంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయంలో దింపేశారు. అప్పటి నుంచి ఆ విమానం అక్కడే ఉంది. దీనిలో తలెత్తిన సాంకేతిక లోపాన్ని గుర్తించడంలోనే నిపుణులు ప్రయాస పడ్డారు. ఈ నెల 6న 14 మందితో కూడిన బ్రిటన్ ఇంజనీరింగ్ నిపుణుల బృందం.. రంగంలోకి దిగి పూర్తిస్థాయిలో ఎఫ్-35బీని పరిశీలించి.. సాంకేతిక సమస్యలను గుర్తించింది. అనంతరం.. భారత వైమానిక నిపుణుల బృందంతో కలిసి.. ఇంజన్‌లో తలెత్తిన సమస్యను పరిష్కరించింది. కాగా, 5 వారాలకు పైగా తిరువనంతపురం విమానాశ్రయంలో ఉన్న ఎఫ్-35బీ యుద్ధ విమానానికి ల్యాండింగ్ చార్జీలు, రోజువారీ అద్దె, పార్కింగ్ ఫీజుల రూపంలో రూ.5-6 లక్షలు వసూలు చేసినట్టు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.

# గోరుచిక్కుడు కూర తిని ముగ్గురు మృతి..

### వారం క్రితం చేసిన ఆ పనే కూరని విషతుల్యం చేసింది..



**బెంగళూరు - నవభూమి:** కర్ణాటకలోని రాయ్‌చూర్ జిల్లాలో ఓ అత్యంత విషాదకర ఘటన చోటు చేసుకుంది. ముఖ్యంగా రాత్రిపూట వారు వండుకుని తిన్న గోరు చిక్కుడు కూరే.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు తీసింది. అలాగే మరో ముగ్గురు ఐసీయూలో ఉండి చికిత్స పొందేలా చేసింది. ఏంటీ గోరు చిక్కుడు కూర ఇంత పని చేసిందా అనిపిస్తోందా.. అవునండీ ఇదంతా చేసింది ఆ కూరే. ప్రాణాలు పోవడానికి కారణం గోరు చిక్కుడే అయినా.. వారం రోజుల క్రితం కుటుంబ యజమాని చేసిన పని వల్లే అది విషతుల్యమైంది. మరి అదెలాగో తెలుసుకుందామా..?కర్ణాటకలోని రాయ్‌చూర్ జిల్లాకు చెందిన 38 ఏళ్ల రమేష్, పద్మ దంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. అందులో ముగ్గురు ఆడ పిల్లలు కాగా ఒక బాబు ఉన్నాడు. అయితే వీరికి తాతల నుంచి వచ్చిన భూమి ఉండగా.. అక్కడే పంటలు పండించుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవలే ఆ పొలంలో గోరు చిక్కుడు, ఇతర కూరగాయ పంటలు వేశారు. ఎప్పటిలాగే సోమవారం రోజు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన భార్యాభర్తలు వచ్చేటప్పుడు గోరు చిక్కుడు కాయ తెంపుకు వచ్చారు. ఇంటికి వచ్చిన వెంటనే దాన్ని కట్ చేసి పద్మ వంట చేసింది. అయితే ఆరోజు రాత్రి కుటుంబ సభ్యులు అందరూ అదే కూర తిని పడుకున్నారు. అయితే అర్ధరాత్రి నుంచి కుటుంబ సభ్యులు అందరికీ కడుపునొప్పి, వికారం, వాంతులు ప్రారంభం అయ్యాయి. అందరికీ ఒకేసారి ఇలా జరగడంతో.. వారంతా భయపడి పక్కింటి వాళ్లకు చెప్పారు. ఇలా వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడికి వెళ్లేలోపే రమేష్, ఆయన కుమార్తెలు 8 ఏళ్ల నాగమ్మ, 6 సంవత్సరాల దీప ప్రాణాలు కోల్పోయారు. భార్య పద్మ, మరో కుమారుడు కృష్ణ, కుమార్తె చైత్రలు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో.. వారిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు వెంటనే స్పందించారు. ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. దీని ద్వారా మరణాలకు గల అసలు కారణాన్ని నిర్ధారించనున్నారు. ముఖ్యంగా వీరంతా సోమవారం రోజు రాత్రి గోరు చిక్కుడు కూర తిన్నారని.. దాని వల్లే వీరి శరీరంలోకి విషం వెళ్లిందని గుర్తించారు. దీంతో ఇంటికి వెళ్లి పరిశీలించారు. అలాగే వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి కూడా చూడగా.. వారం రోజుల క్రితమే రమేష్ కూరగాయలకు పురుగుల మందు కొట్టినట్లు గుర్తించారు. దాని వల్లే విష పదార్థాలు కూరగాయలపై ఉండిపోయాయని.. ఫలితంగా వారి కడుపులోకి వెళ్లి విషంగా మారిపోయినట్లు తెలుసుకున్నారు. ఈ సంఘటన గ్రామ ప్రజలను, జిల్లా యంత్రాంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. పురుగుల మందుల వాడకం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని.. పంటలను కోసే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ విషాద ఘటన గ్రామంలో విషాద ఛాయలు అలుముకోవడానికి కారణమైంది.

# తల్లిని కొట్టాడని అతడిపై పగ పెంచుకున్నాడు..



**లక్నో-నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో నగరంలో జరిగిన ఒక హత్య కేసును పోలీసులు ఛేదించగా.. దాని వెనుక పదేళ్ల నాటి ప్రతీకార కథ, మద్యం విందుతో ముడిపడిన విస్మయకరమైన వివరాలు వెలుగుచూశాయి. తన తల్లికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఒక యువకుడు దశాబ్ద కాలం వేచి చూసి.. పకడ్బందీ ప్రణాళికతో హత్య చేశాడు. ఆపై తన పగ తీరినందుకు, అందుకు సహాయం చేసినందుకుగాను స్నేహితులకు మందు పార్టీ ఇచ్చాడు. కానీ ఊహించని విధంగా పోలీసులకు చిక్కగా.. ప్రస్తుతం ఊచలు లెక్కబెడుతున్నాడు. యూపీలోని లఖ్‌నవూ ప్రాంతానికి చెందిన సోను కశ్యప్.. ఇంటి పక్కనే మనోజ్ అనే వ్యక్తి ఉండేవాడు. అయితే పదేళ్ల క్రితం ఈ రెండు ఇళ్ల మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలోనే మనోజ్.. సోను తల్లి చెంపపై కొట్టాడు. దీంతో సోను కశ్యప్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ఇలా ఇద్దర మధ్య చాలానే గొడవ జరిగినా.. ఆ తర్వాత సద్దుమణిగింది. కానీ సోను మనసులో మాత్రం ఈ దృశ్యాలు చెక్కు చెదరలేదు. ముఖ్యంగా తన తల్లికి జరిగిన తీవ్ర అవమానాన్ని అస్సలే మర్చిపోలేకపోయాడు. మనసులో ఆ కోపం అగ్నిజ్వాలలా రగిలిపోతూనే వచ్చింది. అయితే ఆనాటి నుంచే మనసులో ప్రతీకారంతో పెరిగిన సోను.. ఎలాగైనా సరే మనోజ్‌ను అంతం చేయాలనుకున్నాడు.

కానీ మనోజ్ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోగా.. అతడి కోసం వెతకడం ప్రారంభించాడు. గత పదేళ్లుగా మనోజ్ కోసం గాలిస్తూనే వచ్చాడు. వీలు దొరికినప్పుడల్లా లక్నో నగర వీధుల్లో తిరుగుతూ వచ్చాడు. చివరికి మూడు నెలల క్రితం మనోజ్‌ను గుర్తించాడు. అప్పటి నుంచి సోను తన ప్రతీకారాన్ని అమలు చేయడానికి నిశితంగా ప్రణాళికలు రచించాడు. మనోజ్ రోజువారీ కదలికలను, షెడ్యూల్‌ను గమనిస్తూ.. అతని బలహీనతలను పసిగట్టాడు.

ఈ దారుణమైన ప్రణాళికలో సోను తన నలుగురు స్నేహితులను కూడా కలుపుకున్నాడు. హత్య పూర్తయిన తర్వాత వారికి భారీ స్థాయిలో మందు పార్టీ ఇస్తానని ఆశ చూపి మరీ తాను చేసే హత్యకు సాయం చేయాలని చెప్పాడు. ఇందుకు వారు కూడా ఒప్పుకోగా.. మే 22వ తేదీన మనోజ్ తన దుకాణం మూసివేసిన ఇంటికి వెళ్తుండగా దాడికి పాల్పడ్డారు. సోనుతో పాటు అతడి స్నేహితులు కూడా ఇనుప రాడ్లతో మనోజ్‌ను అతి దారుణంగా కొట్టారు. అతడు స్పృహ తప్పి పడిపోగానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొన ప్రాణాలతో ఉన్న అతడిని గుర్తించిన కొందరు స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఇలా చికిత్సపొందుతూ మనోజ్ ప్రాణాలు కోల్పోయాడు.

ఈక్రమంలోనే కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా మనోజ్‌కు దాడి జరిగిన చోట ఉన్న సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. నిందితులను గుర్తించి వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. మరోవైపు సోను మాట ఇచ్చిన ప్రకారమే తన స్నేహితులకు భారీ స్థాయిలో మందు పార్టీ ఇచ్చాడు. ఈ పార్టీకి సంబంధించిన ఫొటోలను సైతం వారు సంతోషంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. హత్య సమయంలో నిందితుల బట్టలు, సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటోల్లో ఉన్న వ్యక్తుల బట్టలు అలాగే ఉన్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. ఇది పోలీసులకు కీలక ఆధారంగా మారింది. సోషల్ మీడియాలో లభించిన ఫొటోల ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు.. ఐదుగురు నిందితులను ట్రాక్ చేసి పట్టుకున్నారు. ప్రస్తుతం నిందితులు అంతా పోలీసుల అదుపులో ఉండగా.. తామే ఈ హత్యకు పాల్పడినట్లు కూడా అంగీకరించారు.

# రాష్ట్రవ్యాప్తంగా టీ, కాఫీ, పాల విక్రయాలు బంద్



**బెంగళూరు - నవభూమి:** కర్ణాటక రాష్ట్రం మరో భారీ నిరసన ప్రదర్శనకు వేదికగా మారింది. వాణిజ్య పన్నుల శాఖ జారీ చేసిన జీఎస్టీ నోటీసులకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా బేకరీలు, చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు ఏకమయ్యారు. తమ నిరసనను వ్యక్తం చేస్తూ.. టీ, కాఫీ, పాల విక్రయాలను నిలిపి వేశారు. అంతేకాకుండా నల్ల బ్యాడ్జీలు ధరించి మరీ విధులు నిర్వహిస్తున్నారు. ఈ నిరసన ఉద్ధృతం కాగా.. జులై 25వ తేదీ గురువారం రోజు రాష్ట్రవ్యాప్త బంద్‌కు కూడా పిలుపునిచ్చారు. ఈ జీఎస్టీ నోటీసులు ఆర్థిక సంవత్సరం 2021-22 నుంచి 2024-25 వరకు సేకరించిన యూపీఐ డేటా ఆధారంగా జారీ చేయబడ్డాయి. డిజిటల్ లావాదేవీల ద్వారా సేవలకు రూ.20 లక్షలు లేదా వస్తువులకు రూ.40 లక్షలు మించి రసీదులు పొందిన వ్యాపారులను ఈ నోటీసులు లక్ష్యంగా చేసుకున్నాయి. ముఖ్యంగా నాలుగేళ్లలో రూ.1.36 కోట్ల లావాదేవీలు జరిగాయంటూ రూ.29 లక్షల జీఎస్టీ కట్టాలని ఓ కూరగాయల వ్యాపారికి నోటీసు వచ్చింది. ఇలా అనేక మందికి అంతగా.. వారంతా ఆందోళన చెందారు. ఈక్రమంలోనే చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు స్పందిస్తూ.. తాము అన్యాయంగా లక్ష్యంగా మారుతున్నామని ఆరోపించారు. తమ డిజిటల్ లావాదేవీలను ట్రాక్ చేసి, భారీ పన్ను బాధ్యతలు మోపడం సరైంది కాదని వారు వాది నోటీసులు అందుకున్నప్పటి నుంచి అనేక మంది వ్యాపారులు తమ లావాదేవీలను 'నగదు మాత్రమే' పద్ధతికి మార్చుకున్నారు. పెద్ద ఎత్తున పన్ను చెల్లించాల్సి వస్తుందనే భయంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చిన్న వ్యాపారుల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారి సమస్యలను విని, పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.అయితే వ్యాపారుల సంఘాలు తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చకపోతే.. నిరసనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించాయి. జులై 25వ తేదీ గురువారం రోజున రాష్ట్రవ్యాప్త బంద్‌కు ఇచ్చిన పిలుపును ఇచ్చాయి. ఈ బంద్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా దైనందిన జీవితంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. వేలాది మంది చిన్న, సన్నకారు వ్యాపారుల జీవనోపాధికి సంబంధించిన ఈ సమస్య, ప్రభుత్వానికి ఒక పెద్ద సవాలుగా మారింది. సున్నితమైన రీతిలో ఈ సమస్యను పరిష్కరించకపోతే, ఇది పెద్ద ఎత్తున ప్రజా వ్యతిరేకతకు దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కావడి మార్గంలోని హెూటళ్లలో లైసెన్సులను ప్రదర్శించాల్సిందే



**న్యూఢిల్లీ-నవభూమి:** కావడి యాత్ర సాగే మార్గంలో ఉన్న హెూటళ్లు, ఫలహారశాలల్లో లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను ప్రదర్శించాలని మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. హెూటళ్ల వద్ద అన్ని వివరాలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను పెట్టాలంటూ యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. కావడియాత్రకు మంగళవారమే చివరి రోజు కావడంతో ఈ సమయంలో ఇంతకుమించి జోక్యం చేసుకోబోమని ధర్మాసనం తెలిపింది.

## తమిళనాడు, కేరళకు కేంద్రం గుండు సున్నా



**న్యూఢిల్లీ-నవభూమి:** సమగ్ర శిక్ష అభియాన్ ఎస్ఎస్ఏ , పీఎం శ్రీ పథకాల కింద 2024-25లో తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ఎలాంటి నిధులు.. ఇవ్వలేదని కేంద్ర విద్యా శాఖ పేర్కొంది. 2023-24లో ఎస్ఎస్ఏ కింద తమిళనాడుకు రూ.1876.16 కోట్లు, కేరళకు రూ.141.66 కోట్లు ఇచ్చినట్టు వెల్లడించింది. అయితే, జాతీయ విద్యా విధానం-2020 అమలు కోసం రూపొందించిన పీఎం-శ్రీ పథకంలో భాగస్వామ్యం అయ్యేందుకు నిరాకరించడంతో ఆ రాష్ట్రాలకు నిధులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జులై 21న పార్లమెంటుకు లిఖిత పూర్వక వివరణ ఇచ్చింది. మరోపక్క, 2024-25లో ఎస్ఎసఏ కింద ఉత్తరప్రదేశ్‌కు రూ.6,264.79 కోట్లు, పీఎం-శ్రీ కింద రూ.246.86 కోట్లు అందాయి. అలాగే, మధ్యప్రదేశ్‌కు ఎస్-ఎసఏ కింద రూ.3,434.71 కోట్లు, పీఎం-శ్రీ కింద రూ.145.32 కోట్లు అందాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతోందన్న విమర్శలు అధికమయ్యాయి. అయితే, పీఎం- శ్రీ పాఠశాలల్లో జాతీయ విద్యా విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కేంద్రం చెబుతోంది. కానీ, జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు, కేరళలు ఎప్పట్నించో వ్యతిరేకిస్తున్నాయి.

## ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డుగుర్తింపు కోసమే..

**న్యూఢిల్లీ-నవభూమి:** ఆధార్, ఓటర్ ఐడీ కార్డు, రేషన్ కార్డు కేవలం గుర్తింపు కోసమేనని ఎన్నికల కమిషన్(ఈసీఐ) స్పష్టం చేసింది. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(ఎసఐఆర్)పై సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యానికి సమాధానంగా ఈసీఐ మంగళవారం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల జాబితా శుద్ధీకరణ జరుగుతోందని.. దీనివల్ల అర్హత లేని వ్యక్తులను జాబితా నుంచి తొలగించడం సాధ్యమవుతుందని ఆ అఫిడవిట్‌లో వివరించింది. ఈ చర్యతో భారత రాజ్యాంగంలోని 19వ అధికరణకు భంగం కలుగుతుందనే పిటిషనర్ల వాదనలను ఖండిస్తూ.. ఎన్నికల ప్రక్రియను నిర్దేశించే ప్రకరణలు, చట్టాలను గురించి వివరించింది. ఈ క్రమంలోనే ఆధార్, ఓటర్‌ఐడీ, రేషన్ కార్డులను కేవలం గుర్తింపు ప్రయోజనాలకే పరిమితంగా వాడుతున్నట్లు తెలిపింది. "ఆధార్ అనేది పౌరసత్వానికి లేదా నివాస ధ్రువీకరణకు ఆధారం కాదు. ఈ విషయాన్ని ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 స్పష్టం చేస్తోంది" అని ఈసీ తన అఫిడవిట్‌లో గుర్తుచేసింది.

**52 లక్షల మంది పేర్లు తొలగింపు**

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణలో 52 లక్షల మంది పేర్లను తొలగించినట్లు ఈసీ ప్రకటించింది. ఇందులో 18 లక్షల మంది మరణించినట్లు గుర్తించామని, మరో 26 లక్షల మంది ఇత ర నియోజకవర్గాలకు మారారని వివరించింది. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉన్న 7 లక్షల మంది ని తొలగించి, ఒకేచోట అవకాశం కల్పించినట్లు తెలిపింది. మరో 21.36 లక్షల మంది ఆచూకీ తెలియరావడం లేదని, వారిని వెల్లడించింది.

## భారత్‌పై జల ఖడ్గం!

**న్యూఢిల్లీ-నవభూమి:** బ్రహ్మపుత్ర నదిపై చైనా చేపట్టిన భారీ డ్యామ్.. భారత్‌కు ఎన్నో విధాలుగా నష్టానికి దారిస్తుందనే చర్చ జరుగుతోంది. చైనాతో ఉన్న సరిహద్దుల వివాదం కంటే కూడా ఈ డ్యామ్ తీవ్ర సమస్యగా మారుతుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. బ్రహ్మపుత్ర నదిపై అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలోని న్యింగ్చి ప్రాంతంలో ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ నిర్మాణ పనులను చైనా ప్రధాన మంత్రి లీ కియాంగ్ ఈ నెల 19న ప్రారంభించారు. సుమారు రూ.14.5 లక్షల కోట్లు (167.8 బిలియన్ డాలర్లు) వ్యయంతో చేపట్టిన ఈ డ్యామ్.. ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు కూడా. ఈ క్రమంలో నీటి నిల్వ అత్యంత భారీ స్థాయిలో ఉంటుంది. అయితే ఈ డ్యామ్‌తో నదిలో నీటి ప్రవాహం తగ్గే అవకాశం తక్కువేనని, కానీ చైనా ఎప్పుడైనా కావాలని ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే.. దిగువన పరీవాహక ప్రాంతాల్లో భారీ వరదలు వచ్చి నీట మునుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# భారత్ అభివృద్ధివైపు పరిగెడుతుంటే.. పాక్ అప్పులు అడుక్కుంటోంది..: ఐరాసలో పర్వతనేని హరీష్



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ వ్యాప్తంగా శాంతి, భద్రతలను ప్రోత్సహించడంపై చర్చించేందుకు పాకిస్థాన్ అధ్యక్షతన జరిగిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో దాయాది దేశం భారత్‌పై తీవ్ర విమర్శలు చేసింది. ఈక్రమంలోనే ఇండియా కూడా గట్టిగా బదులిచ్చింది. మరోసారి పాక్ నోరు పరువు తీసేలా మాట్లాడారు. ఈ సమావేశానికి పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ అధ్యక్షత వహించగా.. ఆయన జమ్మూ కాశ్మీర్, సింధు నదీ జలాల ఒప్పందం వంటి అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నించారు. దీనికి భారత్ దీటుగా బదులిచ్చింది. మెదపకుండా చేసింది. ముఖ్యంగా సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశాలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని భారత్ పరోక్షంగా పాకిస్థాన్‌ను హెచ్చరించింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీష్ మాట్లాడుతూ.. భారత్ అభివృద్ధి వైపు పరుగులు పెడుతుంటే.. పాకిస్థాన్ మాత్రం మతోన్మాదం, ఉగ్రవాదంలో పూర్తిగా కూరుకుపోయిందని చెప్పారు. అలాగే ఆ దేశం అప్పులు తీసుకోవడంలోనే చాలా బిజీగా ఉందని ఒకవైపు భారత్ ప్రజాస్వామ్య, ఆర్థిక పురోగతిని సాధిస్తుంటే... మరోవైపు పాకిస్థాన్ మతోన్మాదం , ఉగ్రవాద సమస్యలతో సతమతమవుతోందని హరీష్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ దాడికి పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న ఒక ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించిందని, ఆ తర్వాత భారత్ "ఆపరేషన్ సిందూర్" ద్వారా ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని ప్రతీకారం తీర్చుకుందని హరీష్ వివరించారు.సమకాలీన ప్రపంచంలో సంఘర్షణల స్వభావం మారుతోందని, వాటిని పరిష్కరించడంలో జాతీయ యాజమాన్యం ఎంత కీలకమో హరీష్ నొక్కి చెప్పారు. ఉగ్రవాదం అనేది కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన సమస్య కాదని, అది ప్రపంచ శాంతికి ముప్పు అని ఆయన పునరుద్ఘాటించారు. దేశాలు తమ సరిహద్దుల నుండి ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించకుండా, నిరోధించడానికి కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఐరాస భద్రతా మండలిలో అత్యవసరంగా సంస్కరణలు తీసుకు రావాల్సిన ఆవశ్యకతను కూడా హరీష్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ప్రస్తుత భద్రతా మండలి ప్రపంచంలోని వాస్తవాలను ప్రతిబింబించడం లేదని, మరింత విస్తృతమైన, ప్రాతినిధ్యం వహించే సంస్థగా అది మారాలని సూచించారు.మరోవైపు భారత్-పాక్ ఉద్రిక్తతల అంశాన్ని అమెరికా ప్రస్తావించింది. ఆ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని పరిష్కరించడంలో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని ఐరాసలో వాషింగ్టన్ రాయబారి వ్యాఖ్యానించారు. దీనిపై కూడా పర్వతనేని హరీష్ స్పందించారు. పాకిస్థాన్ పీఓకేలోని ఉగ్ర శిబిరాలను ల్యంగా చేసుకునే భారత్ ఆపరేషని సిందూర్ చేపట్టిందని గుర్తు చేశారు. తమ ప్రాథమిక లక్ష్యాలను చేరుకున్న తర్వాత పాక్ అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని అంగీకరించామన్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే అమెరికాకు చెప్పామని.. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వం లేదని మరోసారి తేల్చి చెప్పారు.



## వర్షాకాలంలో మొక్కలు పదిలంగా

మనం ఇంటి చుట్టూ, బాల్కనీలో, మేడపైన రకరకాల మొక్కలు పెంచుకుంటూ ఉంటాం. పెద్ద పెద్ద చినుకులు పడినా, గాలి బలంగా వీచినా ఈ మొక్కలకు నష్టం కలుగవచ్చు. కాబట్టి వర్షాకాలంలో మొక్కల సంరక్షణకు సంబంధించి తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

నిరంతరం కురిసే వర్షాల వల్ల ఒక్కోసారి కాండం, ఆకులు, పువ్వులు కుళ్లిపోవడాన్ని చూస్తూ ఉంటాం. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలి. లేదంటే క్రిమికీటకాలు చేరి మొక్కను బలహీనపరుస్తాయి.

గాలి బలంగా వీస్తే మొక్కలు, వాటి కొమ్మలు వంగిపోతుంటాయి. అలాకాకుండా మొక్కలకు సమీపంలో పొడవైన కర్ర లేదా చెక్కను ఆధారంగా నిలబెట్టాలి. సన్నని దారంతో దానికి మొక్కను జతచేయాలి.

వర్షాకాలంలో తరచూ మొక్కలకు నీళ్లు పోయాల్సిన అవసరం ఉండదు. కుండీల్లో అయితే నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కుండీ అడుగున ఉండే రంధ్రం మూసుకుపోకుండా చూడాలి.

ఇంటి చుట్టూ, మేడ మీద తోట పెంచుతున్నట్లయితే మొక్కల మొదళ్లలో నీరు నిలవకుండా చూసుకోవాలి. వర్షపు నీరు ఎక్కడా ఆగకుండా ప్రవహించేలా ఏర్పాటు చేసుకోవాలి.

వర్షాలు కురవగానే మొక్కలకు చిగుర్లు వస్తుంటాయి. ఈ సమయంలో పండ్లు, కాయగూరల నుంచి వచ్చే వ్యర్థాలతో సేంద్రీయ ఎరువు తయారు చేసి మొక్కలకు అందించాలి. వాడేసిన కాఫీ, టీ పొడులను ఒకసారి మంచినీళ్లతో కడిగి మట్టిలో కలపవచ్చు. ఇలా చేయడం వల్ల మొక్క ఏపుగా పెరుగుతుంది.



# ఆమెకు పుస్తకాలే పిల్లలు






**ప్రొఫెసర్‌గా తరగతి గదిలో పాఠాలే కాదు... చక్కని రచనలతో గ్రంథకర్తగానూ పేరు గడించారు. పుస్తకాలే తన పిల్లలుగా... సాహిత్యమే తన లోకంగా జీవిస్తున్న డాక్టర్ కవితా భట్ కథ ఇది.**

"జీవితం ఎప్పుడూ మనం అనుకున్నట్టు సాగదు. ఎత్తుపల్లాలు... ఆటుపోట్లు... అన్నిటినీ తట్టుకొని ముందుకు సాగితేనే అనుకున్నది సాధించగలం. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. ఉత్తరాఖండ్ తెహ్రీ గఢవాల్ జిల్లాలోని బౌన్సారా గ్రామం మాది. మా నాన్న బంకేలాల్ రతూరీ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేసేవారు. ఆయన జీతంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉండేది. ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ పరిస్థితులూ అంతంతమాత్రమే. సంతానంలో నేనే పెద్ద. మా కోసం నాన్న పడుతున్న ఆవేదన, ఆందోళన నాకు అర్థమయ్యేది. నేనూ ఆయన కష్టాన్ని పంచుకోగలిగితే బాగుండని చిన్నప్పుడు ఎన్నో సందర్భాల్లో అనుకునేదాన్ని. వీటి నుంచి గట్టెక్కాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించాను. బీఎస్సీ పూర్తయిన తరువాత ఫిలాసఫీ, యోగా, ఇంగ్లీష్, సోషల్‌వర్క్ సబ్జెక్టుల్లో మొత్తం నాలుగు మాస్టర్స్ డిగ్రీలు సాధించాను. లక్ష్యం వైపు పయనించాలంటే బలమైన పునాదులు ఉండాలి కదా. అందుకే ఇవన్నీ చదివాను. అంతేకాదు... సామాజిక అంశాలపై మరింత లోతైన అవగాహన కోసం ఉమెన్ ఎంపవర్‌మెంట్ తదితర డిప్లమో కోర్సులతోపాటు పీహెచ్‌డీ కూడా చేశాను.

**కఠిన పరీక్షలకు నిలిచి...**

ఫిలాసఫీ, యోగా సబ్జెక్టుల్లో యూజీసీ-నెట్ పరీక్ష రాస్తే, అందులో అర్హత సాధించాను. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసఫికల్ రీసెర్చ్' నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, జనరల్ రీసెర్చ్ ఫెలోషిప్. దాంతోపాటు యూజీసీ నుంచి పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ అందుకున్నాను. మా కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో... వేరొకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగిన ఒక మహిళగా నాలాంటివారికి ఆదర్శంగా నిలవాలనుకున్నాను. అందుకే ఎన్ని కఠిన పరీక్షలు ఎదురైనా తట్టుకొని చదువు కొనసాగించాను. ఆత్మస్థైర్యంతో అడుగులు వేసి ఇక్కడి వరకు రాగలిగాను. ప్రస్తుతం ఉత్తరాఖండ్ 'హేమవతీ నందన్ బహుగుణ గఢవాల్ సెంట్రల్ యూనివర్సిటీ' ఫిలాసఫీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా.

**ఎన్నో రచనలు...**

ఒక పక్క విద్యా బోధన... మరోవైపు పుస్తక రచన చేస్తున్నా. సాహిత్య ప్రపంచంలో నాకంటూ కొన్ని పేజీలు ఉండాలనే తపన. ఇప్పటికి 27 పుస్తకాలు రాశాను. యోగిక్ స్టడీస్, సత్కర్మాస్, భారతీయ సాహిత్యం తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందులో ఉన్నాయి. అయితే నాకు బాగా పేరు తెచ్చిన రచనలు 'గీతా దర్శన్', 'భారతీయ సాహిత్య మే జీవన్ మూల్య'. వీటికి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి పురస్కారాలు, సత్కారాలు అందుకున్నాను. యూపీలోని 'పటేల్ ప్రతినిధి సభ' వారు 'శైల్‌పుత్రి' బిరుదుతో గౌరవించారు. 2019లో మధ్యప్రదేశ్ సాహిత్య అకాడమీ 'అఖిల్ భారతీయ ఆచార్య రామచంద్ర శుక్లా' పురస్కారంతో కలిపి ఇప్పటికి ముప్పైకి పైగా అవార్డులు అందుకున్నాను. ఇవి సాహిత్యం, సంస్కృతికి అందించిన సేవలకు నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

**అక్షరంపై ప్రేమతో...**

కొన్ని కారణాల వల్ల నేను తల్లిని కాలేకపోయాను. మాతృత్వపు మాధుర్యానికి నోచుకోనందుకు కొన్నాళ్లు బాధపడ్డాను. కానీ త్వరగానే దాని నుంచి కోలుకున్నాను. సాహిత్య లోకంలో విహరించడం ప్రారంభించాను. ఇప్పుడు నాకు పిల్లలు లేరన్న బాధ లేదు. ఎందుకంటే నా పుస్తకాలే నా పిల్లలు. నవ మాసాలు మోసి, బిడ్డను ప్రసవించడానికి ఎంత వేదన పడుతుందో... ఒక అంశాన్ని ఎంచుకొని, దానికి అక్షర రూపం ఇచ్చి, పుస్తకంగా బయటకు తేవడానికి నేనూ అంతగా శ్రమిస్తాను. రచనలో మునిగిపోతాను. అంతే ప్రేమతో ప్రతి పుస్తకానికీ రూపం ఇస్తాను. ఎవరైనా నా రచనలను ప్రశంసిస్తే... అది నా బిడ్డకు దక్కిన అభినందన. ఒక తల్లిగా సంతోషిస్తాను.

**సమాజం కోసం...**

బోధన, సాహిత్యంలో ఎంతగా మునిగినా... ఈ సమాజంలో ఒక వ్యక్తిగా నావంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వారానికి రెండు రోజులు దీనికి కేటాయించాను. అలాగే అణగారిన వర్గాల పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నాను. మధ్యలో చదువు మానేసిన చిన్నారులను బడి బాట పట్టించేందుకు కృషి చేస్తున్నాను. ఎందుకంటే వారి జీవితాలను మార్చగలిగేది చదువు మాత్రమే. దానికి నన్నే ప్రత్యక్ష ఉదాహరణగా చూపిస్తూ, వారిలో స్ఫూర్తి నింపుతున్నాను."

## కనికట్టు చేసే కాంత



ప్పటికప్పుడు సరికొత్త చీరలు పుట్టుకొస్తూనే ఉంటాయి, మహిళల మనసులను దోచుకుంటూనే ఉంటాయి. అలాంటివే 'కాంత' చీరలు. దారపు కుట్టుతో కనికట్టు చేస్తున్న ఈ చీరల మీద ఓ లుక్కేద్దాం!

కాంత అనే బెంగాలీ పదానికి... 'పాత వస్త్రం' అని అర్థం. పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లోని మహిళలు కొన్ని వందల ఏళ్లుగా వాడేసిన పాత చీరలతో కాంత క్విల్ట్‌లు, పరుపు, దిండ్ల కవర్లు, అలంకరణ వస్త్రాలు తయారుచేస్తున్నారు. ఈ ఎంబ్రాయిడరీల్లో సరళమైన పూల మోటిఫ్స్ మొదలు అతి పెద్ద సన్నివేశాల వరకూ ఉంటాయి. అయితే వెనకున్న వస్త్రపు రంగుతో సరిపోలేలా, క్విల్టింగ్ తరహా కుట్టు వేయడం ఈ కాంత పనితనం ప్రత్యేకత. ఇదే పనితనంతో తయారవుతున్న కాంత చీరలు ప్రస్తుతం ట్రెండ్‌గా మారాయి. వాటినెలా సింగారించాలో తెలుసుకుందాం!

కాటన్, సిల్క్, మస్లిన్ వస్త్రాల కాంత చీరలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సిల్క్, మస్లిన్ కాంత చీరలు వేడుకలకు ఎంతో బాగా నప్పుతాయి. కాటన్ కాంత చీరలు డైలీవేర్‌గా బాగుంటాయి.

ఈ చీరలు ఒకింత చికన్‌కారీ పనితనాన్ని తలపించేలా ఉంటాయి. కానీ కాంతలో జానపద కథలు, రోజువారీ జీవనవిధానాలు ఎంబ్రాయిడరీ రూపంలో ఆకట్టుకుంటూ ఉంటే, చికన్‌కారీలో కేవలం పువ్వులు, లతలే మనకు కనిపిస్తాయి. కాబట్టి రొటీన్‌కు భిన్నంగా కనిపించాలనుకుంటే కాంత చీరలే ఎంచుకోవాలి.

టెర్రకోట ఆభరణాలు, జర్మన్ సిల్వర్ ఆభరణాలు కాంత చీరలకు ఎంతో బాగా సూటవుతాయి.

## గాజుతో అందంగా



గాజుతో రూపొందించిన టీపాయ్, డైనింగ్ టేబుల్, ల్యాప్‌టాప్ టేబుల్ లాంటివి ఇంటికి అదనపు అందాన్నిస్తాయి. పారదర్శకంగా ఉండే గాజు కాకుండా రకరకాల రంగుల్లో లభ్యమయ్యే టఫెండ్ గ్లాస్‌తో తయారుచేసినవాటిని ఎంపిక చేసుకుంటే ఇంటికి రిచ్ లుక్ వస్తుంది. పూలు, రకరకాల బొమ్మలు ప్రింట్ చేసి ఉన్న గాజు మెటీరియల్స్ కూడా లభ్యమవుతున్నాయి. వీటిని తెచ్చి టేబుల్ లేదా టీపాయ్ ఉపరితలం మీద అమర్చుకుంటే ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

ఇంట్లో పెద్దగా ఉన్న హాల్‌ని అందంగా విభజించడం అనేది నేటి ఇంటీరియర్ ట్రెండ్. చెక్కతో తయారుచేసిన హాల్ డివైడర్స్‌ని మనం చూసే ఉంటాం. దీనికి బదులు గాజు పార్టిషన్స్‌ను ఎంపిక చేసుకుంటే ఇల్లు ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చుట్టూరా చెక్క ఫ్రేమ్ ఉన్నప్పటికీ మధ్యలో గాజు మెటీరియల్‌ను అమర్చుకుంటే ప్రత్యేకంగా ఉంటుంది. ప్రింటెడ్, స్టెయిన్డ్, ఫ్రోస్టెడ్ గాజు రకాలు ఈ తరహా పార్టిషన్స్‌కు బాగుంటాయి.

వంటగది, పడక గది, పిల్లలు చదువుకునే గదుల్లో కొన్ని అరలకు గాజు తలుపులు బిగించుకుంటే సౌకర్యవంతంగా ఉంటుంది. అంతేకాదు ఆ అరల్లో అలంకరణ వస్తువులు, బొమ్మలు, ఫొటోలు లాంటివి సర్దుకుంటే అవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. గదులు కూడా విశాలంగా మెరుస్తుంటాయి.

కిటికీలకు ఫ్రోస్టెడ్ గాజు తలుపులు అమర్చుకోవచ్చు. వీటి మీద రకరకాల డిజైన్లు ప్రింట్ చేసి ఉంటాయి. వీటివల్ల ఇంట్లోని వస్తువులు బయటికి కనిపించవు. ఇల్లు కూడా అహ్లాదకరంగా ఉంటుంది.

సాధారణంగా మనం ఫాల్స్ సీలింగ్ కోసం చెక్క, పీఓసీ, జిప్సం లాంటి మెటీరియల్స్ వాడుతూ ఉంటాం. వీటికి బదులు గాజు సీలింగ్‌ని వినియోగిస్తే ఇల్లు గ్రాండ్‌గా కనిపిస్తుంది. పూర్తిగా కాకపోయినా ఒక లేయర్‌ను ఇలా ప్రింటెడ్ గాజుతో అమరిస్తే బాగుంటుంది. మధ్యమధ్యలో అందమైన లైటింగ్స్ పెట్టించుకుంటే ఇంటికి రిచ్ లుక్ వస్తుంది.

## చికెన్ ఘీ రోస్ట్



**కావల్సినవి**: చికెన్ - ముప్పావు కేజీ, గిలకొట్టిన పెరుగు - ముప్పావు కప్పు, కారం - చెంచా, పసుపు - అరచెంచా, నిమ్మరసం - పెద్ద చెంచా, అల్లంవెల్లుల్లి ముద్ద - ఒకటిన్నర చెంచా, ఉప్పు - తగినంత.

మసాలాకోసం: ఎండుమిర్చి - ఆరు, మిరియాలు - అరచెంచా, మెంతులు - పావుచెంచా లవంగాలు - నాలుగు, జీలకర్ర, సోంపు - పావుచెంచా చొప్పున, ధనియాల పొడి - మూడు చెంచాలు, వెల్లుల్లి తరుగు - నాలుగు చెంచాలు, చింతపండు - ఉసిరికాయంత (వేడినీటిలో నానబెట్టుకోవాలి), బెల్లం తరుగు - రెండు చెంచాలు, నెయ్యి - అరకప్పు, ఉప్పు - తగినంత.

**తయారీ:** చికెన్ ముక్కల్ని శుభ్రం చేసి.. ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులో పెరుగూ, కారం, పసుపూ, నిమ్మరసం, అల్లంవెల్లుల్లి ముద్దా, తగినంత ఉప్పు వేసి బాగా కలిపి ఫ్రిజ్‌లో పెట్టేయాలి. ఇంతలో బాణలిని పొయ్యిమీద పెట్టి.. రెండు చెంచాల నెయ్యి వేయాలి. అది కరిగాక చింతపండూ, బెల్లం తరుగూ, ఉప్పూ తప్ప మసాలా కోసం పెట్టుకున్న పదార్థాలన్నింటినీ వేసి వేయించి తీసుకోవాలి. వేడి చల్లారాక నీళ్లు చల్లుకుంటూ ముద్దలా చేసుకోవాలి. బాణలిని మళ్లీ పొయ్యిమీద పెట్టి.. పెద్ద చెంచా నెయ్యి వేయాలి. అది కరిగాక చికెన్ ముక్కలు వేసి మూత పెట్టాలి. చికెన్ ఉడికిందనుకున్నాక ఇవతలకు తీసేయాలి. అదే బాణలిలో మిగిలిన నెయ్యి వేసి ముందుగా చేసుకున్న మసాలా వేయాలి. దాని పచ్చివాసన పోయాక.. బెల్లం తరుగూ, కొద్దిగా చింతపండురసం, కొంచెం ఉప్పూ, చికెన్ ముక్కలూ వేసి.. బాగా కలపాలి. ఐదారు నిమిషాలయ్యాక దింపేస్తే చాలు.

# జలుబుకు ఏ సూప్ మంచిదంటే!



వాతావరణంలో మార్పులు మన శరీరం మీద ప్రభావం చూపుతాయి. అవి, జలుబు, ఒళ్ళు నొప్పులతో కూడిన జ్వరం, దగ్గు రూపంలో బాధిస్తాయి. ఈ సమస్యల నుంచి ఉపశమనానికి, రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ఇంట్లోనే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, జ్వరం, దగ్గు సమస్యల ఉపశమనానికి...

చికెన్ సూప్: ఉల్లికాడలు, ఉల్లిపాయలు, మిరియాల పొడి కలిపి తయారుచేసుకున్న చికెన్ సూప్ జలుబు, జ్వరం, దగ్గు వంటి సమస్యలకు త్వరగా ఉపశమనం ఇస్తుంది.

మష్రూమ్/పాల కూర సూప్: శాకాహారులు పుట్టగొడుగులు, పాలకూరలతో సూప్‌లను తయారుచేసుకోవచ్చు. దీంట్లోనూ ఉల్లికాడలు, మిరియాలు, వెల్లుల్లి, జిలకర్ర కలిపి తయారుచేసుకొని సేవించాలి.

సూప్‌లు ఏ సమయంలోనైనా వేడి వేడిగా తీసుకుంటే రుచిగానూ ఉంటాయి. అనారోగ్యసమస్యల నుంచి సత్వర ఉపశమనం లభిస్తుంది.

**వ్యాధి నిరోధక శక్తి పెరగాలంటే...**

రోజూ ఉదయం అల్పాహారంతో పాటు ఒక గ్లాసు ఆరెంజ్ జ్యూస్ తీసుకోవాలి. దీంట్లో ఉండే 'సి' విటమిన్, యాంటీయాక్సిడెంట్లు రోగనిరోధకశక్తిని పెంచుతాయి.

ఈ సీజన్‌లో నీటి కాలుష్యం ఎక్కువ. వడకట్టడం, మరిగించి చల్లార్చిన నీళ్లు తాగడం వంటి జాగ్రత్తలు తీసుకోకపోతే విరేచనాలు అవుతుంటాయి. ఈ సమస్య దరిచేరకుండా ఉండాలంటే పెరుగు, మజ్జిగ వంటి ద్రవాలు తీసుకుంటూ ఉండాలి.

వారానికి ఒకరోజు లేదా 15 రోజులకొకసారి ఉపవాసం ఉండాలి. అంటే పూర్తిగా ఆహారం తీసుకోకుండా కాదు. ఆ రోజు మొత్తం కూరగాయలు, పండ్లు, పళ్ల రసాలు, నీళ్ల మీదే ఉండాలి. వేరే ఇతర ఆహార పదార్థాలేవీ తీసుకోకూడదు. దీని వల్ల శరీరంలో మలినాలు తొలగి, జీర్ణవ్యవస్థ పనితీరు చురుకు అవుతుంది. శరీరానికి అవసరమయ్యే మంచి బ్యాక్టీరియా శాతం పెరిగి అనారోగ్యసమస్యలు దరిచేరవు.

ఆరెంజ్ జ్యూస్, దానిమ్మ జ్యూస్‌లు ఈ కాలం చాలా మంచివి.

ఈ కాలం మూత్రవ్యవస్థకు సంబంధించిన సమస్యలు, ఇన్ఫెక్షన్లు అధికంగా వస్తుంటాయి. అలాగే - ఊపిరితిత్తులు, ముక్కుకు సంబంధించినవి, మలబద్ధకం సమస్యలకు అవకాశాలు ఎక్కువ. రోజులో 2-3 లీటర్లు శుభ్రమైన నీళ్లు సేవిస్తే యూరిన్ ఇన్ఫెక్షన్ల సమస్య ఉండదు. పీచు పదార్థాలు ఎక్కువ ఉండే పదార్థాలు తినడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే విరేచనం సాఫీగా అవుతుంది.

కాయగూరల్లో బీట్‌రూట్, క్యారెట్ వంటి సూప్‌లను ఎర్రకందిపప్పును ఉపయోగించి తయారుచేసుకోవాలి. ఇది సలాడ్‌లా తయారుచేసుకొని భోజనంలా కూడా తినవచ్చు. టొమాటో రసం, టొమాటో పప్పు.. టొమాటోతో కూడిన వంటకాలు ఎక్కువ తీసుకుంటే ఆరోగ్యకరం.

జీర్ణకోశం నుంచే రోగనిరోధక కణాలు పుడుతూ ఉంటాయి. అందుకని జీర్ణకోశాన్ని ఎంత జాగ్రత్తగా ఉంచుకుంటే ఈ కాలం అంత ఆరోగ్యంగా ఉంటాం అనే విషయాన్ని విస్మరించకూడదు.

## క్యాన్సర్లను తరిమికొట్టే దానిమ్మ!



దానిమ్మ పండును క్రమం తప్పకుండా తినడం అంటే క్యాన్సర్‌ను దూరంగా తరిమికొట్టడమే. దానిమ్మలో ఉండే ప్యూనికలాజిన్ అనే అత్యంత శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఇందుకు కారణం. దానిమ్మలో విటమిన్ కె విటమిన్ బి5లతో పాటు విటమిన్ సి ఎక్కువ. ఫలితంగా దీన్ని తినడం వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, కోలన్ క్యాన్సర్, లుకేమియా వంటి అనేక క్యాన్సర్లు నివారితమవుతాయి. క్యాన్సర్ నివారణ మాత్రమే కాకుండా దానిమ్మతో ఇంకా అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వాటిల్లో ఇవి కొన్ని...

?దానిమ్మలో ఫ్లేవనాయిడ్స్, పాలీఫీనోల్స్, అనేక యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్నాయి. ఇవన్నీ మనకు శక్తిమంతమైన రోగనిరోధక శక్తిని సమకూరుస్తాయి.

?దానిమ్మలో పీచుపదార్థం సమృద్ధిగా ఉంటుంది. అది జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మలబద్ధకం వంటి సమస్యలను దరిచేరనివ్వదు.

?డయాబెటిస్ రోగులకు ఎన్నో పండ్ల మీద ఆంక్షలుంటాయిగానీ.. దానిమ్మ విషయానికి వస్తే డయాబెటిస్ రోగులు దానిమ్మ తినాలంటూ డాక్టర్లే సూచిస్తారు.

?బరువు తగ్గించుకోవాలనుకున్నవారికి దానిమ్మ మంచి పండు. అది కొవ్వులను అదుపులో ఉంచి బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది.

?కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుతుంది. రక్తప్రసరణను మెరుగుపరచడం ద్వారా ఇది ఇస్కిమిక్ కరోనరీ హార్ట్ డిసీజ్ వంటి గుండెజబ్బులను నివారిస్తుంది. గుండె సంబంధ సమస్యలతో బాధపడుతున్న వాళ్లు రోజూ ఒక గ్లాసు దానిమ్మరసం తీసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి.

-ఇది అధిక రక్తపోటు, అర్థరైటిస్, కీళ్లనొప్పులు, గుండెజబ్బులను నివారిస్తుంది.

-దానిమ్మ వల్ల చర్మానికి మంచి నిగారింపు వస్తుంది. చర్మకణాల ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. వయసు పెరిగేకొద్దీ కనపడే ముడతలు, మచ్చలు, గీతలను నివారిస్తుంది. అందుకే దానిమ్మపండు తినేవారు దీర్ఘకాలం యౌవనంతో కనిపిస్తారు.

-వాపు, మంట, ఎర్రబారడం వంటి ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలను త్వరగా తగ్గిస్తుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్
గురువారం
24। జులై। 2025







## అమెరికా-జపాన్ ట్రేడ్ డీల్ ఫిక్స్.. లాభాల్లో మార్కెట్లు..

**ముంబై-నవభూమి:** జపాన్‌తో ట్రేడ్ డీల్ ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడంతో ఆసియా-పసిఫిక్ మార్కెట్లు లాభాల బాటలో సాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కూడా దేశీయ సూచీలపై పాజిటివ్ ప్రభావం చూపిస్తున్నాయి. మంగళవారం ఒడిదుడుకులు ఎదుర్కొన్నా సూచీలు బుధవారం స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి.మంగళవారం ముగింపు (82, 186)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు మూడు వందల పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాస్త కిందకు దిగి వచ్చింది. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 156 పాయింట్ల లాభంతో 82, 343 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 44 పాయింట్ల లాభంతో 25, 105 వద్ద కొనసాగుతోంది. ఇటీవల ప్రకటించిన లాభాల కారణంగా ఎటర్నల్ షేర్లు మంగళవారం ఆల్ టైమ్ హైకి చేరుకున్నాయి.సెన్సెక్స్‌లో డిక్సన్ టెక్నాలజీస్, ఐఆర్ఎఫ్‌సీ, టాటా మోటార్స్, ఎల్‌టీ ఫైనాన్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు లాభాల్లో ఉన్నాయి. లోథా డెవలపర్స్, ఒబెరాయ్ రియాల్టీ, కోల్గేట్, ప్రెస్టీజ్ ఎస్టేట్, ఎమ్ అండ్ ఎమ్ ఫైనాన్సియల్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 176 పాయింట్ల నష్టంతో ఉంది.

## యువతకు నైపుణ్య శిక్షణకు స్టాండర్డ్ చార్టర్డ్-సంభవ్ ఫౌండేషన్ భాగస్వామ్యం

**న్యూఢిల్లీ-నవభూమి:**23 జూలై 2025, భారతదేశం - ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా, స్టాండర్డ్ చార్టర్డ్ తన ప్రధాన కమ్యూనిటీ కార్యక్రమమైన 'ఫ్యూచర్ మేకర్స్' కింద ఒక కీలక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. అభివృద్ధి చెందుతున్న రంగాలలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందించేందుకు, బ్యాంక్ సంభవ్ ఫౌండేషన్‌తో కలిసి 5,160 మంది యువ భారతీయులను ఎలక్ట్రిక్ వెహికల్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ వంటి భవిష్యత్‌కు అనుగుణమైన పరిశ్రమలలో శిక్షణ ఇచ్చి, రేపటి ఉద్యోగాలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.ఇప్పుడే ప్రారంభమైన ఈ మూడేళ్ల ప్రాజెక్ట్ నోయిడా, ముంబై, పూణే, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ మరియు టిన్సుకియా (డూమ్ డూమా, అస్సాం) వంటి నగరాల్లో అమలవుతోంది. ఇందులో స్థిరమైన మరియు అధిక డిమాండ్ ఉన్న కెరీర్ అవకాశాల కోసం యువతను సిద్ధం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించారు. పాల్గొనేవారికి ఉద్యోగ నియామక మద్దతును కూడా ఈ కార్యక్రమం అందించనుంది, తద్వారా వారు ఈ అభివృద్ధి చెందుతున్న రంగాలలో సజావుగా స్థిరమైన మరియు అర్థవంతమైన ఉపాధిని పొందగలగడం సాధ్యమవుతుంది.

# ఉద్యోగం చేస్తే టాటా కంపెనీలోనే చేయాలి.. ఆ తర్వాతే గూగుల్, ఇన్ఫోసిస్!




**న్యూఢిల్లీ-నవభూమి:**ఉద్యోగం అంటే టాటా గ్రూప్ కంపెనీల్లోనే చేయాలంటున్నారు భారతీయ ఉద్యోగార్థులు. ఉద్యోగం చేసేందుకు ఏ కంపెనీ బెస్ట్ అంటే టాటాలకే జై కొట్టారు. దేశంలో అత్యంత ఆకర్షణీయ సంస్థగా టాటా గ్రూప్ నిలిచింది. దిగ్గజ కంపెనీలను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతే ప్రముఖ టెక్ కంపెనీలు గూగుల్ ఇండియా ఇన్ఫోసిస్ ఉన్నాయి. టాప్ 3 కంపెనీలుగా ఈ మూడు సంస్థలు ఉన్నాయి. ఈ మేరకు ర్యాండ్‌స్టాడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ 2025 పేరుతో హెచ్‌ఆర్ సర్వీసెస్ సంస్థ ర్యాండ్‌స్టాడ్ ఇండియా ఓ నివేదిక విడుదల చేసింది. వర్క్ లైఫ్ బ్యాలెన్స్, ఆకర్షణీయ వేతనాలు, సమానత్వం, ఇతర ప్రయోజనాల వంటి అంశాలను ఉద్యోగార్థులు పరిగణనలోకి తీసుకుంటున్నట్లు నివేదిక తెలిపింది.కంపెనీ ఆర్థిక పరిపుష్టత, కెరీర్ వృద్ధి అవకాశాలు, కంపెనీ పరపతి వంటి మూడు అంశాల్లోనూ టాటా గ్రూప్ అగ్రస్థానంలో నిలిచినట్లు ర్యాండ్‌స్టాడ్ నివేదిక తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 34 దేశాల్లో 1,70,000 మంది నుంచి సేకరించిన అభిప్రాయల ప్రకారం ఈ నివేదిక రూపొందించినట్లు ర్యాండ్‌స్టాడ్ సంస్థ తెలిపింది. ఇందులో 3,500 మంది భారత్ నుంచి పాల్గొన్నట్లు తెలిపింది. కంపెనీని ఎంచుకోవడంలో ఉద్యోగులు ప్రధానంగా పని-జీవితం మధ్య సమతుల్యత, సమానత్వం, ఆకర్షణీయ వేతనాలు, ప్రయోజనాలు చూస్తున్నట్లుగా తెలిపింది.

## కళానిధి మారన్, కేఎఎల్ ఎయిర్‌వేస్‌లకు సుప్రీంకోర్టు షాక్..

### రూ.1300 కోట్ల నష్టపరిహారం తిరస్కరణ




**న్యూఢిల్లీ-నవభూమి:** సుప్రీం కోర్టు జూలై 23, 2025న ఇచ్చిన తీర్పుతో కళానిధి మారన్ ఆధ్వర్యంలోని కేఎఎల్ ఎయిర్‌వేస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్‌పై రూ.1300 కోట్ల నష్టపరిహారం కోరుతూ కేఎఎల్ ఎయిర్‌వేస్ దాఖలు చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పు ఢిల్లీ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. ఢిల్లీ హైకోర్టు మే 23, 2024న కేఎఎల్ ఎయిర్‌వేస్ క్లెయిమ్‌ను పక్కా ప్రణాళికతో కూడిన జూదం అని, వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా దాచడం జరిగిందని పేర్కొంటూ తిరస్కరించింది.కళానిధి మారన్, స్పైస్‌జెట్ మధ్య 2015 నుంచి ప్రమోటర్ల వివాదం నడుస్తోంది. ఈ వివాదం స్పైస్‌జెట్‌లో మారన్ యాజమాన్య హక్కులు, షేర్ల బదిలీ, ఆర్థిక లావాదేవీల చుట్టూ తిరుగుతోంది. ఆ క్రమంలోనే కేఎఎల్ ఎయిర్‌వేస్, స్పైస్‌జెట్‌పై రూ.1300 కోట్ల నష్టపరిహారం కోరుతూ ఢిల్లీ హైకోర్టులో కేసు వేసింది. అయితే, ఈ క్లెయిమ్‌ను హైకోర్టు తిరస్కరించడంతో, మారన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కానీ, సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును ధృవీకరించడంతో మారన్‌కు మరోసారి నిరాశే ఎదురైంది.బకాయిలను కూడా..గతంలో, ఒక ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ కూడా కేఎఎల్ ఎయిర్‌వేస్ రూ.1300 కోట్ల నష్టపరిహారం క్లెయిమ్‌ను తోసిపుచ్చింది. ఈ తీర్పు కేఎఎల్ ఎయిర్‌వేస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా నిలిచింది. అయినప్పటికీ, మే 2024లో కళానిధి మారన్, కేఎఎల్ ఎయిర్‌వేస్ మరోసారి స్పైస్‌జెట్ దాని ఛైర్మన్ అజయ్ సింగ్‌పై రూ.1,323 కోట్ల నష్టపరిహారం కోరుతూ కేసు వేశారు. అదనంగా, రూ.353.50 కోట్ల బకాయిలను కూడా వసూలు చేయాలని వారు కోరారు. ఈ కొత్త క్లెయిమ్‌లు కూడా వివాదంలో భాగంగానే ఉన్నాయి. కానీ సుప్రీంకోర్టు తాజా తీర్పు మారన్ ఆశలకు చెక్ పెట్టింది.
నెక్స్ట్ ఏంటి..స్పైస్‌జెట్, కళానిధి మారన్ మధ్య ఈ వివాదం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు, ఎయిర్‌లైన్ రంగంలో ఆర్థిక ఒప్పందాలు, వాటాల బదిలీలు, వాటాదారుల మధ్య వివాదాల గురించి మరింత అవగాహన కల్పిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత, స్పైస్‌జెట్‌కు ఊరట లభించినట్లు కనిపిస్తుంది. కానీ ఈ వివాదం ఇంకా పూర్తిగా సమసిపోయినట్లు లేదు. ఈ క్రమంలో మారన్ తర్వాత ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

## వాట్సాప్‌లో కుప్పలు తెప్పలుగా మెసేజ్‌లు వస్తున్నాయా..?

### మీ కోసమే స్పెషల్ ఫీచర్ తెస్తున్న మెటా కంపెనీ..!

**న్యూఢిల్లీ-నవభూమి:**వాట్సాప్ యూజర్లకు మెటా కంపెనీ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది యూజర్ల కోసం ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్స్‌ను పరిచయం చేస్తుంటుంది. వాట్సాప్‌లో కుప్పలు తెప్పలు సందేశాలు వస్తుంటాయి. వాటన్నింటిని చదవడం ఇబ్బందికరంగా మారుతున్నది. ఈ క్రమంలోనే సరికొత్తగా వాట్సాప్‌కు 'క్విక్ రీక్యాప్' పేరుతో కొత్త ఏఐ ఎనేబుల్డ్ ఫీచర్‌ను జోడించబోతున్నది. దాంతో యూజర్లు చదవలేని మల్టిపుల్ మెస్సేజెస్ ముఖ్యాంశాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. అంటే ఒక్కో మెసేజ్‌ను చదవాల్సిన అవసరం లేకుండా అన్నింటిని కలిపి ముఖ్యాంశాలను అందిస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ వాట్సాప్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ 2.25.21.12లో బీటా టెస్టర్లకు అందుబాటులో ఉందని వాట్సాప్ ట్రాకర్ వాబీఇన్ఫో తెలిపింది.క్విక్ రీక్యాప్ ఫీచర్ అంటే ?:వాట్సాప్ చాలాకాలంగా వాట్సాప్‌కు దూరంగా ఉన్న.. మల్టిపుల్ చాట్స్‌లో వచ్చిన అన్‌రీడ్ మెస్సేజెస్‌ను చదవాల్సిన యూజర్లకు ఈ ఫీచర్ ప్రత్యేకంగా చాలా ఉపయోగకరంగా ఉండనున్నది. ఇది వాట్సాప్‌లో ఇప్పటికే ఉన్న 'మెస్సేజెస్ సమరీస్' ఫీచర్‌పై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం యూఎస్‌లో చాట్ సారంశాన్ని చూపించే ఫీచర్ అందుబాటులో ఉంది. కానీ, క్విక్ రీక్యాప్ ఫీచర్ దాని కంటే చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉంటుంది. వినియోగదారులు ఒకేసారి ఐదు చాట్‌లను ఎంచుకొని ఏఐ ద్వారా ప్రతి చాట్ సంక్షిప్త సమాచారాన్ని పొందే అవకాశం ఉంటుంది. వాటి మెస్సేజ్ థ్రెడ్‌ల ద్వారా మళ్లీ మళ్లీ స్క్రోల్ చేయకుండా ఉంటుంది. షేర్ చేసిన స్క్రీన్‌షాట్ ప్రకారం, యూజర్లు 'చాట్స్' ట్యాబ్‌లోకి వెళ్లి ఒక్కటి కాదు.. ఒకేసారి ఎన్నో చాట్స్‌ను సెలెక్ట్ చేయొచ్చు. ఎగువ కుడి వైపున పైభాగంలో ఉన్న త్రీ-డాట్ మెనూను టాప్ రైట్‌లో టాప్ చేస్తే.. అక్కడ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని సెలెక్ట్ చేస్తే, మెటా రూపొందించిన మెసేజెస్‌ను విశ్లేషించి, ప్రతి చాట్‌కి చిన్న సమరీని చూపిస్తుంది. ఇలానే యూజర్లకు మెసేజ్ కంటెంట్ త్వరగా అర్థమయ్యేలా చేసి.. అవసరమైన సమాచారం త్వరగా అందించడమే ఈ ఫీచర్ ఉద్దేశ్యం.సెక్యూరిటీ..ఈ ఫీచర్ మెటా 'ప్రైవేట్ ప్రాసెసింగ్' టెక్నాలజీ ఆధారంగా పని చేస్తుంది. యూజర్ల ప్రైవసీ పూర్తిగా రక్షణ ఉంటుందని నివేదిక పేర్కొంది. ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, సెక్యూర్ ఎంక్లేవ్, ఐసోలేటెడ్ కంప్యూటేషన్ వంటి టెక్నాలజీలతో మెసేజెస్ పూర్తిగా సురక్షితంగా ఉండేలా చూసుకుంటారు.

## ఒక్కసారి కడితే.. జీవితాంతం నెలకు రూ.11 వేలు గ్యారెంటీ రిటర్న్స్



**న్యూఢిల్లీ-నవభూమి:**భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) అన్ని వర్గాల ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక పాలసీలను అందుబాటులోకి తీసుకొస్తోంది. కొద్ది నెలల క్రితం తీసుకొచ్చిన కొత్త పెన్షన్ స్కీమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పదవీ విరమణ తర్వాత తర్వాత స్థిరమైన ఆదాయం కావాలనుకునే వారి కోసం న్యూ జీవన్ శాంతి ప్లాన్ తీసుకొచ్చింది. ఈ పాలసీలో ఒకసారి పెట్టుబడి పెడితే చాలు ఆ తర్వాత జీవితాంతం పెన్షన్ మాదిరిగా ఆదాయం పొందవచ్చు. అలా నెలకు రూ.11 వేలకుపైగా గ్యారెంటీ రిటర్న్స్ ఎలా పొందవచ్చు అనేది ఇప్పుడు తెలుసుకుందాం.
ఎల్ఐసీ అందిస్తోన్న కొత్త ప్లాన్ న్యూ జీవన్ శాంతి పాలసీ ఒక సింగిల్ ప్రీమియం, డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్. దీని అర్థం ఒకేసారి లంప్ సమ్ పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన వెయిటింగ్ పీరియడ్ తర్వాత (డిఫర్‌మెంట్ వ్యవధి) పెన్షన్ ప్రారంభమవుతుంది. పాలసీదారు జీవించి ఉన్నంత కాలం పెన్షన్ లభిస్తుంది. దానిని వార్షిక, అర్ధ వార్షిక, త్రైమాసిక, నెల వారీగా పొందేలా ఎంపిక చేసుకునే వీలుంటుంది. ఈ ప్లాన్ నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ సింగిల్ ప్రీమియం పాలసీ. అంటే మార్కెట్ పరిస్థితులతో సంబంధం లేకుండా ఉంటుంది.
ఈ పాలసీలో రెండు ఆప్షన్లు ఉంటాయి. సింగిల్ లైఫ్ ప్లాన్‌లో ఒకేసారి పెట్టుబడి పెట్టాలి. డిఫర్‌మెంట్ వ్యవధి తర్వాత పెన్షన్ పొందుతారు. పాలసీదారు మరణిస్తే, పెట్టుబడి మొత్తం నామినీకి చెల్లిస్తారు. ఇక జాయింట్ లైఫ్ ప్లాన్ ద్వారా పాలసీదారుతో పాటు మరో వ్యక్తి (సాధారణంగా జీవిత భాగస్వామి) కవరేజీ పొందుతారు. డిఫర్‌మెంట్ పీరియడ్ ముగిసిన తర్వాత, పెన్షన్ ప్రారంభమవుతుంది. పాలసీదారు మరణిస్తే అతడి జీవిత భాగస్వామికి పెన్షన్ లభిస్తుంది. ఇద్దరూ మరణించిన తర్వాతే పెట్టుబడి మొత్తం నామినీకి వెళ్తుంది.
30 నుంచి 79 సంవత్సరాల వయసు మధ్య ఉన్న వారు ఈ పాలసీని తీసుకోవచ్చు. కనీసం రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయాలి. గరిష్ఠ పరిమితి ఏమీ లేదు. పెట్టుబడి, పెన్షన్ ప్రారంభానికి మధ్య ఉన్న సమయాన్ని డిఫర్‌మెంట్ పీరియడ్ అంటారు. కనిష్ఠంగా 1 సంవత్సరం, గరిష్ఠంగా 12 సంవత్సరాలు ఉంటుంది.

**నెలకు రూ. 11 వేలు రావాలంటే ఎలా?**

మీకు నెలకు రూ.11 వేలు అంటే ఏడాదికి రూ.1,42,500 యాన్యువల్ పెన్షన్ పొందాలంటే సింగిల్ లైఫ్ ప్లాన్ ఎంచుకుని మీ వయసు 45 సంవత్సరాలు ఉన్నప్పుడు ప్రారంభించారు అనుకుందాం. ఇందుకోసం మీరు రూ.10 లక్షలు ప్రీమియం చెల్లించాలి. డిఫర్ పీరియడ్ 12 ఏళ్లు ఎంచుకున్నారు అనుకుంటే ఆ తర్వాత 57 సంవత్సరాల వయస్సు వచ్చినప్పటి నుంచి ఏడాదికి రూ.1,42,500 చెల్లిస్తుంది ఎల్ఐసీ. ఆరు నెలలకు రూ.69,825 వస్తుంది. మూడు నెలలకు అయితే రూ.34,556, నెలకు అయితే రూ.11,400 పెన్షన్ లభిస్తుంది. ఈ పెన్షన్ జీవితాంతం వస్తూనే ఉంటుంది. పాలసీదారు మరణించిన తర్వాత ప్రీమియం అమౌంట్ రూ.10 లక్షలు నామినీకి వెళ్తుంది. జాయింట్ లైఫ్ ప్లాన్ ఎంచుకుంటే సంవత్సరానికి రూ.1,33,400 చెల్లిస్తారు. ఆరు నెలలకు రూ.65,366, మూడు నెలలకు రూ.32,350, నెలకు రూ.10,672 పెన్షన్ వస్తుంది.

## ఈఎంఐలో రైలు టికెట్లు.. ఐఆర్‌సీటీసీ సూపర్ ఆఫర్..




**న్యూఢిల్లీ-నవభూమి:**చేతిలో డబ్బులుండవు. అర్జంటుగా ఊరికెళ్లాలి. ఎవరి దగ్గర చేబదులు తీసుకోవాలా అనే ఆలోచనలు మనసును ముంచెత్తుంటాయి. కానీ, ప్రయాణికులు అలా చింతించాల్సిన అవసరం లేకుండా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్‌ఈఎంఐలో ట్రైన్ టికెట్ కొనుగోలు చేసే సదుపాయం ప్రవేశపెట్టిందని మీకు తెలుసా. ఇ-కామర్స్ సైట్లలో ఎలాగైతే మనకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేస్తున్నామో.. అచ్చం అలాగే ఇకపై ట్రైన్ టికెట్లు కొనుగోలు చేయవచ్చు. ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ యాప్ ద్వారా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.
ఈఎంఐ ట్రైన్ టికెట్ సేవలను ఐఆర్‌సీటీసీ క్యాష్‌ఈ సంస్థతో కలిసి నిర్వహిస్తోంది. ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ యాప్‌లోని 'ఇప్పుడు ప్రయాణించండి.. తర్వాత చెల్లించండి' అనే ఆప్షన్ ద్వారా ప్రయాణికులు టికెట్ బుక్ చేసుకుని వాయిదా పద్ధతిలో చెల్లించవచ్చు. సాధారణ, తత్కాల్ టికెట్ బుకింగ్ కోసమూ ఈ సేవలను ఉపయోగించుకోవచ్చు.యాప్ వినియోగించే ప్రతి ఒక్కరూ ఎలాంటి డాక్యుమెంటేషన్ సమర్పించకుండానే ఈ సేవలు పొందవచ్చు. 6 లేదా 8 నెలల వ్యవధిలో ఇన్‌స్టాల్?మెంట్లు చెల్లించే సౌకర్యాన్ని ఐఆర్‌సీటీసీ కల్పిస్తోంది. పూర్తి టికెట్ అమౌంట్ మాత్రమే కాకుండా టికెట్ బుకింగ్ సమయంలో కొంత మొత్తం చెల్లించి మిగిలినది ఈఎంఐగా మార్చుకునే వెసులుబాటూ ఉంది. కాలవ్యవధి ఆధారంగా వడ్డీరేటు ఉంటుందని గుర్తుంచుకోవాలి.అయితే, ఈ ఆఫర్ దేశంలోని అన్ని రైళ్లకు వర్తించదు. భారత్ గౌరవ్ రైలుకు మాత్రమే ఈ సౌకర్యం కల్పిస్తోంది %×=జుజ%. దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి రైల్వేశాఖ ఈ రైళ్లను ప్రారంభించింది. గౌరవ్ రైళ్లలో టిక్కెట్లు బుక్ చేసుకునేటప్పుడు మాత్రమే ఆప్షన్ ఎంచుకోగలరు. ఉదాహరణకు సెప్టెంబర్ 13-సెప్టెంబర్ 22 మధ్య నడిచే భారత్ గౌరవ్ రైలులో టికెట్ బుక్ చేసుకున్నారని అనుకుందాం. ఈ రైలు ఎకానమీ క్లాస్ ఛార్జీ ఒక్కొక్కరికి రూ. 18,460, థర్డ్ కోచ్ ఛార్జీ ఒక్కొక్కరికి రూ. 30,480, అదేవిధంగా, కంఫర్ట్ కేటగిరీ ఛార్జీ రూ. 40,300. ఇందులో స్లీపర్ క్లాస్ రైలు టికెట్, హోటల్ వసతి సౌకర్యాలు ఉంటాయి. కానీ, ఈ అధిక ఛార్జీని చెల్లించడంలో చాలామందికి ఇబ్బంది ఉండవచ్చు. కాబట్టే రైల్వేలు సౌకర్యాన్ని అందిస్తున్నాయి.

## షాకింగ్ రిపోర్ట్.. ఆ బడ్జెట్ ఇళ్లకు భారీగా తగ్గిన డిమాండ్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఒకప్పుడు మధ్యతరగతి ఆశలు.. ఆకాంక్షలకు అద్దం పట్టిన సరసమైన గృహాల మార్కెట్ (బడ్జెట్ ఇళ్లు) ఇప్పుడు కనుమరుగైంది. భారతదేశంలోని ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ ట్రెండ్స్ మారిపోయాయి. ఈ ఏడాది జనవరి- జూన్ మధ్య రూ. కోటి కన్నా తక్కువ ధర కలిగిన ఫ్లాట్ల అమ్మకాలు ఏకంగా 32 శాతం తగ్గినట్లు ప్రముఖ స్థిరాస్తి కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా నివేదించింది. దీనికి పూర్తి భిన్నంగా.. ప్రీమియం, లగ్జరీ ఇళ్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ ఇళ్ల అమ్మకాలు 5 శాతం పెరిగినట్లు రిపోర్ట్ స్పష్టం చేస్తోంది. ఇది భారతీయ కొనుగోలుదారుల ప్రాధాన్యతలలో వస్తున్న గణనీయమైన మార్పును సూచిస్తుంది.జనవరి- జూన్ 2025 మధ్య అపార్ట్‌మెంట్లు/ఫ్లాట్ల అమ్మకాలు.. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో 13 శాతం తగ్గి 1,34,776 యూనిట్లుగా నమోదయ్యాయని జేఎల్ఎల్ ఇండియా తన రిపోర్టులో పేర్కొంది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ ఢిల్లీ-%చీజ=%, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, పుణే నగరాల్లో డేటా ఆధారంగా ఈ రిపోర్ట్ రూపొందించింది. రూ. 1 కోటి అంతకంటే ఎక్కువ విలువైన అపార్ట్‌మెంట్లు.. 2025 తొలి అర్ధభాగంలో మొత్తం అమ్మకాల్లో ఏకంగా 62 శాతంగా ఉన్నాయి. అంతకుముందు ఇదే సమయంలో ఈ వాటా 51 శాతం మాత్రమే. జూలై 23 ఎపిసోడ్: తెగించిన వేదవతి.. పాతికేళ్ల తరువాత పుట్టింటి వైపు అడుగులు.. 'ఏపీ డీజీపీ గారి తాలూకా'.. బైక్ నంబర్ ప్లేట్‌పై రాయించిన కానిస్టేబుల్, ఆ తర్వాత ఏమైందంటే ఇండియా హౌసింగ్ మార్కెట్ రిపోర్ట్ ప్రకారం.. ఈ ఇళ్ల అమ్మకాల్లో రోహౌస్‌లు, విల్లాలు, ప్లాటెడ్ డెవలప్‌మెంట్‌లు లేవు. డేటా ప్రకారం, జనవరి-జూన్‌లో రూ. 1 కోటి కంటే తక్కువ ధర కలిగిన అపార్ట్‌మెంట్ల అమ్మకాలు అంతకుముందు ఇదే సమయంతో పోలిస్తే.. 32 శాతం తగ్గి 51,804 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం ఇళ్ల అమ్మకాల్లో దీని వాటా 49 నుంచి 38 శాతానికి తగ్గింది. అయితే, ప్రీమియం అపార్ట్‌మెంట్ల అమ్మకాలు (ఒక్కొక్కటి రూ. 1 కోటి కంటే ఎక్కువ) ఈ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 6 శాతం పెరిగి 82,972 యూనిట్లకు చేరుకున్నాయి."విలాసవంతమైన గృహాల అమ్మకాల్లో స్థిరమైన వృద్ధి.. పెరుగుతున్న కొనుగోలుదారుల ఆర్థిక స్థోమత, మారుతున్న జీవనశైలి ఆకాంక్షలు, పెద్ద, ప్రీమియం జీవన ప్రదేశాలకు పెరుగుతున్న డిమాండ్‌ను సూచిస్తుంది. ప్రీమియం ప్రాపర్టీలపై పెరుగుతున్న ఈ దృష్టి.. రూ. కోటి కంటే తక్కువ విలువైన హౌసింగ్ మార్కెట్లో కార్యకలాపాల్ని తగ్గించింది" అని ఇండియా చీఫ్ ఎకనామిస్ట్, హెడ్ ఆఫ్ రీసెర్చ్ శమంతక్ దాస్ అన్నారు.రికార్డు స్థాయిలో కార్యాలయ స్థలాలను (ఆఫీస్ స్పేస్) లీజుకు ఇవ్వడం వల్ల టాప్-సెవెన్ నగరాల్లో గృహాల డిమాండ్ పెరుగుతోందని రియల్ ఎస్టేట్, నిర్మాణ సంస్థ గ్రూప్ సీఎండీ అంగద్ బేడి అన్నారు.

## అల్టిమేట్ బార్‌టెండర్ 8వ ఎడిషన్ ఛాంపియన్‌షిప్ కోసం రిజిస్ట్రేషన్లను ప్రారంభించిన మంకీ షోల్డర్




**న్యూఢిల్లీ-నవభూమి:**విలియం గ్రాంట్ -సన్స్‌కు చెందిన స్వేచ్ఛాయుత బ్లెండెడ్ మాల్ట్ మంకీ షోల్డర్, భారతదేశంలో బార్‌టెండింగ్ సముదాయం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అల్టిమేట్ బార్‌టెండర్ ఛాంపియన్‌షిప్ 8వ ఎడిషన్‌కు పేర్లు నమోదు చేసుకోవాలని ఆహ్వానిస్తోంది. హై-ఎనర్జీ బార్‌టెండర్ రంబుల్ థీమ్‌తో కొనసాగిస్తూ, ఈ ఏడాది ఛాంపియన్‌షిప్ మరోసారి బార్‌టెండర్లు తమ నైపుణ్యాన్ని, సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ఒక డైనమిక్ వేదికను సృష్టిస్తోంది.గత ఎడిషన్‌ల విజయాన్ని నేపథ్యంగా తీసుకుని, %UBC% 2025 తన సిగ్నేచర్ ప్లేయింగ్ ఫార్మాట్‌ను, గతంలో కన్నా భారీ స్థాయిలో తీసుకువస్తుంది. గత ఏడాది రికార్డు స్థాయిలో 1300ం మంది పేర్లు నమోదు చేసుకోగా, ఈ సీజన్ ఛాంపియన్‌షిప్ ఎనిమిది నగరాలకు ప్రయాణిస్తోంది. జులై 30న న్యూఢిల్లీలో ప్రారంభమై కోల్‌కతా, గోవా, ముంబయి, పుణె, బెంగళూరు, హైదరాబాద్ మరియు గురుగ్రామ్ మీదుగా కొనసాగనుంది. సెప్టెంబరులో ఇండియా ఫైనల్ నిర్వహించనుండా, సిటీ రౌండ్లలోని విజేతలు ఫైనల్స్‌లో హోరాహోరీగా తలపడనున్నారు.పోటీదారులు ఐదు నైపుణ్య ఆధారిత రౌండ్లలో తలపడతారు. ఇందులో కోర్ బార్‌టెండింగ్ నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. వీటిలో పోయరింగ్, నోసింగ్, వేగం మరియు పర్ఫెక్ట్ సర్వ్ ఉంటాయి. ఇవన్నీ పరిశ్రమలోని అత్యుత్తమ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహిస్తారు.భారత విజేత జపాన్‌లోని టోక్యోలో జరిగే మొట్టమొదటి ప్రాంతీయ ఫైనల్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. ఇది DMC వరల్డ్ DJ ఛాంపియన్‌షిప్‌తో కలిపి నిర్వహిస్తారు. ఇది భారతదేశంలోని అగ్రశ్రేణి బార్‌టెండింగ్ ప్రతిభకు ప్రపంచ వేదికను అందిస్తుంది.
దీని గురించి విలియం గ్రాంట్ సన్స్ మార్కెటింగ్ హెడ్ కపిల సేథి కాడ్ మాట్లాడుతూ, "మంకీ షోల్డర్‌లో, మేము ఎల్లప్పుడూ బార్‌టెండింగ్ సముదాయాన్ని ఎంగేజ్ చేయడం, గుర్తించడం, ఉన్నతీకరించడంపై నమ్మకాన్ని ఉంచాము. మంకీ షోల్డర్ అల్టిమేట్ బార్టెండర్ ఛాంపియన్‌షిప్ అనేది దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభ తమ కౌశల్యాలను ప్రదర్శించేందుకు, వృద్ధి చెందేందుకు, వేడుకను ఆచరించుకునేందుకు ఒక వేదికను అందించే మా మార్గం. ఈ 8వ ఎడిషన్‌తో, ఈ ఏడాది విజేత ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. మేము దానిని ఒక అడుగు ముందుకు తీసుకువెళుతున్నందుకు గర్విస్తున్నాము. సమాజం ఎంత దూరం వచ్చిందో, ఇంకా ఎంత సామర్థ్యం ముందుకు ఉందో చెప్పడానికి ఇది నిదర్శనం" అని పేర్కొన్నారు.

## కార్పొరేట్లకు పన్ను రాయితీలు.. మోదీ సర్కార్‌కు రూ. 99 వేల కోట్ల లాస్.. కేంద్రం కీలక ప్రకటన!

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వం.. కార్పొరేట్లకు పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్ల దాదాపు రూ. 99,000 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి రాజ్యసభలో తెలిపారు. పన్ను రేట్లు తగ్గించడం ద్వారా పెట్టుబడులు పెరిగి, ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. అయితే దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతోందని నివేదికలు చెబుతున్నాయి. ఈ విధానం ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందా లేక నష్టం కలిగిస్తుందా అనే చర్చ జరుగుతోంది. కార్పొరేట్ కంపెనీలకు పన్ను రాయితీలు ఇవ్వడం అనేది ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందా లేదా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుందా? ఈ ప్రశ్న ఇప్పుడు పార్లమెంటులో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన భారీ పన్ను ప్రోత్సాహకాల కారణంగా ప్రభుత్వం దాదాపు రూ. 99,000 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మంగళవారం రోజు రాజ్యసభలో వెల్లడించారు. ఇది ప్రభుత్వ ఖజానాపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతోంది. 2016 నుంచి కార్పొరేట్ పన్ను రేట్లు క్రమంగా తగ్గించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో మినహాయింపులు, ప్రోత్సాహకాలను తొలగించారు.2019-20 నుంచి 2023-24 వరకు కార్పొరేట్ పన్నులో వివిధ తగ్గింపుల ద్వారా పన్ను ప్రోత్సాహకాల కారణంగా అంచనా వేసిన ఆదాయ నష్టాన్ని.. పంకజ్ చౌదరి రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ఈ వివరాలు వెల్లడించారు.2023-24లో ఈ కార్పొరేట్ పన్ను ఆదాయ నష్టం రూ. 98,999 కోట్లుగా ఉంది, ఆ తర్వాత 2022-23లో రూ. 88,109 కోట్లుబీ 2021-22లో రూ. 96,892 కోట్లుగా నమోదైంది. 2020-21, 2019-20లో మొత్తం కార్పొరేట్ పన్ను ఆదాయ నష్టం వరుసగా రూ. 75,218 కోట్లు, రూ. 8,043 కోట్లుగా ఉంది.2019-20 నుంచి 2024-25 వరకు కార్పొరేట్ పన్ను తగ్గింపుల కారణంగా ఖజానాకు జరిగిన అంచనా నష్టం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలను రాఘవ్ చద్దా ప్రశ్నించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు అంచనా వేసిన ఆదాయ నష్టం అందుబాటులో లేదని చౌదరి తెలిపారు.ఫైనాన్సియల్ యాక్ట్-2016 ద్వారా వృద్ధిని ప్రోత్సహించడానికి, పెట్టుబడులను పెంచడానికి, ఎక్కువ ఉద్యోగ అవకాశాలను సృష్టించడానికి కార్పొరేట్ పన్ను రేట్లను మొత్తం ఆదాయంలో 29 శాతానికి తగ్గించారు. 2017లో వార్షిక టర్నోవర్ రూ. 50 కోట్లు కలిగిన చిన్న దేశీయ కంపెనీలను మరింత లాభదాయకంగా చేయడానికి, సంస్థలను కంపెనీ ఫార్మాట్‌కు మార్చేందుకు ప్రోత్సహించడానికి కార్పొరేట్ పన్ను రేట్లను మొత్తం ఆదాయంలో 25 శాతానికి తగ్గించారు.2019 సెప్టెంబరులో ప్రభుత్వం అప్పటికే ఉన్న కంపెనీలకు బేస్ కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. ఇంకా అక్టోబర్ 1, 2019 తర్వాత విలీనమైన కొత్త తయారీ సంస్థలకు అన్ని మినహాయింపులు, ప్రోత్సాహకాలను వదులుకుంటే 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించింది. ఇదే సమయంలో.. ప్రభుత్వం పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు ఇంకా వృద్ధిని ప్రోత్సహించేందుకు పన్ను విధానాల్ని ఎలా ఉపయోగిస్తుందో కూడా స్పష్టం చేస్తున్నాయి.

## బంగారం ధర మరింత పైకి.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం ధర క్రమంగా మళ్లీ ఆల్ టైమ్ గరిష్టానికి చేరువ అవుతోంది. ఇటీవల మళ్లీ లక్ష రూపాయలను దాటిన పది గ్రాముల బంగారం ధర ఈ రోజు మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జులై 23న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 01, 300కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 92, 860కి చేరింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 01, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 93, 010కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1, 01, 300కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 92, 860కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద మేర పెరిగాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ గురువారం 24 । జులై । 2025

## ఓవర్సీస్‌లో హరిహర వీరమల్లుకి లైన్ క్లియర్

అయితే ఈ సినిమా ఓవర్సీస్ ప్రీమియర్స్ విషయంలో ఇటీవల చిన్న సమస్య ఏర్పడింది. అనుకోని కారణాల వలన ఈ సినిమా డిజిటల్ ప్రింట్ అందలేదని ఓవర్సీస్‌కి చెందిన నిర్మాణసంస్థ పోస్ట్ పెట్టింది. దీంతో ఈ మూవీ చూద్దామనుకున్న అభిమానులు ఆందోళనలో పడ్డారు. అయితే తాజాగా ఈ సమస్య క్లియర్ అయినట్లు సదరు సంస్థ పోస్ట్ పెట్టింది. తమకు ఓవర్సీస్‌కి చెందిన ప్రింట్‌లు




వచ్చేశాయని పేర్కొంది. అలాగే ఈ మూవీ దాదాపు 2 గంటల 45 నిమిషాలు రన్‌టైంతో రాబోతున్నట్లు ప్రకటించింది. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించగా.. బాబీ డేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

నవచిత్ర



## మళ్లీ కలుద్దామా..? అల్లు అర్జున్ కోసం ఎదురుచూస్తున్న పూజ హెగ్డే



అలా వైకుంఠపురంలో, అరవింద సమేత లాంటి బ్లాక్ బస్టర్ సినిమాల్లో నటించింది. అయితే గత కొద్ది రోజుల నుంచి..మాత్రం ఈ హీరోయిన్ కెరియర్ అంత సాఫీగా సాగడం లేదు. వరుస ఫ్లాపులతో తెగ సతమతమవుతోంది ఈ బుట్ట బొమ్మ. ఈ మధ్య విడుదలైన సూర్య సినిమా రెట్రో.. పైన ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ ఆ చిత్రం సైతం.. డిజాస్టర్‌గా నిలిచింది. చిరంజీవి ఆచార్య, ప్రభాస్ రాధే శ్యామ్ సినిమా దగ్గర నుంచి.. నిన్న మొన్నటి వరకు విడుదలైన పూజ సినిమాలు అన్నీ కూడా.. వరుస ఫ్లాపులుగా నిలిచాయి. ఇక దీంతో మంచి అవకాశాల కోసం తెగ ఎదురుచూస్తోంది ఈ హీరోయిన్. ఈ క్రమంలో పూజా హెగ్డే.. అల్లు అర్జున్ కోసం పెట్టిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తోంది. అసలు విషయానికి వస్తే.. అల్లు అర్జున్, పూజ హెగ్డే కలిసి నటించిన అలా వైకుంఠపురంలో.. చిత్రం అప్పట్లో బ్లాక్ బస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా కన్నా ముందు.. ఈ ఇద్దరి జంట డీజే సినిమాతో.. అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహించగా.. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరితో కలిసి పూజా హెగ్డే.. తన ఇంస్టాగ్రామ్ స్టేటస్ లో ఒక ఫోటో పెట్టింది. పక్కన హరీష్ శంకర్, దేవి శ్రీ ప్రసాద్ తో పెట్టుకొని ఫోటో తీసుకున్న పూజ పాప.. దానికి క్యాప్షన్ గా.. "మళ్లీ డీజే రి యూనియన్ కి ఛాన్స్ ఉందా.. అల్లు అర్జున్ ఎక్కడ ఉన్నావు..?" అంటూ బన్నీని ట్యాగ్ చేసింది.

## కొత్తగా తల్లి అయిన వారికి తక్కువ పని గంటలుండాలి : విద్యాబాలన్



సినీ పరిశ్రమలో పని గంటలపై జరుగుతున్న చర్చ ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ నటి విద్యాబాలన్ ఈ అంశంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యంగా.. ఇటీవల నటి దీపికా పదుకొనే, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాల మధ్య 'స్పిరిట్' సినిమా విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో, విద్యాబాలన్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తాజాగా 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విద్యాబాలన్ మాట్లాడుతూ.. పరిశ్రమలో కొత్తగా తల్లి అయిన హీరోయిన్‌లకు లేదా ఇతర రంగాలలో చేసే ఆడవారికి సౌకర్యవంతమైన, తక్కువ పని గంటలు ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది. దీనివలన తల్లి బిడ్డతో గడపడంతో పాటు తనను తాను మేనేజ్ చేసుకుంటుందని విద్యా చెప్పుకొచ్చింది. అలాగే ఇటీవల పరిశ్రమలో తక్కువ పనిగంటలు. అనుకూలమైన వర్కింగ్ అవర్స్ కావాలని కోరుతున్నారు. ఇది కూడా సరైనదే అని అనుకుంటున్నాను. అయితే నా విషయంలో నేను చేసే సినిమాలకు, ఎనిమిది గంటలు మాత్రమే షూట్ చేయలేము. నేను ఇప్పుడు తల్లిని కాదు కాబట్టి, నాకు 12 గంటల షిఫ్ట్ చేయడానికి అభ్యంతరం లేదు. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ షూటింగ్ చేసిన నేను జాయిన్ అవుతానంటూ విద్యా ఇంటర్వ్యూలో తెలిపింది.

## సొంత ఇంట్లోనే తను శ్రీ దత్తా నరకం!



బాలీవుడ్ నటి తను శ్రీదత్తా మీటూ ఉద్యమం తో దేశ వ్యాప్తంగా ఎంత సచల నమైందో తెలిసిం దే. ఆమె స్ఫూర్తితో ఎంతో మంది బా ది త మహిళలకు మీడి యా ముందుకొచ్చి తమకు జరిగిన అన్యాయంపై గళ మెత్తారు. కాస్టింగ్ కౌచ్ పేరుతో తను శ్రీ పై ఎలాంటి దాడులు జరిగాయన్నది? దేశ వ్యాప్తంగా ఎంతో సంచలనమైంది. బాలీవుడ్ నటుడు నానా పటేకం పై తను శ్రీ చేసిన ఆరోపణలపై పెద్ద చర్చే జరిగింది. ఆ సంగతి పక్కనబెడితే.. తాజాగా తను శ్రీ దత్తా మరోసారి వార్తల్లోకి ఎక్కింది.ఆరు సంవత్సరాలుగా ఇంట్లోనే వేధింపులకు గురవుతున్నానని ఆవేదన చెందింది. దీనికి సంబంధించి ఇన్ స్టాలో ఓ వీడియో షేర్ చేసింది. ఇందులో తను శ్రీ కన్నీటి పర్యంతం అవుతూ మాట్లాడింది. 'నా ఇంట్లోనే నన్ను వేధిస్తున్నారు. ఏం మాట్లాడలేను. ప్రశాంతంగా ఉండలేకపోతున్నాను. పోలీసులకు ఫోన్ చేసాను. వారు స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయమంటున్నారు. వీలు చూసుకుని వెళ్తాను. భద్రత లేకుండా పోయింది. ఇంటికొచ్చి మరీ వేదిస్తున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు.నా ఆరోగ్యం కూడా క్షీణించింది. పని మనిషిని కూడా పెట్టుకోలేకపోయాను. గతంలో వచ్చిన పని మను షులు వస్తువులు దొంగిలించారు. దీంతో ఇప్పుడన్నీ పనులు నేనే చేసుకుంటున్నానన్నారు. అలాగే మరో వీడియోలో రాత్రివేళలో తన ఇంటి బయట వినిపించే శబ్దాలను రికార్డు చేసి పోస్ట్ చేసి మరింత ఆందోళ నకు గురి చేస్తున్నారంది. నిద్రలేక, ప్రశాంతత లేక ఉక్కిరిబిక్కిరవుతున్నాను. ఇది కూడా వేధింపుల భాగమేనని అభిప్రాయపడింది.ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మాం డంతో నెటి జనులు ఆమెకు మద్దతుగా నిలిచారు. ఎంతో బాధాకరమైన విషయం. ఆమెకు తక్షణ సహాయం అందాలి. ఒక నటికి భద్రత లేకపోవడం అన్నది అత్యం హేయమైన చర్య. పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. గతంలో ఆమె చేసిన లైంగిక ఆరోపణల్లో భాగంగానే ఆమె ప్రత్యర్థులు దాడులకు దిగుతున్నారని ప్రచారం జరుగుతోంది.

## మహేశ్, తారక్‌తో నటించాలని ఉందన్న దీపిక..!



షరతుల చిట్టా విప్పి సందీప్‌రెడ్డి వంగా ఆగ్రహానికి గురై 'స్పిరిట్' అవకాశాన్ని చేజార్చుకున్న బాలీవుడ్ భామ దీపికా పదుకొనే.. రీసెంట్‌గా అల్లు అర్జున్, అట్లీ సినిమాకు సైన్ చేసింది. దాంతో ఒకచోట పోగొట్టుకున్న అవకాశం మరోచోట దక్కినట్టయ్యింది ఈ అందాలభామకు. 'కల్కి 2898ఏడీ'లో ప్రభాస్.. అట్లీ సినిమాతో బన్నీ.. ప్రస్తుతానికి టాలీవుడ్‌కి చెందిన ఇద్దరు అగ్రహీరోలు కవర్ అయిపోయారు. అయితే.. దీపికా తీరు చూస్తుంటే వీరిద్దరితో ఆగేలా లేదు. టాలీవుడ్ అంతా కవర్ చేసేందుకు ప్రణాళికలే రచిస్తున్నట్టుంది ఈ బెంగళూరు భామ. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో 'నేను టాలీవుడ్‌లో మహేష్, తారక్‌ల అభిమానిని. వారిద్దరూ నటనలో మాస్టర్స్. వారితో కలిసి నటించాలనుంది.' అంటూ పేర్కొన్నది. దీపికా నోటి వెంట మహేష్, తారక్‌ల ప్రస్తావన రావడం ప్రస్తుతం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. గతంలో టాలీవుడ్‌లో మీకెవరు తెలుసు? అనడిగితే 'మహేష్' అని అదోలా నవ్వుతూ.. మిగతా హీరోలెవరూ తెలీనట్టు ప్రవర్తించిన దీపిక.. ఇప్పుడు టాలీవుడ్ హీరోలకు భజన చేయడం చూసి.. 'మార్పు మంచిదే' అంటూ వెటకారంగా కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు.

## బాక్సాఫీస్ వద్ద ఆ రికార్డు కూడా చినిగిపోయేలా!

బాక్సాఫీస్ వద్ద అప్పుడప్పుడు అద్భుతాలు జరుగుతుంటాయి. కొన్ని సినిమాల విషయంలో ముందే కొన్ని అంచనాలుంటాయి. వాటిని అందుకోవడంలో కొన్ని సఫలమవుతాయి. మరికొన్ని విఫలమవుతుంటాయి. మరికొన్ని మాత్రం ఎలాంటి అంచనాలు లేకుండా సంచనాలు నమోదు చేస్తుంటాయి. తాజాగా బాలీవుడ్ లో 'సైయారా' అలాంటి రికార్డుల దిశగానే అడుగులు వేస్తోంది. ఇందులో స్టార్ నటులు లేరు. పెద్దగా ప్రచారం కూడా జరగలేదు. అసలు ఈ సినిమా గురించి జనాలకు నిన్న మొన్నటి వరకూ తెలియను కూడా లేదు. కానీ నేడు ఈ సినిమా టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. మౌత్ టాక్ పవర్ ఏంటో మరోసారి నిరూపించింది.



గత శుక్రవారం రిలీజ్ అయిన ఈ సినిమా 5 రోజుల్లోనే 150 కోట్ల వసూళ్లను కొల్లగొట్టింది. దీంతో 'ఆషీకీ 2' మొదటి ఐదు రోజుల లైఫ్ టైమ్ కలెక్షన్లను దాటేసిందని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ సినిమా దర్శ కుడు కూడా 'ఆషీకీ 2' తెరకెక్కించిన మోహిత్ సూరినే కావడం విశేషం. మరోసారి తనదైన మార్క్ ఎమో షన్ పండటంతోనే ఈ ఫీట్ సాధ్య మైంది. అప్పట్లో ఆషీకీ 2 అంత పెద్ద విజయం సాధించిందంటే లవ్ స్టోరీ కం బలమైన ఎమోషన్ ఉండటంతోనే గొప్ప విజయం సాధించింది. మళ్లీ అదే ఎమోషన్ తో మోహిత్ తన రికార్డను తానే బద్దలు కొట్టాడు. దీంతో సినిమాకు ఎమోషన్ అన్నది ఎంత బలంగా పనిచేస్తుందన్నది మరోసారి ప్రూవ్ అయింది. సింపుల్ లవ్ స్టోరీతోనే ఓ అద్భుతం సృష్టించాడు. క్రిష్ , వాణీ పాత్రలు పోషించిన ఆహాన్ పాండే, అనీత్ పడ్డా ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాదిం చుకున్నారు. ఇద్దరు కొత్త వారే అయినా? తమ నటనతో ప్రేక్షకుల్ని కట్టిపడేసారు. సినిమా చూస్తున్నంత సేపు ఎక్కడా కొత్త నటీనటులు కాదనే భావనే కలుగుతుంది. మ్యూజికల్ గానూ మంచి హిట్ అయింది. సినిమా పాటలకు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. 'ఆషీకీ 2' లాంగ్ రన్ లో 250 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. 'సైయారా' కూడా ఆ వసూళ్లను బీట్ చేస్తుందనే అంచనాలు బలంగా ఉన్నాయి. ఈ సినిమాకు రివ్యూలు కూడా పాజిటివ్ గా రావడం కలిసొచ్చింది. కంటెంట్ ఉంటే కటౌట్ తో పనిలేదని బాలీవుడ్ లోనూ మరోసారి ప్రూవ్ అయింది.

## శ్రీదేవి భర్తలో ఇంత చేంజ్ ఏంటి..25 కేజీలు తగ్గిన బోనీ కపూర్



బాలీవుడ్ సీనియర్ నిర్మాత, అతిలోక సుందరి శ్రీదేవి భర్త బోనీ కపూర్ తన న్యూ లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఒకప్పుడు భారీ ఖాయంతో కనిపించిన ఆయన, ఇప్పుడు ఒక్కసారిగా స్లిమ్‌గా మారిపోయారు. ఏకంగా 25 కేజీల బరువు తగ్గడం వెనక తన కఠినమైన ఆహార నియమాలే కారణమని బోనీ తెలిపారు. ఈ మార్పు చూసిన ప్రతి ఒక్కరూ షాక్‌కు గురవుతున్నారు. తాజాగా బయటకొచ్చిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిజంగా ఇతను బోనీ కపూరేనా అని కొందరు ఆశ్చర్యపోతున్నారు. ఆర్. మాధవన్ తరహాలోనే బోనీ కూడా జిమ్‌కు వెళ్లకుండా కేవలం డైట్‌తోనే బరువు తగ్గినవారిలో ఒకరిగా నిలిచారు.మాధవన్ ఆ మధ్య మాట్లాడుతూ.. సరైన ఆహార నియమాలతో బరువు తగ్గొచ్చని చెప్పారు. ఇప్పుడు దానిని బోనీ చేసి చూపించారు. ఇక బోనీ కపూర్ డైట్ ప్లాన్ గురించి చెబుతూ.. ఉదయం అల్పాహారంలో పండ్లు, పండ్ల రసాలు, జవర్ రోటీ మాత్రమే తీసుకున్నాను. మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో సలాడ్లు, సూప్‌లు వంటి తేలికపాటి ఆహారం తీసుకున్నట్టు చెప్పారు. ముఖ్యంగా కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే ఆహారమే తీసుకున్నానన్నారు. అనవసరమైన విందులు, ఫంక్షన్స్ వంటివి పూర్తిగా వదిలేశానని చెప్పారు. ఈ మార్పు వెనక ఎలాంటి మాయ, ప్రత్యేక ట్రైనింగ్ ఏమి లేదు కేవలం డెడికేషన్, ఆత్మనిబ్బరం మాత్రమే ఉన్నాయి అంటూ బోనీ స్పష్టం చేశారు. ఇది పూర్తిగా సహజమైన మార్పు అని, దీనికోసం జిమ్ అవసరం లేదని తెలిపారు. ఇప్పటికే బోనీ కొత్త లుక్‌పై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. చాలామంది ఆయన డిసిప్లిన్‌ను మెచ్చుకుంటున్నారు. అంత వయస్సులో ఇటువంటి ఫిట్‌నెస్ సాధించటం నిజంగా గొప్ప విషయం అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. బోనీ కపూర్ డైట్ మార్గం ఎంతో మందికి ఇన్‌స్పిరేషన్‌గా మారింది. జిమ్‌కె వెళ్లలేని వారు సరైన ఆహార నియమాలతో కూడా బరువు తగ్గవచ్చని ఇది మరోసారి రుజువైంది. కొద్ది రోజుల క్రితం హీరో శింబు కూడా సినిమాలోని పాత్ర కోసం దాదాపు పది కేజీల బరువు తగ్గిన విషయం తెలిసిందే.

## స్ట్రాంగ్‌గా కనిపిస్తున్నా లోలోపల



బుల్లితెరపై సందడి చేసే అందాల భామ రష్మీ గౌతమ్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గతంలో పలు సినిమాల్లో నటించిన రష్మి వాటి ద్వారా పెద్దగా బ్రేక్ అందుకోలేకపోయారు. కానీ ఎప్పుడైతే జబర్దస్త్ షో లో రష్మీ అడుగుపెట్టారో అప్పట్నుంచి తన కెరీరే మారిపోయింది. ప్రస్తుతం బుల్లితెర యాంకర్లుగా రాణిస్తున్న వారిలో రష్మీ కూడా ఒకరు. కేవలం జబర్దస్త్ మాత్రమే కాకుండా పలు షో లకు యాంకర్‌గా వ్యవహరి స్తున్న రష్మీ సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటారనే విషయం తెలిసిందే. ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా వెల్లడించే రష్మీ ఇప్పుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఓ నెల రోజుల పాటూ తన సోషల్ మీడియా అకౌంట్స్ కు బ్రేక్ ఇవ్వనున్నట్టు రష్మీ ఓ పోస్ట్ చేస్తూ దాన్ని డిజిటల్ డీటాక్స్ అని పేర్కొన్నారు. ఆ పోస్ట్ లో ఓ నెల రోజుల పాటూ డిజిటల్ డీటాక్స్ పాటించాలనుకుంటున్నానని ఇప్పటికే వ్యక్తిగతంగా, ప్రొఫెషనల్‌గా చాలా లోగా ఉన్నానని, కొన్ని సార్లు సోషల్ మీడియా మన నిర్ణయాలను ప్రభావితం చేస్తుందని, అది మన ఆలోచనలపై, మానసిక స్థితిపై చాలా తీవ్రంగా ప్రభావం చూపుతుందని, అందుకే నెల రోజుల పాటూ రెస్ట్ తీసుకుంటున్నానని చెప్పారు. మళ్లీ తిరిగి వచ్చే టైమ్ కు ఇప్పటి కంటే స్ట్రాంగ్ గా ఉంటానని, డబుల్ ఎనర్జీతో తిరిగి వస్తానని, అలా రావాలంటే ఇప్పుడు ఉన్న ఎనర్జీని మళ్లీ తిరిగి తెచ్చుకోవాలి, దానికి ఇప్పుడు తనకు ఆత్మపరిశీలన కూడా అవసరమని, ఇది సోషల్ మీడియా ప్రభావం లేకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ఉంటేనే కుదురుతుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఎలాంటి సిట్యుయేషన్ లోనైనా మీరంతా నన్ను స్ట్రాంగ్ అమ్మాయిగానే చూశారని, కానీ నిజానికి లోపల చాలా కుమిలిపోతున్నానని, అందుకే కొన్ని విషయాలు సర్దుబాటు చేసుకోవాల్సిన టైమొచ్చిందని, మీకు టచ్ లో లేకపోయినా మీరు చూపించే ప్రేమ, సపోర్ట్ ఎప్పుడూ ఇలానే ఉంటాయని ఆశిస్తున్నానని ఎమోషనల్ పోస్ట్ చేశారు రష్మీ.

## వన్డే సిరీస్‌ను నెగ్గిన టీమిండియా.. ఆఖరి వన్డేలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సెంచరీ.. ఆరు వికెట్లు పడగొట్టిన క్రాంతిగౌడ్




**ఇంగ్లండ్-నవభూమి:** ఇంగ్లండ్ పర్యటనలో భారత మహిళల జట్టు అద్భుతంగా రాణించి మూడు వన్డేల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకున్నది. ఆతిథ్య జట్టుతో దర్హమ్ వేదికగా మూడో వన్డే జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసి టీమిండియా 50 ఓవర్లకు ఐదు వికెట్ల నష్టానికి 318 పరుగులు భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుత బ్యాటింగ్ (102 పరుగులు) చేసి కెరీర్‌లో ఏడో శతకాన్ని నమోదు చేసింది. 82 బంతుల్లో 14 ఫోర్ల సహాయంతో 102 పరుగులు చేసింది. జెమీమా రోడ్రిగ్స్ (50 పరుగులు)తో నాలుగో వికెట్‌కు 110 పరుగులు జోడించింది. హర్లీన్ (45), మంధన (45) రాణించారు. చివరలో వికెట్ కీపర్ కం బ్యాటర్ రిచా ఘోష్ 18 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 38 పరుగులు చేయడంతో టీమిండియా భారీ స్కోర్ సాధించింది. అయితే, 40 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసిన టీమిండియా.. చివరి పది ఓవర్లలో ఏకంగా 120 పరుగులు చేసింది. తొలుత 54 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్.. సెంచరీని మిగతా 28 బంతుల్లోనే పూర్తి చేసింది. ఇంగ్లండ్ బౌలర్లు లారెన్ బెల్, లారెన్ ఫైలర్, షార్లెట్ డీన్, సోఫీ ఎక్లెస్టోన్, లిన్సే స్మిత్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. టీమిండియా విధించిన 319 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు ఇంగ్లండ్ 305 పరుగులకే ఆలౌట్ అయ్యింది. టీమిండియా బౌలర్ క్రాంతి గౌడ్ తొలుత ప్రారంభంలోనే రెండు వికెట్లు తీసి భారత జట్టులో ఉత్సాహం నింపింది. ఆమీ జోన్స్ (4), టామ్సిన్ బ్యూమాంట్ (2) కాంత్రి బౌలింగ్‌లో పెవిలియన్‌కు చేరారు. ఆ తర్వాత ఎమ్మా లాంబ్ (68), నట్ స్కీవర్ బ్రంట్ (98) ఇంగ్లండ్ స్కోర్ బోర్డ్‌ను పరుగులెత్తించారు. మూడో వికెట్‌కు ఇద్దరు 160 పరుగులకుపైగా భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఇంగ్లండ్ 170 పరుగుల వద్ద ఎమ్మా లాంబ్‌ను చరణి క్లీన్ బౌల్డ్ చేసి.. ఈ జోడీని విడదీసింది. ఆ తర్వాత నటాలీ స్కీవర్ బ్రంట్‌ను దీప్తిశర్మ పెవిలియన్‌కు పంపింది.

## చివరి టీ20లో భారీ హిట్టింగ్.. అంతర్జాతీయ క్రికెట్‌కు రస్సెల్ గుడ్‌బై



**న్యూఢిల్లీ-నవభూమి:** వెస్టిండీస్ బ్యాటర్ ఆండ్రే రస్సెల్‌అంతరాజతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇవాళ అతను తన చివరి టీ20 మ్యాచ్ ఆడేశాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఆ మ్యాచ్‌లో అతను సూపర్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ఆఖరి మ్యాచ్‌లో అతను చెలరేగిపోయాడు. 15 బంతుల్లో 36 రన్స్ చేసి అతను ఔటయ్యాడు. 37 ఏళ్ల రస్సెల్ టీ20 కెరీర్‌లో 1122 రన్స్ చేశాడు. అతను 86 మ్యాచ్‌లు ఆడాడు. వాటిల్లో 163 స్ట్రయిక్ రేట్ ఉన్నది. రస్సెల్ తన టీ20 కెరీర్‌లో 61 అంతర్జాతీయ వికెట్లను తీసుకున్నాడు.సబినా పార్క్ మ్యాచ్‌లో విండీస్ ఫస్ట్ బ్యాటింగ్ చేసింది. 20 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్లు కోల్పోయి 172 రన్స్ చేసింది. ఓ దశలో 98 రన్స్‌కే కీలకమైన అయిదు వికెట్లు కోల్పోయిన విండీస్‌ను రస్సెల్ ఆదుకున్నాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లు ఉన్నాయి. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా సునాయాసంగా చేధించింది. కేవలం రెండు వికెట్లు కోల్పోయి 16వ ఓవర్‌లో ఆ టార్గెట్‌ను అందుకున్నది. జోష్ ఇంగ్లిష్, కెమరూన్ గ్రీన్.. హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు.

నవక్రీడ

## గెలిస్తేనే నిలిచేది.. నేటి నుంచి మాంచెస్టర్ టెస్ట్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రతిష్ఠాత్మక అండర్సన్-టెండూల్కర్ టెస్టు సిరీస్‌లో భారత్, ఇంగ్లండ్ మధ్య కీలక పోరుకు రంగం సిద్ధమైంది. బుధవారం నుంచి ఇరు జట్ల మధ్య మాంచెస్టర్ వేదికగా నాలుగో టెస్టుకు తెరలేవనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-2తో వెనుకంజలో ఉన్న టీమ్‌ఇండియా.. గెలిస్తేనే నిలిచే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. లార్డ్స్ టెస్టులో పోరాడి ఓడిన గిల్‌సేన.. మాంచెస్టర్‌లో ఏండ్లుగా ఊరిస్తున్న విజయాన్ని ఒడిసిపట్టుకోవాలని చూస్తున్నది. ఓవైపు గాయాలు వేధిస్తున్న వేళ తుది జట్టు కూర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. స్టార్ పేసర్ బుమ్రా బరిలోకి దిగేది ఖరారు కాగా, వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ పూర్తిగా కోలుకోవడం టీమ్‌ఇండియాకు గొప్ప ఉపశమనంగా మారాయి. అడ్డంకులను అధిగమిస్తూ మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను సమం చేస్తుందా లేక కోల్పోతుందా అన్నది ఆసక్తికరం. లార్డ్స్ టెస్టు విజయమిచ్చిన ఆత్మవిశ్వాసంతో ఉన్న ఇంగ్లండ్ అదే జోష్‌తో భారత్‌కు చెక్ పెట్టాలని చూస్తున్నది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**